


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

# భోగా భూగీ!

## అంబరాన్నంటనున్న సంబరం




పూర్తి కథనాలు లోపలి పేజీలలో...

## టేకాఫ్‌కు రెడీ

- మీ రాకకై ఎదురు చూస్తున్నాం..
- ప్రధాని మోదీ పోస్టును రీపోస్ట్ చేసిన సీఎం

అమరావతి (చైతన్య రథం): భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. దీన్ని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మోదీ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. "భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నాం. ఇది దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో మరో కీలక మైలురాయి" అని పేర్కొన్నారు. ప్రధాని పోస్టును సీఎం చంద్రబాబు షేర్ చేశారు. "ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధంగా ఉంది మోదీజీ. మీ రాకకు ఎదురు చూస్తున్నాం" అని సీఎం పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త ఊపిరి లభిస్తుందని.. పెట్టుబడులు, పర్యాటకం, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించనున్నాయని కూటమి ప్రభుత్వం భావిస్తోంది.

## ప్రధాని మోదీ ఏపీకి రాక

### రూ. 17.9 వేల కోట్ల ప్రాజెక్టులు జాతికి అంకితం

ఢిల్లీ (చైతన్య రథం): ప్రధానమంత్రి నరేంద్రమోదీ భోగాపురం పర్యటనపై పీఎంవో అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఆగస్టు 1న ఏపీ, కర్ణాటకలో మోదీ పర్యటిస్తారని తెలిపింది. విజయనగరం జిల్లా భోగాపురంలో రూ.17,900 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారని పేర్కొంది. పీఎంవో విడుదల చేసిన సమాచారం ప్రకారం.. రూ.5,640 కోట్ల వ్యయంతో నిర్మించిన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని ప్రారంభిస్తారు. రూ.460 కోట్లతో విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న ఆంధ్రప్రదేశ్ తొలి సెమీకండక్టర్ తయారీ కేంద్రానికి శంకుస్థాపన చేస్తారు. ఈ ప్లాంట్‌లో ఏడాదికి సుమారు 9.6 కోట్ల (96 మిలియన్) సెమీకండక్టర్ చిప్‌లు తయారీ చేయనున్నారు. రూ.5,550 కోట్లతో ఏర్పాటుచేస్తున్న కర్నూలు-IV పునరుత్పాదక ఇంధన జోన్ విద్యుత్ ప్రసార వ్యవస్థ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం.. కర్నూలు, అనంతపురం సోలార్-విండ్ ఎనర్జీ జోన్లకు సంబంధించిన రూ.3,550 కోట్లు, రూ.820 కోట్ల ట్రాన్స్ మిషన్ ప్రాజెక్టుల ప్రారంభిస్తారుర. రూ.1,880 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రారంభించి, కొన్నింటికి శంకుస్థాపన చేస్తారు. ఈ రహదారి ప్రాజెక్టులతో విజయవాడలో ట్రాఫిక్ రద్దీ తగ్గడం, విశాఖ- హైదరాబాద్ ప్రయాణ సమయం తగ్గడంతోపాటు ప్రాంతీయ అనుసంధానం మెరుగుపడనుంది. అనంతరం మైసూరులో స్వామి వివేకానంద సాంస్కృతిక యువ కేంద్రాన్ని ప్రధాని ప్రారంభించి సభను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.



## రెక్కలు విప్పిన ఉత్తరాంధ్ర

- అల్లూరి విమానాశ్రయం ప్రారంభానికి సర్వం సిద్ధం
- ఆర్థిక ప్రగతికి ఊతమిచ్చేలా కార్యకలాపాలు
- తెలుగు కళలు, సంస్కృతి ఉట్టిపడేలా తీర్చిదిద్దిన ప్రాంగణం
- ట్రాఫిక్, జన సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశాలు

2



3

రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆస్ట్రేలియా మంత్రి జూలియన్ హిల్‌ను శుక్రవారం గన్నవరం ఎయిర్‌పోర్టులో సాదరంగా స్వాగతిస్తున్న విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్




## ఎయిరిండియా ఫ్లైట్ షెడ్యూల్ రిలీజ్

2



13 వేల మంది గిరిజన బాలికలు. ఏక కాలంలో ప్రదర్శించిన థింసా నృత్యం. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు నమోదు చేసింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద జరిగిన కార్యక్రమాన్ని గిన్నిస్ బుక్ ప్రతినిధులు ప్రత్యక్షంగా వీక్షించి రికార్డు సర్టిఫికెట్‌ను ఏపీ గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి అందించారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పేలా వేడుకను నిర్వహించారు. ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి విచ్చేయనున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఈ సాంప్రదాయ నృత్యంతో ఘన స్వాగతం పలకనున్నారు.

# రెక్కలు విప్పిన ఉత్తరాంధ్ర

- అల్లూరి విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు
- తెలుగు కళలు, సంస్కృతి ఉట్టిపడేలా విమానాశ్రయ ప్రాంగణం
- గిరిజన సంప్రదాయ నృత్యం థింసాకు గిన్నీస్ వరల్డ్ రికార్డు
- ఉత్తరాంధ్ర ఆర్థిక ప్రగతికి ఊతమిచ్చేలా కార్యకలాపాలు
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఏర్పాట్లను సమీక్షించిన సీఎం చంద్రబాబు



విశాఖపట్నం (చైతన్యరథం): అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ విమానాశ్రయాన్ని ఏవియేషన్, ఏరోస్పేస్ హబ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. ఏఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును ప్రారంభించేందుకు వస్తున్న ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికేలా కార్యక్రమం నిర్వహించాలని సీఎం సూచించారు. విశాఖలోని పోర్టు గెస్ట్ హౌస్‌నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. తెలుగు కళలు, సంస్కృతీ వారసత్వ వైభవాన్ని చాటేలా విమానాశ్రయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ సంస్కృతీ, సంప్రదాయాలు, కళలు ఉట్టిపడేలా అల్లూరి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అలంకరించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విమానాశ్రయ స్వాగత ద్వారం వద్ద ఆకట్టుకునేలా భారీ స్థాయి ఏటికొప్పాక కళాకృతి ఏర్పాటు చేశామన్నారు. విమానాశ్రయ ప్రాంగణం లోపల ఆంధ్రప్రదేశ్ సంస్కృతికి అద్దం పట్టేలా తోలు బొమ్మలు, బొబ్బిలి వీణ, నాదస్వరం, లేపాక్షి నంది చిత్రాలతో పాటు భౌగోళిక వారసత్వాన్ని చాటే బంగినపల్లి మామిడి లాంటి చిత్రాలను అలంకరించామని సీఎంకు వివరించారు. ప్రత్యేకించి ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికేలా 13,500 మంది గిరిజన మహిళలతో థింసా నృత్యాన్ని కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. రిహార్సల్ గా చేసిన ఈ నృత్యానికి గిన్నీస్ వరల్డ్ రికార్డు కూడా సాధించినట్టు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. అలాగే విమానాశ్రయంలో దేశంలోనే అతిపెద్ద ఎల్ఈడీ డిస్ప్లే వాల్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విమానాల రాకపోకలు, సర్వీసుల వివరాలు తెలియచేసేలా ప్రయాణికుల కోసం ఎల్ఈడీ వాల్ ను ఏర్పాటు చేసినట్టు సీఎంకు వివరించారు.

### ప్రధానికి గిరిజన థింసా నృత్యంతో ఘన స్వాగతం

ఉదయం 10.45 గంటలకు ఢిల్లీ నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోనున్న ప్రధాని నరేంద్ర మోదీకి... రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తదితరులు స్వాగతం పలకనున్నారు. అనంతరం 10.58 గంటలకు ప్రధాని ఎయిర్ పోర్టు టెర్మినల్ భవనాన్ని ప్రారంభిస్తారు. దాదాపు 12 నిముషాల పాటు టెర్మినల్ భవనంలో గడపనున్నారు. విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన తెలుగు కళాకృతులు, సంస్కృతీ వారసత్వ వైభవాన్ని చాటి చెప్పేలా ఏర్పాటు చేసిన చిత్రాలను ప్రధాని తిలకించనున్నారు.

టెర్మినల్ భవనం నుంచి బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకునే సమయంలో ప్రధాని మోదీకి గిరిజన సంప్రదాయ నృత్యం థింసాతో మహిళలు, బాలికలు ఘన స్వాగతం పలకనున్నారు. ఏక రూప దుస్తులు ధరించిన గిరిజన మహిళలు, బాలికలు థింసా నృత్యంతో ప్రధానికి, ఇతర అతిథులకు విశిష్టమైన స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశారు. అనంతరం బహిరంగ సభా వేదిక ప్రాంగణానికి చేరుకోనున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, పి.నారాయణ, కొండపల్లి శ్రీనివాస్ సహా ఇతర ప్రజాప్రతినిధులు, సీఎస్ సాయిప్రసాద్, ఐ అండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆయా జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.




# ఎయిరిండియా.. ఫ్లైట్ షెడ్యూల్ రిలీజ్

అమరావతి (చైతన్య రథం): ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించనున్న భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో ఆగస్టు 17 నుంచి విమానాల రాకపోకలు మొదలవుతాయి. ఈ నేపథ్యంలో ఎయిరిండియా అక్టోబర్ 24 వరకు ఫ్లైట్ షెడ్యూల్‌ను ప్రకటించింది. హైదరాబాద్– భోగాపురం మధ్య రోజుకు 5 సర్వీసులు, బెంగళూరు–భోగాపురం మధ్య రోజుకు రెండు సర్వీసులతోపాటు, ఆది, శుక్రవారాలు వినా మిగిలిన 5 రోజులు మరో సర్వీసు నడుపుతామని పేర్కొంది. విజయవాడ–భోగాపురం మధ్య రోజుకు 4 సర్వీసులు నడపనున్నట్టు ఎయిరిండియా తెలిపింది.

### వైజాగ్‌నుంచి భోగాపురానికి బదిలీ

ప్రారంభోత్సవం ఆగస్టు 1న జరిగినా, వాణిజ్య విమాన సర్వీసులు ఆగస్టు 17నుంచి పూర్తిస్థాయిలో ప్రారంభం కానున్నాయి. అదే రోజు అర్ధరాత్రి 00.01 గంటలనుంచి ప్రస్తుత విశాఖపట్నం విమానాశ్రయం (ఐఎన్ఎస్ డేగ సివిల్ ఎన్‌క్లేవ్) వద్ద వాణిజ్య కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి. వీటికి సంబంధించిన 'వీటీజడ్' ఐఏటీఏ కోడ్ కూడా భోగాపురం విమానాశ్రయానికి బదిలీ కానుంది. వచ్చే 30 ఏళ్లపాటు జాతీయ అత్యవసర పరిస్థితుల్లో మినహా వైజాగ్ విమానాశ్రయం వద్ద వాణిజ్య సర్వీసులు నిలిపివేయాలన్న షరతుతోనే కేంద్రం భోగాపురం ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ఈ కొత్త విమానాశ్రయానికి అధికారికంగా 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' అని నామకరణం చేసింది. ఇప్పటికే ఎయిర్ ఇండియా ఈ కొత్త విమానాశ్రయం నుంచి అక్టోబర్ 24 వరకు షెడ్యూల్‌ను ప్రకటించింది. హైదరాబాద్‌కు రోజుకు ఐదు సర్వీసులు, బెంగళూరుకు రెండు సర్వీసులతోపాటు వారంలో ఐదు రోజులు అదనపు సర్వీసు, విజయవాడకు రోజుకు నాలుగు సర్వీసులు నడపనున్నట్టు ఎయిర్ ఇండియా వెల్లడించింది. భవిష్యత్తులో సింగపూర్‌తో సహా పలు అంతర్జాతీయ గమ్యస్థానాలకు సర్వీసులు విస్తరించే యోచనలో ఉన్నట్టు అధికారులు తెలిపారు.





# కొత్త అధ్యాయాలు సృష్టించండి

**ఆర్సెలర్ మిట్టల్‌కు సీఎం చంద్రబాబు అభినందనలు**


అమరావతి (చైతన్య రథం): ఆర్సెలర్ మిట్టల్ సంస్థ 20వ వార్షికోత్సవం సందర్భంగా లక్ష్మి ఎన్ మిట్టల్, ఆదిత్య మిట్టల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "గత రెండు దశాబ్దాలుగా, ఈ సంస్థ ఏఎం/ఎన్ఎస్ ఇండియా ద్వారా భారతదేశ తయారీరంగ వృద్ధికి మరియు మౌలిక సదుపాయాల కల్పనకు గణనీయమైన కృషి చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చేయబడుతున్న సమీకృత ఉక్కు కర్మాగారం ఈ ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయాన్ని ఆవిష్కరిస్తూ, పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడంతోపాటు మన ప్రజలకు కొత్త అవకాశాలను కల్పిస్తోంది. ఆర్సెలర్ మిట్టల్ భవిష్యత్తులోనూ నిరంతర విజయాన్ని సాధించాలని మరియు మరిన్ని మైలురాళ్లను అధిగమించాలని ఆకాంక్షిస్తున్నాను" అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.







ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. యూనిట్ ఇన్‌ఛార్జిల శిక్షణా తరగుతులకు హాజరై పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశంపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం వివిధ సమస్యలపై ప్రజలనుంచి వచ్చిన వినతులు స్వీకరించి పరిష్కారానికి హామీ ఇచ్చారు.








# ఆస్ట్రేలియా మంత్రి జూలియన్ హిల్‌కు స్వాగతం పలికిన మంత్రి లోకేష్

అమరావతి (చైతన్య రథం): ఆస్ట్రేలియా మంత్రి జూలియన్ హిల్‌కు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్‌లు స్వాగతం పలికారు. రాష్ట్ర పర్యటన నిమిత్తం శుక్రవారం రాత్రి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఆస్ట్రేలియా ప్రభుత్వ అంతర్జాతీయ విద్య, పౌరసత్వం, కస్టమ్స్, బహుళ సాంస్కృతిక వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జూలియన్ హిల్‌కు పుష్పగుచ్ఛం అందించి మంత్రి సాదర స్వాగతం పలికారు.

రాష్ట్రానికి విచ్చేసిన జూలియన్ హిల్‌ను ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. శనివారం మంత్రి నారా లోకేష్ సమక్షంలో యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్, రాష్ట్ర విద్యాశాఖ మధ్య పలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు.







# గిన్నిస్ పుటల్లో థింసా తరంగం

### 13 వేలమంది గిరిజన మహిళల అడుగుల సవ్వడి

విజయనగరం జిల్లా భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాంగణం ఒక అపూర్వ దృశ్యానికి వేదికైంది. కొండలు, అడవుల నడుమ మలిచిన లయబద్ధ అడుగులు, తరతరాలుగా గిరిజన గూడేల్లో నిక్షిప్తమైన సంప్రదాయపు సవ్వడులు –ఇవాళ ఒక్కసారిగా విమానాశ్రయ ఆవరణంలో సముద్రఘోషలా విస్తరించాయి. 13 వేలమందికి పైగా గిరిజన బాలికలు, మహిళలు ఏకకాలంలో అల్లుకున్న 'థింసా' నృత్యం, సాధారణంగా 15నుంచి 20 మంది గుంపులుగా మాత్రమే ప్రదర్శించే ఈ సంప్రదాయ కళారూపాన్ని ఒక సామూహిక శక్తిగా మలిచి, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నూతన అధ్యాయాన్ని లిఖించింది. అల్లూరి సీతారామరాజు జిల్లానుంచి ఆరు వేల మంది, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఐదు వేలమంది, ఏలూరు జిల్లా నుంచి రెండువేల మంది బాలికలు, మహిళలు కదం తొక్కి, ఉత్తరాంధ్ర గిరిజన సంస్కృతి ఔన్నత్యాన్ని ప్రపంచవేదికపై నిలిపారు. క్షేత్రస్థాయిలో ప్రదర్శనను నిశితంగా పరిశీలించిన గిన్నిస్ బుక్ ప్రతినిధులు, నిర్ణీత నిబంధనలన్నీ నెరవేరినట్టు ధృవీకరించారు. అనంతరం రికార్డు సర్టిఫికెట్‌ను ఏపీ గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి అందించారు.

నారా లోకేష్ సారథ్యంలో రూపుదిద్దుకున్న ఈ బృహత్తర ప్రణాళిక, కేవలం ఒక రికార్డు కోసమే కాదు –తరతరాల వారసత్వానికి కొత్త వెలుగునివ్వాలన్న తపనతో ఆవిష్కృతమైంది. ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విచ్చేయనున్న వేళ, ఈ గిరిజన నృత్య తరంగమే వారికి తొలి స్వాగత గీతం కానుంది. మట్టి పరిమళం అద్దిన ఈ అడుగుజాడలు, ఉత్తరాంధ్ర నేల గుండె చప్పుడును యావత్ ప్రపంచానికి వినిపించిన క్షణంగా చరిత్రలో నిలిచిపోనున్నాయి.





# భోగాపురం చేరుకున్న లోకేష్







భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభించేందుకు శనివారం విజయనగరం జిల్లాకు ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రికే విద్యా, ఐటీ మంత్రి నారా లోకేష్ భోగాపురం చేరుకున్నారు. లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, కొలుసు పార్థసారథి, ఎంపీ అప్పలనాయుడు. ఇప్పటికే కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, పార్టీ సీనియర్లు భోగాపురం చేరుకున్న నేపథ్యంలో.. లోకేష్ రాకతో కోలాహలం మొదలైంది.





చైతన్యరథం



# ఆకాశాన్ని తాకిన ఆంధ్రుని ఆత్మవిశ్వాసం

## ఉత్తరాంధ్ర భవితకు రెక్కలు తొడిగిన భోగాపురం



ఒక ప్రాంతపు కల ఎప్పుడైనా ఇంత దీర్ఘకాలం నిరీక్షించాల్సి వస్తుందా? ఉత్తరాంధ్ర ప్రజలకు ఈ ప్రశ్నకు సమాధానం తెలుసు. ఒక దశాబ్దానికి పైగా ఎదురుచూపులు, రాజకీయ ఆటుపోట్లు, మధ్యలో ఆగిపోయిన నిర్మాణ పనుల మధ్య.. ఎట్టకేలకు అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆకాశంలోకి ఎగరడానికి సిద్ధమైంది. ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం కానున్న ఈ విమానాశ్రయం, కేవలం ఒక రవాణా సదుపాయం కాదు.. ఇది ఉత్తరాంధ్ర ఆత్మగౌరవానికి ప్రతీక. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ప్రజలు తరతరాలుగా మోసుకొచ్చిన నిరీక్షణకు ఇది సాకారరూపం. 2,703 ఎకరాల విస్తీర్ణంలో రూ.4,727 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో 3,800 మీటర్ల రన్‌వే ఉంది అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల సమీక్షలో గుర్తుచేశారు. బంగాళాఖాత సముద్ర వారసత్వానికి ప్రతీకగా ఎగిరే చేప ఆకారంలో రూపొందించిన టెర్మినల్ ఆర్కిటెక్చర్, ఈ ప్రాజెక్టుకున్న సాంస్కృతిక లోతును చాటుతుంది.

ఈ కల వెనుక ఉన్న చరిత్ర ఒక పాఠంలా నిలుస్తుంది. రాష్ట్ర విభజన తర్వాత సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు 2015లోనే దూరదృష్టితో ఈ ప్రాజెక్టుకు బీజం వేశారు. జీవో నెం.63, 64ల ద్వారా భూసేకరణ, పరిహారం అంశాలను పారదర్శకంగా పరిష్కరించి, 2019 ఫిబ్రవరి 14న స్వయంగా భూమి పూజ చేశారు. కానీ వెంటనే జరిగిన అధికార మార్పిడితో ప్రాజెక్టు వేగం తగ్గింది. దీనికి బలమైన సాక్ష్యం నిధుల కేటాయింపు గణాంకాలే. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.750 కోట్లు వెచ్చించగా, తర్వాతి ఐదేళ్లలో అది కేవలం రూ.203 కోట్లకు పడిపోయింది. ఐదేళ్ల నిరీక్షణ తర్వాత, 2024లో తిరిగి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కేంద్రం సహకారంతో నిర్మాణానికి కొత్త ఊపిరి పోసింది. ఈ ఏడాది జనవరిలో విజయవంతంగా జరిగిన ట్రయల్ రన్, ఈ ప్రాజెక్టు తుది దశకు చేరుకుందనడానికి నిదర్శనం.

ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు ఒక ఆర్థిక చోదకశక్తిగా మారనుంది. ఇది కేవలం ప్రయాణానికే కాకుండా, ఒక కీలకమైన లాజిస్టిక్స్ కేంద్రంగా మారి ప్రపంచవ్యాప్త కనెక్టివిటీని అందిస్తుందని, తద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విశాఖ నుంచి శ్రీకాకుళం వరకు కొత్త ఎకో సిస్టమ్ ఏర్పడి, హోటళ్లు, రెస్టారెంట్లు, ఐటీ పార్కులు, డేటా సెంటర్లతో ఈప్రాంత ముఖ చిత్రం సమూలంగా మారనుంది. స్థానిక కూలీలకు,రైతులకు కొత్త అవకాశాలు లభించి,వలసలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. రాజకీయ ఆటుపోట్ల మధ్య ఒక దశాబ్దానికి పైగా సాగిన ఈ ప్రయాణం, చివరికి ఉత్తరాంధ్ర ఆకాంక్షలను నిజం చేసే ఒక చారిత్రక ఘట్టంగా చరిత్రలో నిలిచిపోనుంది.

**- విజయ ప్రసాద్**

### ప్రత్యేక సమాచారం

దేశంలోని కేటగిరీ-1 ఇమిగ్రేషన్ చెక్‌పోస్ట్‌ల జాబితాలో భోగాపురం 39వ విమానాశ్రయంగా స్థానం సంపాదించుకుంది. అలాగే కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వద్ద విశాఖపట్నం నుంచి భోగాపురం వరకు మెట్రో రైలు కోసం 'డబుల్ డెక్కర్ లైన్' ప్రతిపాదన పరిశీలనలో ఉంది. ఇది భవిష్యత్తులో కనెక్టివిటీని మరింత బలోపేతం చేయనుంది.

### ప్రాజెక్టు గణాంకాలు -అంకెలలో

| | అంశం | వివరాలు |
|---|---|---|
| ₹ | నిర్మాణ వ్యయం | రూ.4,727 కోట్లు |
| | భూ విస్తీర్ణం | 2,703 ఎకరాలు |
| | రన్‌వే పొడవు | 3,800 మీటర్లు |
| | విశాఖకు దూరం | 45 కి.మీ. |
| | విజయనగరానికి దూరం | 20 కి.మీ. |
| | ప్రారంభోత్సవం | ఆగస్టు 1, 2026 (ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా..) |

### రాజకీయ చిత్తశుద్ధి -నిధుల కేటాయింపు పోలిక


| కాలం | ప్రభుత్వం | ఖర్చు చేసిన నిధులు |
|---|---|---|
| 2014-2019 | టీడీపీ | రూ.750 కోట్లు |
| 2019-2024 | వైసీపీ | తూతూ మంత్రం |
| 2024 తర్వాత | కూటమి | నిర్మాణం వేగవంతం, జనవరి 2026లో ట్రయల్ రన్ పూర్తి |

(ఈ గణాంకాలే ప్రాజెక్టుపై ఏ ప్రభుత్వ నిబద్ధత ఎంతో స్పష్టం చేస్తున్నాయి)

### టెర్మినల్ అండ్ కనెక్టివిటీ వివరాలు

| అంశం | వివరాలు |
|---|---|
| టెర్మినల్ విస్తీర్ణం | 78,000 చ.మీ. |
| ఇమిగ్రేషన్ చెక్‌పోస్ట్ హోదా | కేటగిరీ-1, దేశంలో 39వ స్థానం |
| అంచనా ఉపాధి కల్పన | 3 లక్షల మంది (ప్రత్యక్ష మరియు పరోక్ష) |
| నిర్మాణ కాలం | రికార్డు స్థాయిలో 2 సంవత్సరాలు |
| భవిష్యత్ ప్రాజెక్టు | విశాఖ-భోగాపురం మెట్రో (డబుల్ డెక్కర్ లైన్ ప్రతిపాదన) |

"భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం"



"ఈ విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చాయి"

"ప్రారంభోత్సవ వేడుకలు చారిత్రాత్మక ఘట్టం. థింసా, సవర, కొమ్ము కోయవంటి సంప్రదాయ నృత్యరూపాలతో ప్రధానికి ఘన స్వాగతం పలుకుదాం"

**- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**

"ఉత్తరాంధ్రలోని ఐదు జిల్లాలనుంచి సుమారు 3 లక్షలమంది ప్రజలు ప్రారంభోత్సవానికి హాజరవుతారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేశాం"



"ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలుకుతూ సుమారు 13 వేలమంది కళాకారులతో దేశంలోనే అతిపెద్ద థింసా నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నాం"

"భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణ సౌకర్యంతోపాటు, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పర్యాటక రంగంతోపాటు ఫార్మా, ఐటీ, ఆటోమొబైల్ రంగాలకు అవసరమైన అంతర్జాతీయ కనెక్టివిటీని అందిస్తుంది"

**- ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్**

"కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జీఎంఆర్‌తో కలిసి బ్రహ్మాండమైన ఎయిర్‌పోర్టును నిర్మించాం. 78,000 చదరపు మీటర్లమేర టెర్మినల్ బిల్డింగ్ నిర్మించాం. భోగాపురం ఎయిర్‌పోర్టు దేశంలోనే బెస్ట్ ఎయిర్‌పోర్టు డిజైన్‌గా కితాబు అందుకుంటోంది."

"కేవలం రెండేళ్ల రికార్డు కాలంలోనే అద్భుతాన్ని సాకారం చేశాం. విశాఖపట్నంనుంచి భోగాపురం దూరం అవుతుందనే అపోహలను ప్రజలు నమ్మవద్దు"



"శంషాబాద్ విమానాశ్రయంలాగే భోగాపురం కూడా భవిష్యత్తులో 3 లక్షలమందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధిని అందిస్తుంది."

**- కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**





# గిన్నిస్ బుక్‌లో 'భోగాపురం' థింసా నృత్యం

- **ఏక కాలంలో 13 వేల మంది గిరిజన బాలికల నృత్యం**
- **అవార్డు అందుకున్న మంత్రి సంధ్యారాణి**
- **నేడు ప్రధాని పర్యటనకు విస్తృత బందోబస్తు**

విజయనగరం (చైతన్యరథం): భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా 13 వేల మంది గిరిజన బాలికలు ఏక కాలంలో ప్రదర్శించిన థింసా నృత్యం గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయింది. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని గిన్నిస్ బుక్ ప్రతినిధులు ప్రత్యక్షంగా వీక్షించి రికార్డు సర్టిఫికెట్‌ను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి అందించారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పేలా ఈ వేడుకను నిర్వహించారు. శనివారం భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆదివాసీలు అపూర్వ స్వాగతం పలకనున్నారు. ఇందు కోసం గత మూడు రోజులుగా ఆదివాసీ విద్యార్థినులు రిహార్సల్స్ చేస్తున్న విషయం తెలిసిందే. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఆదివాసీ విద్యార్థినులు తరలివచ్చి ఈ థింసా నృత్యంలో పాల్గొన్నారు.

### అంగరంగ వైభవంగా ఏర్పాట్లు..

భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఘనస్వాగతం చెప్పేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సంప్రదాయ థింసా నృత్యంతో 13, 500 మంది ఆదివాసీ బాలికలు ప్రధానికి స్వాగతం పలక నున్నారు. ఆంధ్రప్రదేశ్ సంస్కృతి సంప్రదాయాలు, కళలు ఉట్టిపడేలా అల్లూరి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అధికారులు అలంకరించారు.

### ప్రత్యేక కార్యక్రమాలు..

విమానాశ్రయ స్వాగత ద్వారం వద్ద ఆకట్టుకునేలా భారీ స్థాయిలో ఏటికొప్పాక కళాకృతిలో అలంకరించారు. విమానాశ్రయం లోపల ప్రాంగణంలో ఏపీ చారిత్రక వైభవం చాటేలా తోలు బొమ్మలాట, బొబ్బిలి వీణ, భౌగోళిక వారసత్వం చాటిచెప్పేలా బంగినపల్లి మామిడి లాంటి చిత్రాలతో అలంకరించారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

### కట్టుదిట్టమైన భద్రత..!

భోగాపురం విమానాశ్రయంలో ప్రధాని మోదీ పర్యటన భద్రతా ఏర్పాట్లను రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా శుక్రవారం పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్, టెర్మినల్ భవనం, సభా ప్రాంగణం, థింసా నృత్య వేదికను సందర్శించారు. దాదాపు 3 వేల సీసీ కెమెరాలతో భద్రత, ట్రాఫిక్, జనసమీకరణపై నిఘా ఏర్పాటు చేశారు. బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణలో పూర్తి సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను డీజీపీ ఆదేశించారు.



### రవాణా ఏర్పాట్లు పూర్తి

ప్రధాని పర్యటనకు రవాణా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. 2 వేల ఆర్టీసీ వాహనాలు, 3 వేల ప్రైవేట్ వాహనాలతో కలిపి మొత్తం 5 వేల వాహనాలు సిద్ధం చేశారు. అనుకున్న సమయానికి గమ్యస్థానానికి చేరుకునేలా రవాణా శాఖ అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేశారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి 3 లక్షల మంది జనం వస్తారని అంచనా వేస్తున్న అధికారులు అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఎయిరిండియా ఫ్లైట్ షెడ్యూల్ విడుదల

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 24 వరకు ఎయిరిండియా ఫ్లైట్ షెడ్యూల్‌ను ప్రకటించింది. హైదరాబాద్–భోగాపురం మధ్య రోజూ 5 సర్వీసులను ఎయిరిండియా నడపనుంది. బెంగళూరు–భోగాపురం మధ్య రోజూ 2 సర్వీసులు, ఆది, శుక్రవారాలు మినహా మిగిలిన 5 రోజులు బెంగళూరు–భోగాపురం మధ్య మరో సర్వీస్ నడుపుతుంది. విజయవాడ–భోగాపురం మధ్య రోజూ 4 సర్వీసులు నడపనున్నట్లు ప్రకటించింది.

# భోగాపురం... ఉత్తరాంధ్ర ప్రగతికి నూతన శకం

- **అభివృద్ధి చరిత్రలో సువర్ణాధ్యాయం**
- **మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

భోగాపురం (చైతన్యరథం): ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో మరో సువర్ణ అధ్యాయానికి నాంది పలుకుతూ 'అల్లూరి సీతారామరాజు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం' శనివారం ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభం కానుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. సుమారు 2,703 ఎకరాల విస్తీర్ణంలో, రూ.4,727 కోట్ల వ్యయంతో, 3,800 మీటర్ల రన్‌వేతో నిర్మించిన ఈ అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర జిల్లాల ఆర్థిక, పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు కొత్త ఊపునివ్వడంతోపాటు, ప్రాంత అభివృద్ధికి కీలక కేంద్రంగా నిలవనుందన్నారు.

రాష్ట్ర విభజన అనంతరం ఉత్తరాంధ్రను అభివృద్ధి పథంలో నడిపించాలనే సంకల్పంతో 2014లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. అప్పటి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు చొరవతో కేంద్ర అనుమతులు సాధించి, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తూ ప్రాజెక్టుకు బలమైన పునాది వేసింది. 2019 ఫిబ్రవరిలో ఈ విమానాశ్రయ నిర్మాణానికి అప్పటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం భూసేకరణ కొనసాగించినప్పటికీ, 2023 మే 3న రెండోసారి శంకుస్థాపన చేసినా నిర్మాణ పనులు ఆశించిన వేగంతో ముందుకు సాగలేదు. ప్రాజెక్టు స్థలాన్ని తగ్గించే ప్రయత్నాలు, పనులపై తగిన శ్రద్ధ లేకపోవడంతో విమానాశ్రయ నిర్మాణం జాప్యానికి గురైంది. అయితే 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా కింజరాపు రామ్మోహన్ నాయుడు బాధ్యతలు చేపట్టడంతో భోగాపురం విమానాశ్రయ నిర్మాణం వేగం పుంజుకుంది. కేంద్ర మంత్రి



రామ్మోహన్ నాయుడు నిరంతర పర్యవేక్షణ, అనుసంధాన రహదారుల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వేగవంతమైన చర్యలతో అన్ని అడ్డంకులు తొలగి, సుమారు రెండేళ్లలోనే ప్రాజెక్టు పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది.

భోగాపురం విమానాశ్రయం ద్వారా ఉత్తరాంధ్రకు అంతర్జాతీయ కనెక్టివిటీ మరింత విస్తరించనుంది. ఆగస్టు 17న నుంచి సింగపూర్‌కు తొలి అంతర్జాతీయ విమాన సర్వీస్ ప్రారంభం కానుండగా, త్వరలోనే మరిన్ని అంతర్జాతీయ విమానయాన సంస్థలు ఇక్కడి నుంచి తమ సర్వీసులను ప్రారంభించనున్నాయి. ప్రయాణికుల రాకపోకలతో పాటు కార్గో విమానాల రవాణాకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

ఈ విమానాశ్రయం ద్వారా శ్రీకాకుళం, ఉద్దానం, విజయనగరం ప్రాంతాల వ్యవసాయ, ఉద్యాన, మత్స్య ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లతో ప్రత్యక్ష అనుసంధానం ఏర్పడనుంది. విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో భారీ పరిశ్రమలు, లాజిస్టిక్స్ పార్కులు, సేవారంగ సంస్థలు ఏర్పడే అవకాశాలతో పాటు వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించనుంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రను దేశ, విదేశీ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా మార్చడమే కాకుండా, ప్రాంత ఆర్థికాభివృద్ధికి కొత్త దిశను నిర్దేశించే చారిత్రాత్మక మైలురాయిగా నిలవనుందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

చైతన్యరథం



# కళాత్మకం.. కలల భోగాపురం!

*ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చిన సమయమిది. దశాబ్దాల నిరీక్షణకు తెరపడి, ఆకాశమే హద్దుగా ఒక కొత్త అధ్యాయం మొదలవుతున్న సందర్భ కూడా. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లాంఛనంగా ప్రారంభిస్తున్నారు. ఈ చారిత్రక ఘట్టానికి వేదికగా నిలవనున్న భోగాపురం గగనతలం, ఒక్కరోజు ముందే వేడుకల శోభతో మెరిసిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రారంభోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. అడుగడుగునా ఆంధ్రప్రదేశ్ సంస్కృతీ సంప్రదాయాల సౌరభం వెదజల్లుతూ, గిరిజన కళల లయలతో, చారిత్రక వారసత్వపు ఛాయలతో ఈ విమానాశ్రయం నవ వధువులా ముస్తాబైంది.*

## సాంప్రదాయ థింసా నృత్యంతో గిన్నిస్ రికార్డుకు సిద్ధం

ప్రధానికి స్వాగతం పలికే తీరు కూడా భిన్నంగా, భావోద్వేగభరితంగా ఉండేలా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. నేటి ఉదయం 13,500 మందికి పైగా గిరిజన మహిళలు, విద్యార్థినులు సంప్రదాయ థింసా నృత్యంతో ప్రధానికి ఘనస్వాగతం పలకనున్నారు. కొండకోనల్లో పుట్టి, తరతరాలుగా ఉత్తరాంధ్ర గిరిజన జీవననాడిగా నిలిచిన థింసా లయలు –ఇప్పుడు దేశ ప్రధానికి స్వాగత గీతిక కానున్నాయి. వేలాది మంది ఏకకాలంలో ఒకే లయలో అడుగులు వేస్తూ ప్రదర్శించే ఈ నృత్య విన్యాసం ద్వారా 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకునేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వీరితోపాటు కూచిపూడి నృత్య ప్రదర్శన చోటుచేసుకోనుంది. మహానాడు వంటి భారీ బహిరంగ సభలు విజయవంతంగా నిర్వహించిన అనుభవంతో, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో 13 కమిటీలు ఈ వేడుక బాధ్యతలను భుజాన వేసుకున్నాయి. సభకు దాదాపు 3 లక్షలమంది జనం తరలిరావచ్చని అంచనా. తాగునీరు, అల్పాహారం, భోజన సదుపాయాలు, నీడ ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఒక్కరూ వేడుకను స్పష్టంగా వీక్షించేలా మైదానంలో భారీ ఎల్ఈడీ తెరలు, ఆకట్టుకునే లేజర్ షో సిద్ధమయ్యాయి.



### ఏటికొప్పాక కళానైపుణ్యం.. తోలుబొమ్మలాట సొగసుతో అలంకరణ

రాష్ట్ర సంస్కృతి, కళలు ఉట్టిపడేలా విమానాశ్రయాన్ని తీర్చిదిద్దడంలో అధికారులు ఎంతో శ్రద్ధ చూపారు. విమానాశ్రయ ప్రధాన స్వాగత ద్వారం వద్ద ఆకట్టుకునేలా భారీస్థాయిలో ఏటికొప్పాక కళాకృతిని ఏర్పాటు చేశారు. చెక్కపై సహజ రంగులతో ప్రాణం పోసే లక్క బొమ్మల కళానైపుణ్యం, తరతరాలుగా ఆంధ్రుల చేతివృత్తుల వైభవానికి సాక్ష్యంగా నిలుస్తుంది. విమానాశ్రయం లోపలి ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే రాష్ట్ర చారిత్రక వైభవం కళ్లముందు సాక్షాత్కరించేలా తోలుబొమ్మలాట కళాకృతులు, బొబ్బిలి వీణ నమూనాలు దర్శనమివ్వనున్నాయి. తెరపై నీడల మాయాజాలంతో పురాణ, జానపద కథలు చెప్పే తోలుబొమ్మలాట కళ నేటికీ నంద్యాల ప్రాంతపు వారసత్వ చిహ్నంగా నిలుస్తే, చెక్క, తీగలతో రూపొందే బొబ్బిలి వీణ ఉత్తరాంధ్ర సంగీత సంపదకు ప్రతీకగా నిలుస్తుంది. వీటికితోడు రాష్ట్ర భౌగోళిక వారసత్వాన్ని చాటిచెప్పేలా ప్రఖ్యాతిగాంచిన బంగినపల్లి మామిడి పండ్ల చిత్రాలతో గోడలను అలంకరించారు. ఇలా ఒక్కో మూలనా ఒక్కో కళారూపం, ఒక్కో చరిత్ర పలకరించేలా ఈ నవీన విమానాశ్రయాన్ని రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి కిటికీగా తీర్చిదిద్దారు.

### 'ఉత్తరాంధ్రకు కలలకు రెక్కలు' పేరిట ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు

ఈ చారిత్రక ఘట్టాన్ని కేవలం ఒక ప్రారంభోత్సవంగా కాకుండా, ఉత్తరాంధ్ర అభివృద్ధి ఆకాంక్షలకు కొత్త రెక్కలు తొడిగే సందర్భంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం "ఉత్తరాంధ్రకు కలలకు రెక్కలు" పేరిట విస్తృత ప్రచార కార్యక్రమాన్ని రూపొందించింది. ప్రజల్లో అవగాహన, భాగస్వామ్యం పెంచేలా క్విజ్‌లు, ఫ్లాష్‌మాబ్‌లు, డ్రోన్ షోలు, 3 నుంచి 5 కిలోమీటర్ల పరుగు పందేలువంటి కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా విశాఖ బీచ్ రోడ్డులో ఆకాశమే వేదికగా ఆకర్షణీయమైన డ్రోన్ షో ప్రదర్శన జరగనుంది. వందలాది డ్రోన్‌లు ఆకాశంలో ఒక్కటై, విమానం రెక్కల ఆకృతులు, ఉత్తరాంధ్ర అభివృద్ధి కలల చిత్రాలను రాత్రి నింగిపై చిత్రించనున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం ఒక రవాణా సదుపాయం మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దిశను చూపడంతోపాటు రాష్ట్ర ఆర్థిక పురోగతికి కీలక మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు సందర్భాల్లో స్పష్టం చేశారు.

### 31 నెలల్లోనే సాకారమైన కల

భోగాపురం విమానాశ్రయం నిర్మాణ ప్రస్థానం ఒక స్ఫూర్తిదాయక అధ్యాయం. 2016లోనే కేంద్రం సూత్రప్రాయ ఆమోదం తెలిపినా, భూసేకరణ, న్యాయపరమైన అడ్డంకుల మధ్య ఏళ్ల తరబడి కదలిక లేకుండా ఉండిపోయిన ఈ ప్రాజెక్టు, 2023 మేలో శంకుస్థాపన జరిగిన తర్వాత వేగం పుంజుకుంది. జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యంలో చేపట్టిన ఈ నిర్మాణం, దాదాపు రూ.4,727 కోట్ల వ్యయంతో కేవలం 31 నెలల్లోనే పూర్తయ్యింది. నిర్దేశించిన గడువుకన్నా దాదాపు ఐదు నెలలు ముందుగానే పూర్తికావడం విశేషం. దేశంలోనే అత్యంత వేగంగా నిర్మాణం పూర్తిచేసుకున్న గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాల్లో ఇది ఒకటిగా నిలవడం గమనార్హం. 3,800 మీటర్ల పొడవైన రన్‌వే దేశంలోనే అతిపొడవైన రన్‌వేల్లో ఒకటిగా గుర్తింపు పొందనుంది. తొలి దశలో ఏటా 60 లక్షలమంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యంతో నిర్మించిన ఈ విమానాశ్రయం, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా దశలవారీగా ఏటా 4 కోట్లమంది ప్రయాణికుల సామర్థ్యానికి విస్తరించే మాస్టర్ ప్లాన్‌తో రూపుదిద్దుకుంది. ఇప్పటికే డీజీసీఏ ఏరోడ్రోమ్ లైసెన్స్‌తోపాటు అన్ని భద్రతా, పర్యావరణ అనుమతులు పొంది, పరీక్షాత్మక విమాన ప్రయాణం కూడా విజయవంతంగా నిర్వహించుకుంది.

### విస్తరిస్తున్న రెక్కలు, విస్తరిస్తున్న కల

ఒకనాడు కొండలు, పచ్చని పంటపొలాల నడుమ నిశ్శబ్దంగా ఉన్న భోగాపురం నేల, ఇవాళ దేశం మొత్తం దృష్టిని ఆకర్షిస్తూ, రేపటి నుంచి ఆకాశమార్గాన ప్రపంచంతో అనుసంధానం కాబోతోంది. దశాబ్దాల నిరీక్షణ, రాజకీయ మార్పులు, నిర్మాణ సవాళ్లు దాటుకుని సాకారమైన ఈ కల, కేవలం ఒక విమానాశ్రయం మాత్రమే కాదు, ఉత్తరాంధ్ర లక్షలాది మంది ఆకాంక్షలకు ప్రతిరూపం. గిరిజన థింసా నృత్యపు తాళాలు, ఏటికొప్పాక కళాకృతుల మెరుపులు, బొబ్బిలి వీణ రాగాలు అన్నీ కలగలిసిన ఈ వేడుక, రేపు చరిత్రలో ఒక కొత్త పుటగా లిఖించబడనుంది.

**- మహాదేవ**

చైతన్యరథం

## అభివృద్ధి చూసి కుళ్లుకుంటున్న జగన్

- 'భోగాపురం' ప్రారంభవేళ అరాచక ప్రదర్శనలా
- పరామర్శల పేరుతో వైసీపీ మూకల వీరంగాలు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా ధ్వజం



విశాఖపట్నం (చైతన్యరథం): అభివృద్ధిని చూసి జగన్ ఓర్చుకోలేక పోతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు. ఉత్తరాంధ్రకు మణిహార మైన భోగాపురం అంతర్జాతీయ విమా నాశ్రయ ప్రారంభోత్సవ సంబరాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే శ్రీకాకుళం పర్యటన పేరుతో అరాచకం సృష్టించారని విమర్శించారు. శుక్రవారం మీడియాతో పల్లా మాట్లాడుతూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఖరిపై విరుచుకుపడ్డారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు. అభివృద్ధిని చూసి జగన్ ఓర్చుకోలేక పోతున్నారని విమర్శించారు. కేవలం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారం భానికి ఆటంకం కలిగించేందుకే జగన్ ఉత్తరాంధ్ర పర్యటనకు వచ్చారని ఆరోపించారు. కుతంత్రాలతో అభివృద్ధిని ఆపలేరని పల్లా స్పష్టం చేశారు. రానున్న కాలంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుందని వెల్లడించారు. గాజువాక నుంచి 125, మొత్తం మీద 5000 వేల బస్సుల్లో ప్రజలు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రత్యేకంగా దర్శించు కునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టును నిర్మించడం వల్ల అంతర్జాతీయంగా పెట్టుబడిదారులు ఉత్తరాంధ్రకు వచ్చి, పరిశ్రమలు స్థాపించడానికి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లు రావడం వల్ల ఎన్నో పరిశ్రమలు వచ్చాయని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. రానున్న కాలంలో ఉత్తరాంధ్ర.. స్వర్ణాంధ్ర బాటలో వెళ్లి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందన్నారు. ఇకపై ఉద్యోగరీత్యా, వ్యాపారరీత్యా ఉత్తరాంధ్ర నుంచి వలసలు ఆగుతాయని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## ఎల్ నినో పరిస్థితుల్లోనూ

# ఆయకట్టుకు నీరు

- పుష్కర ద్వారా ఏలేరుకు సాగునీరు
- ఉపద్రవం నుంచి గట్టెక్కించేలా రైతులకు ఊతం
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు



కాకినాడ (చైతన్యరథం): సూపర్ ఎల్ నినో ఉపద్రవాన్ని తట్టుకునేందుకు సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఎల్ నినో పరిస్థితుల్లో కూడా ఏలేరు ఆయకట్టు భూములకు నీరిస్తున్నామన్నారు. కాకినాడ జిల్లాలో రెండో రోజు పర్యటనలో భాగంగా శు క్రవారం ఏలేరు ఆయకట్టు పరిధిలో కాలువల్లో నీటి మట్టాలను తనిఖీ చేశారు. మంత్రితోపాటు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్య ప్రభ, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఈ నియోజకవర్గాల నీటి సంఘాల నాయకులు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఏలేరు ప్రాజెక్టు మెయిన్ కెనాల్ తక్షణ మరమ్మతులకు, సిల్ట్ తొలగింపునకు ఓ అండ్ ఎం నిధులు తక్షణ అవసర ప్రాతిపదికగా ఖర్చు చేయాలని స్థానిక అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

ఏలేరు ప్రాజెక్టు రిజర్వాయర్ స్థానిక నీటి వనరుల ఆధారంగా డిజైన్ చేశారని మంత్రి చెప్పారు. అయితే ప్రస్తుత దుర్భిక్ష పరిస్థితుల నేపథ్యంలో ఏలేరు జలాల ద్వారా ఆయకట్టు సాగు చేయడం అసాధ్య మని మంత్రి తెలియజేశారు. ఈ నేపథ్యం లో గోదావరి జలాలను పుష్కర ఎత్తిపోత లతో ఎడమ కాలవ ద్వారా ఏలేరు రిజర్వాయర్‌లోకి పంపి ఆయ కట్టుకు అందించబోతున్నామని ఆయన చెప్పారు. నేడు పుష్కర ఎత్తిపోతల పథకం లేకపోతే, ఏలేరుకు చుక్క నీరు వచ్చేది కాదన్నారు. పుష్కర ఎత్తిపోతల రూపకర్త, ముందు చూపు ఉన్న నేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని చెప్పారు. సమర్థ నాయకుడు చంద్రబాబుకి, గొడ్డలి పార్టీ అధినేత జగన్ కి జనం తేడా తెలుసుకోవాలన్నారు.

ఏలేరు ఆయికట్టు, అలాగే పిఠాపురం బ్రాంచ్ కెనాల్ ఆయకట్టు రైతుల పరిస్థితిపై ఎల్ నినో నేపథ్యంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారని మంత్రి చెప్పారు. ఎల్ నినో ఉపద్రవాన్ని తట్టుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. ఇరిగేషన్, రెవిన్యూ, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేసి సాధ్యమైనంత మేర రైతులకు ప్రయోజనం చేకూర్చాలని ఆయన ఆదే శాలిచ్చారు. అలాగే ఆయకట్టు రైతు సోదరులంతా ఆరుతడి పంటలు వేసు కోవడం, నీటి పొదుపును పాటించడం, చేయాలన్నారు. వీటి కంటే ముందు తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రైతులు ప్రతి ఎకరాకు పంటల బీమా చేయించమని సలహా ఇచ్చారు.

# రైతులకు శుభవార్త

- ఖరీఫ్ పంటల బీమా గడువు పొడిగింపు
- ఆగస్టు 15 వరకు నమోదుకు అవకాశం
- వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి



అమరావతి (చైతన్యరథం): ఖరీఫ్-2026 సీజన్‌కు సంబంధించి పంట దిగుబడి ఆధారిత ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (PMFBY) కింద వరి పంట మినహా మిగిలిన అన్ని నోటిఫై చేసిన ఖరీఫ్ పంటలకు పంటల బీమా నమోదు (ప్రీమియం చెల్లింపు) గడువు జూలై 31తో ముగియాల్సి ఉండగా, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మరో 15 రోజులపాటు ఆగస్టు 15వరకు పొడిగించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన PMFBY నోటిఫికేషన్ ప్రకారం వరి మినహా అన్ని పంటలకు జూలై 31 వరకు, వరి పంటకు ఆగస్టు 15 వరకు బీమా నమోదు గడువు నిర్ణయించగా, రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, బీమా సంస్థలతో విస్తృతంగా చర్చించి, వరి మినహా మిగిలిన అన్ని ఖరీఫ్ పంటలకు కూడా గడువును ఆగస్టు 15 వరకు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం, బీమా సంస్థలు సానుకూలంగా స్పందించి, PMFBY కింద నోటిఫై చేసిన వరి మినహా అన్ని ఖరీఫ్ పంటలకు పంటల బీమా నమోదు గడువును ఆగస్టు 15 వరకు పొడిగించడం రైతులకు ఎంతో ఊరటనిచ్చే నిర్ణయమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం, ఇతర అనుకోని పరిస్థితుల వల్ల రైతులకు కలిగే పంట నష్టాలకు ఆర్థిక రక్షణ కల్పించడంలో పంటల బీమా కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి తెలిపారు. రుణగ్రహీత, రుణేతర రైతులు అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పంటల బీమాలో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సాగు చేసిన ప్రతి ఎకరానికి పంటల బీమా నమోదు చేయించుకుని భవిష్యత్తులో ఎలాంటి నష్టం జరిగినా రక్షణ పొందాలని సూచించారు. రైతులు సంబంధిత బ్యాంకులు, కామన్ సర్వీస్ సెంటర్లు, రైతు సేవా కేంద్రాలు, NCIP మొబైల్ యాప్ ద్వారా స్వయంగా లేదా వ్యవసాయ శాఖ అధికారుల సహాయంతో ఆగస్టు 15లోగా పంటల బీమా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల ప్రయోజనాలకు సంబంధించిన ప్రతి అంశంలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన నిర్ణయాలు తీసుకుంటున్నామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా, పోర్టల్‌పై చివరి రోజులలో ఏర్పడే రద్దీని నివారించేందుకు వీలైనంత త్వరగా పంటల బీమా నమోదు పూర్తి చేసుకోవాలని రైతులకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

## 'భోగాపురం' క్రెడిట్ చోరీకి జగన్ ఆరాటం

- నాడు అడ్డుకుని, నేడు సిగ్గులేని మాటలు
- సీఎం చంద్రబాబు కృషి వల్లే చిరకాల స్వప్నం సాకారం
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ ఎయిర్పోర్ట్ మైలురాయి
- మండలి చీఫ్ విప్, టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ



అమరావతి (చైతన్యరథం): భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానా శ్రయం విషయంలో జగన్ క్రెడిట్ చోరీ ప్రయ త్నాలు చేస్తున్నారని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ విమర్శించారు. పంచుమర్తి అనురాధ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని చోరీ చేసిన జగన్ ఇప్పుడు క్రెడిట్ చోరీ కోసం ఆరాటపడుతున్నారని ధ్వజ మెత్తారు. ఎర్ర బస్సు కూడా రాని ఊరికి ఎయిర్ పోర్ట్ ఎందుకు అంటూ నాడు భోగాపురం విమా నాశ్రయం గురించి జగన్ హేళనగా మాట్లాడారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి భూములివ్వొద్దంటూ రైతుల్ని రెచ్చగొట్టారు. ఇప్పుడు మాత్రం ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ తమదే అంటూ సిగ్గులేకుండా డప్పు కొట్టుకుంటున్నారని దుయ్యబట్టారు.

ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో ఏళ్ల ఆకాంక్ష అయిన భోగాపురం ఎయిర్‌పోర్ట్ సీఎం నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, కృషివల్లే సాధ్యమైందని ఆమె స్పష్టం చేశారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాతే భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదన జరిగింది. 2015లో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. 2019 ఫిబ్రవరి 14న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పునాది రాయి వేశారు. జగన్ ప్రభుత్వం హయాంలో ప్రాజెక్టును ఆలస్యం చేసినా, 2024లో చంద్రబాబు తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత వేగవంతమైన పనులతో ఎయిర్‌పోర్ట్ సిద్ధమైంది.

ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నారు. రూ.4,592 కోట్లతో నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు ఇది. భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్రలో ఉపాధి, పెట్టుబడులు, పర్యాటకం, వ్యాపారం, విమానయాన రంగాల్లో విస్తృత అవకాశాలు ఏర్పడనున్నాయన్నారు. విశాఖపట్నం, విజయ నగరం, శ్రీకాకుళం ప్రాంతాల అభివృద్ధికి ఇది గొప్ప మైలురాయి అవుతుంది. కార్గో టెర్మినల్, ఏరోట్రోపాలిస్ వంటి అదనపు సౌకర్యాలతో ఉత్తరాంధ్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తి వస్తుంది. జగన్ గతంలో ప్రాజెక్టును వ్యతిరేకించి, రైతులను రెచ్చగొట్టి, ఇప్పుడు క్రెడిట్ కోసం ఆరాటపడు తున్న విషయం ప్రజలకు స్పష్టంగానే అర్థం అవుతోంది. నిజమైన అభివృద్ధి చంద్రబాబు దూరదృష్టి, నిరంతర కృషి ఫలితమే అని పంచుమర్తి అనురాధ స్పష్టం చేశారు.

## అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్..

# గొడ్డలి పార్టీ అధినేత జగన్

- నాడు భోగాపురాన్ని అడ్డుకుని నేడు క్రెడిట్ చోరీకి పాకులాట
- బల ప్రదర్శన యాత్రలా పరామర్శలు
- బాధితులను వదిలి నిందితులకు ఓదార్పు విడ్డూరం
- మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజం



అన్నవరం (చైతన్యరథం): క్రెడిట్ చోరీకి కేర్ ఆఫ్ అడ్రస్, అబద్దాలకు అసలు సిసలు చిరునామా గొడ్డలి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తీవ్రంగా విమర్శించారు. కాకినాడ జిల్లా అన్నవరంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. భోగాపురం విమానాశ్రయానికి అడుగడుగునా అడ్డుపడ్డ జగన్మోహన్ రెడ్డి నేడు ఆ విమానాశ్రయాన్ని తానే నిర్మించానని, అన్ని అనుమతులు తానే తెచ్చానని అడ్డగోలుగా అబద్దాలు ఆడుతూ క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్ర బస్సు రాని ఊరికి ఎయిర్ బస్ ఎందుకు అంటూ భోగాపురం గురించి హేళనగా జగన్ మాట్లాడిన మాటలు జనం ఎవరూ మర్చిపోలేదని మంత్రి గుర్తు చేశారు. భోగాపురం విమానాశ్రయం నిర్మాణాన్ని ఆపడానికి అవసరమైతే కోర్టుకు కూడా వెళతాను అన్న వ్యక్తి .. ఇప్పుడు అదంతా తన క్రెడిట్ అనటం హాస్యాస్పదమని రామానాయుడు విమర్శించారు. ఉత్తరాంధ్రలో వైభవోపేతంగా ప్రారంభం కాబోతున్న భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్‌ను చూసి జగన్ ఓర్వ లేక పోతున్నాడన్నారు. ప్రపంచంలో ఎక్కడైనా చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడం చూశాం గానీ, హత్య చేసిన వ్యక్తిని పరామర్శించడం జగన్ కే చెల్లిందన్నారు. ఒక మనిషి చావుకి కారణమైన వ్యక్తి తండ్రి..సీదిరి అప్పలరాజు కుటుంబాన్ని జగన్ పరామర్శించటం ఎంతవరకు సబబు అని మంత్రి ప్రశ్నించారు. అలాగే పరామర్శగా కాకుండా అదో బలప్రదర్శన యాత్రగా చేయడం విడ్డూరం గా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం కాలువల్లో నీరు పారించాలని చూస్తుంటే, గొడ్డలి పార్టీ రక్తాన్ని పారించాలని చూస్తోందన్నారు. ఖాకీ డ్రెస్ అన్నా, మహిళలన్నా గొడ్డలి పార్టీ నాయకుడికి గౌరవం లేదన్నారు. ఆడవాళ్ళ జోలికొస్తే అదే ఆఖరి రోజు అన్న సీఎం చంద్రబాబు హెచ్చరికలు గొడ్డలి పార్టీ కి కూడా వర్తింపచేయాలని రామానాయుడు అన్నారు.

**ఉత్తరాంధ్రకు ఉజ్వల భవిష్యత్తు**

పోలవరం ఎడమ కాలువ పనులు త్వరితగతిన పూర్తి చేసి ఉత్తరాంధ్రకు ఉజ్వల భవిష్యత్తు కల్పించడానికి కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని.. మంత్రి రామానాయుడు చెప్పారు. ఇందుకు రూ. 1800 కోట్లు వ్యయం చేసి యుద్ధ ప్రాతిపదికన ఎడమ కాలువ పనులు పూర్తి చేస్తున్నామన్నారు. ఈ నెలలోనే అనకాపల్లి వరకు గోదావరి జలాలు తీసుకెళ్లబోతున్నామని ఆయన వివరించారు. గోదావరి నుండి ఏటా 3వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలసిపోతోందన్నారు. 2014- 19 మధ్య కాలంలో పోలవరం ప్రాజెక్ట్ పనులు 72 శాతం వరకు పనులు పూర్తి చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 2019 లో ప్రభుత్వం మారకుండా ఉండి ఉంటే, 2024 నాటికి పోలవరం పూర్తయి ఇటు ఉత్తరాంధ్రకు, అటు రాయలసీమకు గోదావరి జలాలు వెళ్ళి ఉండేవన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చి పోలవరాన్ని ధ్వంసం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు మొదటి పర్యటన పోలవరానికి వచ్చి 2027 కు పూర్తయ్యేలా లక్ష్యంగా నిర్ణయించారన్నారు.

పోలవరం పూర్తయ్యే లోగా గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు తీసుకెళ్లేలా నాడు చంద్రబాబు పురుషోత్తపట్నం లిఫ్ట్ ను అందుబాటులోకి తీసుకొచ్చారని చెప్పారు. పురుషోత్తపట్నం లిఫ్ట్ ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంత సాగు, తాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాలకు నీరందిస్తున్నామన్నారు. ఐదేళ్ల పాలనలో పోలవరం ఎడమ కాలువ పనులవైపు కన్నెత్తి చూడని గొడ్డలి పార్టీ కి ఉత్తరాంధ్ర గురించి మాట్లాడే నైతిక హక్కులేదని రామానాయుడు దుయ్యబట్టారు. జగన్ ఇరిగేషన్ శాఖలో రూ. 18వేల కోట్ల బకాయిలు వారసత్వంగా ఇచ్చి వెళ్ళాడన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల ప్రకారం పోలవరం ఎడమ కాలువలో ఉన్న క్లిష్టతరమైన పనులను రెండేళ్ళలోనే పూర్తి చేశామన్నారు. పోలవరం ఎడమ కాలువ పనుల జాప్యం పై నిర్మాణ ఏజెన్సీల పై మంత్రి రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 'ఇంటింటికీ టీడీపీ'

# ఐదో రోజూ విజయవంతం

- రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల ఇళ్లను సందర్శించిన కూటమి నాయకులు, కార్యకర్తలు
- ఉత్తమ పనితీరు కనబరుస్తున్న నేతలు, శ్రేణులకు యువనేత నారా లోకేష్ అభినందనలు

అమరావతి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "ఇంటింటికీ టీడీపీ - 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి-సంక్షేమం" కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఐదో రోజూ విజయవంతంగా కొనసాగింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఇంటింటికీ వెళ్లి రెండేళ్ల పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.

శుక్రవారం ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2.80లక్షల ఇళ్లను సందర్శించిన కూటమి శ్రేణులు, గత ఐదు రోజుల్లో మొత్తం 12 లక్షల ఇళ్లకు చేరుకుని ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించారు. రైతు సంక్షేమం,మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలను ప్రజలకు వివరించగా, ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్నారు.

**పార్టీ శ్రేణులను అభినందించిన నారా లోకేష్**

"ఇంటింటికీ టీడీపీ -2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి-సంక్షేమం" కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్న నాయకులు, కార్యకర్తలను యువనేత, మంత్రి నారా లోకేష్ నిరంతరం ప్రోత్సహిస్తున్నారు. ఉత్తమ పనితీరు కనబరుస్తున్న వారికి వ్యక్తిగతంగా ఎస్ఎంఎస్‌ల ద్వారా అభినందనలు తెలియజేయడంతో పాటు, పలువురితో నేరుగా ఫోన్‌లో మాట్లాడి వారి సేవలను ప్రశంసిస్తున్నారు. పార్టీ శ్రేణులు ఇదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ రానున్న రోజుల్లో ప్రతి ఇంటికీ చేరుకుని కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత విస్తృతంగా వివరించాలని మంత్రి లోకేష్ పిలుపు ఇచ్చారు.

# అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అమరావతి

- ఏపీటీడీసీ చైర్మన్ డా.నూకసాని బాలాజీ
- ధ్యాన బుద్ధ విగ్రహం, బుద్ధవనం, హరిత హోటల్, బౌద్ధ పర్యాటక సర్క్యూట్ ప్రాంతాల పరిశీలన



అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌కు అనుగుణంగా అమరావతిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) చైర్మన్ డా. నూకసాని బాలాజీ పిలుపు ఇచ్చారు.

పల్నాడు జిల్లా అమరావతిలోని ధ్యాన బుద్ధ విగ్రహం, బుద్ధవనం, హరిత హోటల్, బౌద్ధ పర్యాటక సర్క్యూట్ ప్రాంతాలను ఏపీటీడీసీ చైర్మన్ డా. నూకసాని శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ పర్యటనలో విజయవాడ డివిజనల్ మేనేజర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లోని మౌలిక వసతులు, సందర్శకులకు అందుతున్న సేవలు, వినియోగంలో లేని ఆస్తులు, భవనాల పరిస్థితి, నిర్వహణ తదితర అంశాలను చైర్మన్ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రస్తుతం వినియోగంలో లేని భవనాలు, ఇతర సదుపాయాలను పునరుద్ధరించి ప్రజల వినియోగానికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

ధ్యాన బుద్ధ ప్రాంగణంలోని బుద్ధ మ్యూజియంను సందర్శించిన ఆయన, ప్రపంచ శాంతి సందేశాన్ని చాటే ఈ ప్రాంతానికి విశిష్టమైన చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందన్నారు. టిబెటన్ ఆధ్యాత్మిక గురువు దలైలామా నాటిన మొక్కను కూడా పరిశీలించి, దానిని ప్రత్యేక ఆకర్షణగా అభివృద్ధి చేసి సందర్శకులకు తెలియజేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ధ్యాన బుద్ధ ప్రాజెక్టులోని లేజర్ షో పరికరాల పరిస్థితిని పరిశీలించిన చైర్మన్, వాటిని పూర్తిస్థాయిలో పునరుద్ధరించి ప్రతి రోజు పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం పెద్దవనం ప్రాజెక్టు పరిధిలోని భవనాలను పరిశీలించిన ఆయన, పరిసర ప్రాంతాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలు, అడవి చెట్లను వెంటనే తొలగించి పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.

అమరావతి పర్యాటక ప్రాంతాల్లోని నూనెగుండం చెరువు, కాలచక్ర మ్యూజియం, తదితర ప్రాంతాల్లో అవసరమైన అభివృద్ధి పనులు, నిర్వహణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనుల్లో మిగిలి ఉన్న చిన్నచిన్న పెండింగ్ పనులను కూడా ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా చైర్మన్ డా. నూకసాని బాలాజీ మాట్లాడుతూ దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు ప్రపంచస్థాయి అనుభూతిని కల్పించేలా అన్ని పర్యాటక ప్రాంతాలను సుందరీకరించి, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

అదేవిధంగా బుద్ధవనం ప్రాజెక్టులో అంతర్జాతీయ ప్రమాణాలతో వెల్‌నెస్ సెంటర్, యోగా, ధ్యాన కార్యక్రమాలు, ఆధ్యాత్మిక పర్యాటకానికి అనుకూలమైన ప్రత్యేక కార్యకలాపాలు ఏర్పాటు చేయడానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. వీటితో పాటు పుష్కర ఘాట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం లేజర్ షో, సంగీత ప్రదర్శనలు, బోటింగ్, నది ఒడ్డున వినోద కార్యక్రమాలు, బౌద్ధ వారసత్వాన్ని ప్రతిబింబించే ప్రత్యేక పర్యాటక ఆకర్షణలు అభివృద్ధి చేస్తే అమరావతి దేశవ్యాప్తంగా ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా అవతరిస్తుందని అభిప్రాయపడ్డారు. అమరావతి బౌద్ధ వారసత్వాన్ని ప్రపంచ పర్యాటక పటంలో మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లేందుకు అవసరమైన అన్ని చర్యలను దశలవారీగా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

# ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు..
# మన భవిష్యత్తుకు చుక్కాని 'భోగాపురం'

- టూరిజం, కనెక్టివిటీతోనే అభివృద్ధి, లక్షలాది ఉద్యోగాలు
- మంత్రి కందుల దుర్గేష్ ఉద్ఘాటన
- రుషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో ఘనంగా భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవ కర్టెన్ రైజర్ కార్యక్రమం
- ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించిన మంత్రి దుర్గేష్
- అలరించిన సైకత శిల్పాలు, సాంస్కృతిక వేడుకలు




విశాఖపట్నం (చైతన్యరథం): భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ముందస్తు వేడుకల్లో భాగంగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ఋషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో "కర్టెన్ రైజర్" కార్యక్రమాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల చేతుల మీదుగా భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో.. పర్యాటక శాఖ చేపట్టిన ఈ కర్టెన్ రైజర్ కార్యక్రమం ఆహుతులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంది.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర ప్రాంతంలో పర్యాటక రంగం అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించాలంటే అభివృద్ధి, రవాణా అనుసంధానత (కనెక్టివిటీ) ఎంతో అవసరం అన్నారు. రైలు, రోడ్డు, ఆకాశ, జల మార్గాల ద్వారా సమర్థవంతమైన కనెక్టివిటీ ఏర్పడితే పరిశ్రమలు వస్తాయి, పర్యాటకరంగం విస్తరిస్తుంది, తద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ కల్పన జరుగుతుంది. ఈ ప్రాంతానికి అంతర్జాతీయ విమానాశ్రయం రావడం ఎంతో ఆనందదాయకం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టుకు "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు" అని నామకరణం చేశారని గుర్తుచేస్తూ, ప్రజా కలలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని" మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.

విమానాశ్రయ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతన్నలకు కృతజ్ఞతలు తెలుపుతూ సైకత శిల్పంలో "థాంక్స్ ఫార్మర్స్" అని సముచితంగా పొందుపరచడం అభినందనీయం అని మంత్రి దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నమూనాను సైకత శిల్పంగా మలచడం అద్భుతంగా ఉందని కొనియాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పచ్చదనం, పరిశుభ్రత, పర్యాటకుల భద్రతకు పెద్దపీట వేస్తూ ఋషికొండ బీచ్ 'బ్లూ ఫ్లాగ్' గుర్తింపు పొందడం గర్వకారణం అని పేర్కొన్నారు. బీచ్‌ను నిరంతరం శుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికుల శ్రమ వల్లే ఈ గుర్తింపు కొనసాగుతోందని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పర్యాటకులు ఎవరూ ప్లాస్టిక్ వ్యర్థాలను బీచ్‌లో పడేసి దీని ఔన్నత్యాన్ని దెబ్బతీయవద్దని, ప్లాస్టిక్ వల్ల గుర్తింపు కోల్పోతే రాష్ట్రానికే అప్రతిష్ఠ వస్తుందని హితవు పలికారు. ఋషికొండ బీచ్ వద్ద చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారుల ప్రయోజనాలు కాపాడే పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని మంత్రి దుర్గేష్ భరోసా ఇచ్చారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

దాదాపు 500 మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ట్రస్ట్ తరఫున చిన్నారులు చేసిన అద్భుతమైన నృత్య కార్యక్రమాలను, గిరిజన నృత్య కళారూపాలను మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు. సాంప్రదాయ కోలాటంతో తనకు స్వాగతం పలికిన మహిళామణులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు.. మన ఎయిర్‌పోర్ట్ మన భవిష్యత్" పేరుతో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద, సైకత శిల్పాల వద్ద మంత్రి కందుల దుర్గేష్ ఉత్సాహంగా ఫోటోలు దిగారు. అక్కడ ఏర్పాటు చేసిన సిగ్నేచర్ వాల్‌పై తన సంతకాన్ని తెలుగులో చేశారు.

అంతర్జాతీయ పర్యాటకుల రాకను పెంచేందుకు, భోగాపురం ఎయిర్‌పోర్ట్‌తో స్థానిక పర్యాటక రంగానికి ఉన్న అనుసంధానాన్ని వివరిస్తూ పర్యాటక శాఖ రూపొందించిన కార్యక్రమాలు, ఏపీ పర్యాటక విశేషాల ప్రదర్శనలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ విజయవంతమైన కార్యక్రమాన్ని నిర్వహించిన ఉత్తరాంధ్ర టూరిజం శాఖాధికారులను మంత్రి దుర్గేష్ అభినందించారు.

ఈ వేడుకలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి, టూరిజం అండ్ ట్రావెల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ మోహన్, హోటల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పవన్ కార్తీక్, డీఎంవో జగదీష్, జనసేన పార్టీ నాయకులు సందీప్, శ్రీనివాస్, ఇతర పర్యాటక శాఖ అధికారులు, స్థానిక నాయకులు, పెద్ద ఎత్తున పర్యాటకులు పాల్గొన్నారు.

# చట్టాలను ఉల్లంఘించి...
# జంగిల్ రెడ్డిలా మారిన జగన్ రెడ్డి

- ప్రధాని పర్యటనకు ముందు ర్యాలీల పేరుతో అరాచకం
- పోలీసు అధికారులపై వైసీపీ మూకల దౌర్జన్యం హేయం
- చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి
- టీడీపీ నేత గొట్టిపాటి రామకృష్ణ

అమరావతి (చైతన్యరథం): మహనీయులు లోకకళ్యాణం కోసం యజ్ఞాలు చేస్తుంటే, వాటిని ఎలాగైనా భగ్నం చేయాలని రాక్షసులు ప్రయత్నించేవారని పురాణాల్లో చదివాం.. ఈరోజు రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వ్యవహార శైలి కూడా అదే విధంగా కనిపిస్తోందని టీడీపీ నేత గొట్టిపాటి రామకృష్ణ విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి సిద్ధమవుతున్న వేళ, ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు రాత్రింబవళ్లు శ్రమిస్తుంటే.. ఇలాంటి కీలక సమయంలో రాష్ట్ర అభివృద్ధిని స్వాగతించాల్సింది పోయి, దాన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం, ఉపాధి అవకాశాలు పెరగడం, ఉత్తరాంధ్ర వేగంగా అభివృద్ధి చెందడం జగన్మోహన్ రెడ్డికి ఏమాత్రం ఇష్టం లేదన్నట్లుగా ఆయన రాజకీయాలు సాగుతున్నాయని గొట్టిపాటి రామకృష్ణ విమర్శించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని రాజకీయ కోణంలో చూసి అడ్డంకులు సృష్టించడం ఆయనకు అలవాటుగా మారిందన్నారు. సాధారణంగా ఎక్కడైనా బాధితులను, గాయపడిన వారిని లేదా మరణించిన వారి కుటుంబాన్ని పరామర్శిస్తారు. కానీ, జగన్ మాత్రం ప్రమాదం చేసి, కనీసం వైద్యం అందించకుండా పారిపోయిన నేరస్థుడిని పరామర్శించడానికి వెళ్లడం తీవ్ర అభ్యంతరకరం. బైక్ ప్రమాదం చేసి, ప్రాణాలు తీసి, వేరొకరిని ముద్దాయిగా నిలబెట్టి బలి చేయాలని చూసింది ఎవరో కాదు... ఈ రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన, వృత్తిరీత్యా డాక్టర్ అయిన సీదిరి అప్పలరాజు. తప్పు చేసిన వ్యక్తిని మందలించాల్సింది పోయి, జగన్ స్వయంగా వెళ్లి పరామర్శించడం అంటే నేరస్తులను ఏ విధంగా ప్రోత్సహిస్తున్నారో అర్థమవుతోందని గొట్టిపాటి విమర్శించారు.

### పోలీసులపై దౌర్జన్యం నేరం

గతంలో తన పర్యటనలోనే కారు కింద పడి నలిగిపోయి చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించని జగన్, ప్రధాని పర్యటనకు సరిగ్గా ఒక్క రోజు ముందు 10 గంటల పాటు ర్యాలీ పేరుతో నిబంధనలన్నీ ఉల్లంఘించారు. ప్రజల స్వేచ్ఛను, ప్రయాణాలను అడ్డుకుంటూ నరకయాతన చూపించారు. అధికారులు విధులను నిర్వర్తించకుండా బలప్రయోగం చేయడం, వారిపై దౌర్జన్యానికి దిగడం చట్టరీత్యా తీవ్రమైన నేరం. పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించి ప్రజలకు భంగం కలిగించడం క్రిమినల్ చర్య కిందకే వస్తుంది. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగిస్తూ, అభివృద్ధి యజ్ఞాన్ని భగ్నం చేయాలని చూస్తున్న ఇలాంటి రాక్షస రాజకీయాలను ప్రజలు ఎప్పటికీ క్షమించరని గొట్టిపాటి రామకృష్ణ స్పష్టం చేశారు. తమ పాలనలో నిబంధనల పేరుతో విపక్షాలను ఇంట్లోంచి బయటకు రానివ్వని జగన్, ప్రధాని పర్యటన వేళ భద్రతా నిబంధనలను



నడిరోడ్డుపై తుంగలో తొక్కారు. నేరస్తులను ప్రోత్సహించడం, మహిళా అధికారులపై బలప్రయోగం చేయడమే జగన్ మార్క్ రాక్షస రాజకీయం. జగన్మోహన్ రెడ్డి తన స్వార్థ రాజకీయాల కోసం చట్టాలను, నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టారని రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి దేశ ప్రధాని వస్తున్న వేళ, ప్రోటోకాల్, భద్రతా చర్యలను విచ్ఛిన్నం చేసేలా జగన్ వ్యవహరించారని ధ్వజమెత్తారు. చట్టాలను ఉల్లంఘించి జగన్ సాధించిందేమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని గొట్టిపాటి డిమాండ్ చేశారు.

### అనుమతి లేకున్నా ర్యాలీలు..

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి, భోగాపురం ఎయిర్‌పోర్ట్ ద్వారా వస్తున్న దేశవ్యాప్త గుర్తింపును పక్కదారి పట్టించడమే జగన్ అసలు ఉద్దేశం. పరామర్శ అనేది కేవలం ఒక నెపం మాత్రమే. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భద్రత పేరుతో చుట్టూ పరదాలు కట్టుకుని, చెట్లను సైతం నరికేసి పర్యటనలు చేశారు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు బయటకు రాకుండా రెండు రోజుల ముందే నోటీసులు ఇచ్చి గృహనిర్బంధాలు చేశారు. మరి ఈరోజు ప్రధాని పర్యటనకు భద్రత కల్పిస్తున్న అధికారులను అడ్డుకోవడం, అనుమతులు లేకున్నా అదే ప్రాంతంలో ర్యాలీలు తీయడం జగన్ ద్వంద్వ నీతికి నిదర్శనం కాదా? ప్రమాదంలో మనుషులు చనిపోతే కనీసం ఆ కుటుంబాన్ని పరామర్శించని జగన్, తప్పు చేసిన నేరస్తులను మాత్రం వెనుకేసుకొస్తున్నారు. ఎంతటి ఘోరమైన నేరం చేసినా దాన్నే మంచిగా ప్రచారం చేసుకునే మనస్తత్వం వీరిది. అందుకే వైసీపీని ప్రజలు 'గొడ్డలి పార్టీ' అని, వీరిని 'క్రిమినల్స్' అని పిలుస్తున్నారు. ప్రధాని పర్యటనకు భంగం కలిగిస్తూ, అధికారుల విధులపై దౌర్జన్యం చేస్తూ జగన్ ప్రదర్శించిన ఈ క్రిమినల్ మనస్తత్వాన్ని, రాక్షస కాలాన్ని రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని, తగిన సమయంలో మళ్లీ బుద్ధి చెబుతారని గొట్టిపాటి రామకృష్ణ హెచ్చరించారు.

నేరం చేసిన వ్యక్తిని ప్రోత్సహిస్తూ, రాష్ట్రంలో మరింతమంది నేరగాళ్లను తయారుచేసే సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారని స్పష్టమవుతోంది. ప్రజాసేవలో, విధుల నిర్వహణలో ఉన్న అధికారులపై దాడులు చేయడం, వారిని భయభ్రాంతులకు గురిచేయడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయం. ఇటువంటి చర్యలు అధికారుల నిబద్ధతను, మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయి. చట్టాన్ని, నిబంధనలను బొందపెట్టి దౌర్జన్యాలకు దిగిన ప్రతి ఒక్కరిపై ప్రభుత్వం చట్టబద్ధంగా కఠిన చర్యలు తీసుకోవాలి. సమాజంలో చట్టం పట్ల గౌరవం నిలవాలన్నా, భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి చర్యలకు పాల్పడకుండా ఉండాలన్నా చట్టాన్ని ఉల్లంఘించిన వారికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉంది. అధికారుల మనోధైర్యాన్ని పెంచేలా ప్రభుత్వం స్పందించి, విధి నిర్వహణకు ఆటంకం కలిగించి మహిళా అధికారులపై దాడికి దిగిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని గొట్టిపాటి రామకృష్ణ డిమాండ్ చేశారు.

# ‘సంక్షేమం’ రెట్టింపు

- నవరత్నాలను నవమోసాలు చేసిన గొడ్డలి పార్టీ
- 85 శాతం హామీలకు ఎగనామం పెట్టిన జగన్‌రెడ్డి
- ఆర్థిక లోటు ఉన్నా.. రెండేళ్ల కాలంలోనే 90 శాతం అమలు చేసిన కూటమి ప్రభుత్వం



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంక్షేమం అనేది ఎప్పుడూ ఎన్నికల హామీ మాత్రమే కాదు... ప్రభుత్వ పనితీరును కొలిచే ప్రధాన ప్రమాణంగా మారింది. అయితే సంక్షేమం అంటే కేవలం నగదు బదిలీ చేయడమా? లేక ప్రజల జీవితాల్లో స్థిరమైన మార్పు తీసుకురావడమా? అన్న ప్రశ్నకు గత ఐదేళ్ల వైసీపీ పాలన, ప్రస్తుతం కొనసాగుతున్న కూటమి ప్రభుత్వ పాలన రెండు వేర్వేరు సమాధానాలు ఇస్తున్నాయి. ఒకవైపు నవరత్నాల పేరుతో భారీ హామీలు ఇచ్చి వాటిలో అధిక భాగాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిన ప్రభుత్వం ఉంటే... మరోవైపు తీవ్రమైన ఆర్థిక లోటు, ఖాళీ ఖజానాతో అధికారంలోకి వచ్చినప్పటికీ రెండేళ్లలోనే ఎన్నికల హామీల్లో దాదాపు తొంభై శాతం అమలు చేశామని చెప్తున్న కూటమి ప్రభుత్వం ఉంది. అందుకే ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో “నవరత్నాలు - నవమోసాలు” అనే విమర్శకు బలం చేకూరుతోందని అధికారపక్షం వాదిస్తోంది.

### హామీలు చెప్పడం ఒకటి... అమలు చేయడం మరోటి

2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం నవరత్నాలు పేరుతో ప్రజలకు అనేక హామీలిచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని పథకాలను నామమాత్రంగానే అమలు చేసింది. ఉద్యోగాలు, సీపీఎస్ రద్దు, రైతు రుణమాఫీ, సంపూర్ణ మద్య నిషేధం, అమరావతి అభివృద్ధి, ఇసుక విధానం, అంగన్వాడీల వేతనాల పెంపు వంటి అనేక కీలక హామీలపై మాట తప్పిందనే విమర్శలు ఇప్పటికీ వున్నాయి. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాత్రం ఎన్నికల మేనిఫెస్టోనే ప్రభుత్వ కార్యాచరణగా మార్చి వరుసగా పథకాలను అమలు చేస్తోందని చెప్తోంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఎన్నికల హామీలపై నిబద్ధత నిరూపిస్తున్నామని పేర్కొంటోంది.

### పింఛన్లలో స్పష్టమైన వ్యత్యాసం

రాష్ట్రంలో అత్యధిక మంది నేరుగా లబ్ధి పొందుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో పింఛన్లు మొదటి స్థానంలో నిలుస్తాయి. కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో సుమారు రూ.1.70 లక్షల కోట్ల మేర పింఛన్లు అందిస్తామని ప్రకటించింది. ఇప్పటికే 25 నెలల్లో దాదాపు రూ.71 వేల కోట్లను పంపిణీ చేసింది. దీనికి భిన్నంగా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో మొత్తం సుమారు రూ.84 వేల కోట్ల మేర మాత్రమే పింఛన్లపై వ్యయం చేసిందని అధికారపక్షం లెక్కలు చెప్తోంది. అంటే ఒకే పథకంలోనే దాదాపు రెట్టింపు వ్యయం చేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైందని పేర్కొంటోంది.

### తల్లికి వందనం... అమ్మఒడి కంటే విస్తృత అమలు

విద్యార్థుల చదువుకు తల్లులను ఆర్థికంగా ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రస్తుతం అమలు చేస్తున్న “తల్లికి వందనం” పథకానికి రెండేళ్లలోనే రూ.18,865 కోట్లను తల్లుల ఖాతాల్లో జమ చేసినట్లు ప్రభుత్వం వెల్లడిస్తోంది. ఐదేళ్లలో దాదాపు రూ.50 వేల కోట్ల వరకు ఈ పథకానికి వ్యయం చేయనున్నట్లు ప్రకటించింది. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ‘అమ్మఒడి’ పథకంలో మాత్రం అనేక పరిమితులు, కోతలు, లబ్ధిదారుల తగ్గింపు వంటి చేసి ఇబ్బందులకు గురిచేశారు. ఐదేళ్లలో మొత్తం వ్యయం రూ.23,877 కోట్లకే పరిమితమైందని కూటమి నేతలు గుర్తు చేస్తున్నారు.

### అన్నదాతకు అధిక భరోసా

వ్యవసాయమే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. ఈ నేపథ్యంలో రైతులకు నేరుగా నగదు సాయం అందించే పథకాలకూ ప్రాధాన్యం పెరిగింది. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ‘అన్నదాత సుఖీభవ’ పథకం కింద తొలి ఏడాది, రెండో ఏడాది మొదటి విడతకలిపి ఇప్పటికే రూ.12,100 కోట్లకుపైగా రైతుల ఖాతాల్లో జమచేసింది. ఐదేళ్లలో సుమారు రూ.45వేల కోట్లమేర రైతులకు అందిస్తామని తెలిపింది. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన రైతు భరోసా పథకానికి ఐదేళ్లలో రూ.33,640 కోట్లే ఖర్చు చేసినట్లు అధికారపక్షం వివరిస్తోంది.

### దీపం-2తో ఉచిత గ్యాస్... గతపాలనలో ధరల భారం

గ్యాస్‌సిలిండర్ ధరలు జగన్‌పాలనలో రూ.700 స్థాయినుంచి వెయ్యిరూపాయలు దాటినదశకు చేరుకున్నాయని ప్రభుత్వంగుర్తుచేస్తోంది. అదే సమయంలో కూటమి ప్రభుత్వం ‘దీపం-2’ ద్వారా ఏడాదికి మూడు గ్యాస్‌సిలిండర్లను ఉచితంగాఅందిస్తూ మహిళలపై పడే భారం తగ్గిస్తోందని చెప్తోంది. ఇప్పటికే ఈ పథకానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయగా... ఐదేళ్లలో దాదాపు రూ.10 వేల కోట్ల మేర వ్యయం చేయనున్నట్టు అంచనా వేస్తోంది.

### స్త్రీ శక్తి...ఉచిత ప్రయాణం ద్వారా ఆదా

మహిళల ప్రయాణ వ్యయాన్ని తగ్గించే ఉద్దేశంతో ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. రెండేళ్లలోనే సుమారు రూ.2,800 కోట్లను మహిళల ప్రయాణం కోసం కూటమి ప్రభుత్వం ఖర్చుచేసింది. దీనికి విరుద్ధంగా వైసీపీ పాలనలో బస్సు ఛార్జీలను మూడు దఫాలు పెంచడం ద్వారా కుటుంబాలపై అదనపు భారం పడింది.

### అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ

పేదలకు తక్కువ ధరలో భోజనం అందించే అన్న క్యాంటీన్లను అధికారంలోకి వచ్చిన వెంటనే మూసివేయడం వైసీపీ ప్రభుత్వ పెద్ద తప్పిదంగా ప్రజలు గుర్తు పెట్టుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వాటిని తిరిగి ప్రారంభించి రెండేళ్ల కాలంలోనే రూ.200 కోట్లను వెచ్చిస్తూ పట్టణ పేదలకు భరోసాగా నిలుస్తోందని పేర్కొంటోంది.

### విద్యుత్ ఛార్జీలలో రెండు విధానాలు

గొడ్డలి పార్టీ విద్యుత్ ఛార్జీలను తొమ్మిదిసార్లు పెంచి ప్రజలపై వేల కోట్ల రూపాయల భారం మోపిందని ఆరోపిస్తే... మరో ప్రభుత్వం ట్రూ-డౌన్ విధానం ద్వారా ప్రజలపై పడే భారాన్ని తగ్గించింది. రెండేళ్లలోనే విద్యుత్ వినియోగదారులపై పడే రూ.21వేల కోట్లకు పైగా భారాన్ని కూటమి ప్రభుత్వం తగ్గించింది.






జమ్ము సాయి కల్యాణ్, అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

### సంక్షేమం ఇచ్చి... ధరలతో వెనక్కి తీసుకున్నారా?

గత ఐదేళ్ల పాలనలో ఒక చేత్తో నగదు ఇస్తూ మరో చేత్తో ధరలపెంపు ద్వారా ప్రజల జేబుల నుంచి మరింత ఎక్కువగా వసూలుచేశారు. మద్యం ధరలను ఇందుకు ఉదాహరణగా చెప్తోంది. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో రూ.60 ఉన్న ఓటీ క్వార్టర్ ధర జగన్ పాలనలో రూ.180కు చేరింది. రోజుకు ఒక క్వార్టర్ మద్యం కొనుగోలు చేసే వ్యక్తి నెలకు అదనంగా రూ.3,600, ఏడాదికి రూ.43,200,ఐదేళ్లలో రూ.2లక్షలకుపైగా అదనంగా ఖర్చు చేసిన పరిస్థితిఏర్పడింది. ఒకవైపు ‘అమ్మఒడి’ కింద కుటుంబానికి అందిన సాయం కంటే మద్యం ధరల పెంపు ద్వారా అదే కుటుంబం నుంచిమరింత ఎక్కువమొత్తం వెనక్కివెళ్లి పోయింది. అంతే కాకుండా నాసిరకం మద్యం కారణంగా ఆరోగ్యపరమైన నష్టాలు కూడా పెరిగాయి.

### ఇసుక విధానం... 125 వృత్తులపై ప్రభావం

వైసీపీ ప్రభుత్వం అవినీతి నిర్మూలన పేరుతో తీసుకొచ్చిన ఇసుక విధానం నిర్మాణ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. ఇసుక ధరలను పలుమార్లు పెరగడం, సరఫరా అంతరాయం కారణంగా భవన నిర్మాణాలు నిలిచిపోవడం, లక్షలాది మంది నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోవడం, ఇసుకపై ఆధార పడిన 125కిపైగా వృత్తులు తీవ్ర ప్రభావానికి గురయ్యారు.

### ఆటో డ్రైవర్లకు అధిక మద్దతు

ఆటో డ్రైవర్ల సంక్షేమంలో కూడా రెండు ప్రభుత్వాల మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోంది. వైసీపీ ప్రభుత్వం రూ.10వేల సాయం అందించగా, కూటమి ప్రభుత్వం రూ.15 వేల వరకు పెంచింది. లబ్ధిదారుల సంఖ్యను కూడా పెంచింది. అంతేకాదు తక్కువ సమయంలోనే పథకాన్ని అమలు చేయడం తోపాటు రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి డ్రైవర్లకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించింది.

### 120కి పైగా పథకాలను రద్దు చేసిన జగన్‌రెడ్డి

టీడీపీ ప్రభుత్వం గతంలో అమలు చేసిన 120 సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దుచేసింది. అదే సమయంలో పరిశ్రమల తరలింపు,అమరావతి అభివృద్ధి నిలిచిపోవడం, పోలవరం ప్రాజెక్టు ఆలస్యం, నదుల అనుసంధానానికి ఆటంకం వంటి అంశాలను కూడా వైసీపీ పాలన వైఫల్యాలుగా నిలిచాయి. అదే విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సబ్‌ప్లాన్ నిధులు రూ.1.14లక్షల కోట్ల దారి మళ్లింపు, ఉద్యోగాల భర్తీ, రైతు రుణమాఫీ, సీపీఎస్ రద్దు, మద్య నిషేధం వంటి హామీల అమలులోనూ వైసీపీ విఫలమైంది.

### సంక్షేమమా... స్వావలంబననా!

సంక్షేమం అంటే కేవలం డబ్బు పంచడం కాదని, ప్రజలను తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే నిజమైన సంక్షేమమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆలోచన. టీడీపీ హయాంలో సబ్సిడీతో వాహనాలు, ఉపాధి అవకాశాలు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా కుటుంబాలు స్వయం సమృద్ధి వైపు వెళ్లాయి. వైసీపీ ప్రభుత్వం మాత్రం ప్రజలను ప్రభుత్వ నగదు బదిలీలపై ఆధారపడే విధానాన్ని ప్రోత్సహించింది.

### లెక్కలు చెప్తున్న నిజం

రాష్ట్ర రాజకీయాల్లో సంక్షేమంపై చర్చ ఇప్పుడు కొత్త దశకు చేరుకుంది. హామీలు ఇవ్వడం, నగదు పంపిణీ చేయడం మాత్రమే కాదు.. ఆ సంక్షేమం ప్రజల జీవన ప్రమాణాలను ఎంతవరకు మెరుగుపరిచింది? ప్రజల ఖర్చులను తగ్గించిందా? ఉపాధి అవకాశాలను పెంచిందా? ఆర్థిక స్వావలంబన కల్పించిందా? అనే ప్రశ్నలే ఇప్పుడు కీలకంగా మారుతున్నాయి.

కూటమి ప్రభుత్వం తన రెండేళ్ల పాలనలో ఎన్నికల హామీల్లో అధిక భాగాన్ని అమలు చేసి సంక్షేమానికి దాదాపు రూ.4 లక్షల కోట్ల వ్యయ ప్రణాళికతో ముందుకు వెళ్తుంది. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోయాయి, ధరల పెంపు, విద్యుత్ భారం, ఇసుక విధానం, మద్యం ధరలు, అసంపూర్ణ హామీలు ప్రజల్లో అసంతృప్తి మిగిల్చాయి. సంక్షేమం ఎంత ఇచ్చామన్నది మాత్రమే కాదు... ప్రజల జీవితాల్లో ఎంత మార్పు తీసుకొచ్చామన్నదే ఏ ప్రభుత్వానికైనా అసలైన ప్రమాణమని ఈ రెండు పాలనలు స్పష్టం చేస్తోంది.



## టూరిజం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ పదవీ విరమణ

**- సత్కరించిన ఏపీటీడీసీ చైర్మన్ డా.నూకసాని బాలాజీ**

విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ శుక్రవారం పదవీ విరమణ చేశారు. పర్యాటకశాఖ అభివృద్ధికి, పర్యాటక రంగం పురోగతికి ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీడీసీ చైర్మన్ డా. నూకసాని బాలాజీ, మేనేజింగ్ డైరెక్టర్ ఏ.ఎల్. పద్మావతి కలిసి అజయ్ జైన్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. అజయ్ జైన్ పదవీ విరమణ అనంతరం ఆయనకు ఆరోగ్యకరమైన, ఆనందకరమైన భవిష్యత్తు ఉండాలని డా. నూకసాని బాలాజీ ఆకాంక్షించారు.

అనంతరం అజయ్ జైన్‌ను పర్యాటక శాఖ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అజయ్ జైన్ మాట్లాడుతూ, తన పదవీకాలంలో పర్యాటక శాఖ అభివృద్ధికి సహకరించిన అధికారులు, సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తన విధుల నిర్వహణలో ఉద్యోగులు అందించిన సహకారం, మద్దతును ఆయన ప్రత్యేకంగా అభినందించారు.



# నేరస్తులు, క్రిమినల్స్‌కు
# ముఠా నాయకుడిగా జగన్

తప్పు చేసిన తమ పార్టీ నాయకులను గుడ్డిగా సమర్థిస్తూ రౌడీలకు, గుండాలకు, బెట్టింగ్ బ్యాచ్‌లకు ముఠా నాయకుడిగా వ్యవహరిస్తున్నారు జగన్ రెడ్డి. పరామర్శల పేరుతో రౌడీలు, బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్, బెట్టింగ్ బ్యాచ్‌లకు మద్దతుగా నిలుస్తూ రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య సృష్టిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో చట్టం ముందు అందరూ సమానులేనని రాజ్యాంగం ఘోషిస్తుంది. కానీ అధికార దాహంతో, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం నైతిక విలువలను గాలికి వదిలేసి తీవ్రమైన నేరాలకు పాల్పడి కటకటాల్లోకి నెట్టబడిన రౌడీషీటర్లు, క్రిమినల్స్‌ను పరామర్శించడానికి వెళ్లడం, వారి నేరాలను బహిరంగంగా సమర్థించడం అత్యంత ఆందోళనకరమైన పరిణామం. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తన పార్టీ నేతల్లో జైలుపాలైన క్రిమినల్స్‌ను, హంతకులను, అవినీతిపరులను ప్రత్యేకంగా వెళ్లి కలవడం, పరామర్శించడం ద్వారా ఈ సమాజానికి ఎటువంటి సందేశాన్ని ఇస్తున్నారు అంటున్నారు ప్రజలు. ఒక పార్టీ అధ్యక్షుడు జైలులో ఉన్న క్రిమినల్స్‌ను లేదా హంతకులను పరామర్శించడం సమాజంలో నేరస్థులకు ఒక తప్పుడు సంకేతాన్ని పంపుతుంది. మీరు ఎలాంటి నేరాలకైనా పాల్పడండి, నేను, మా పార్టీ మీకు అండగా ఉంటుందనే భరోసా ఇస్తున్నారు. ఇది నేరస్థుల్లో భయాన్ని పోగొట్టి మరింత అరాచకత్వానికి దారితీసే పరిణామం. హత్యలు, దాడుల కారణంగా సర్వస్వం కోల్పోయి రోదిస్తున్న నిర్దోషుల కుటుంబాలు న్యాయం కోసం ఎదురు చూస్తుంటాయి. ఆ సమయంలో నేరానికి పాల్పడిన నిందితుడిని ఒక ప్రముఖ రాజకీయ పార్టీ నాయకుడు వెళ్లి పరామర్శించి అతడిని హీరోలా ప్రాజెక్ట్ చేయడం బాధితుల క్షోభను మరింత పెంచడమే అవుతుంది. నేరస్తులను, జైలుకు వెళ్లిన వారిని సమర్థించడం వల్ల ప్రజల్లో అవినీతి, అరాచకం, హత్యలు నేరం కావనే భావన కలుగుతుంది. జగన్‌రెడ్డి చర్యలతో యువత మరింత పెడదోవ పట్టే ప్రమాదం ఉంది. చట్టాన్ని ఉల్లంఘించినా, హింసకు పాల్పడినా, హత్యలు చేసినా, చివరికి రాజకీయ అండదండలతో బయటపడొచ్చనే ఆలోచన వారిలో కలుగుతుంది. ఇది రాష్ట్రంలో శాంతి భద్రతల క్షీణతకు, సామాజిక అశాంతికి దారితీస్తుంది. రాజకీయం అంటే ప్రజలకు సేవ చెయ్యడానికి తప్ప హంతకులకు కొమ్ముకాస్తూ సమర్థించ డానికి కాదని జగన్ తెలుసుకోవాలి.

### అధికారంలో ఉన్నప్పుడు ఒక ప్రమాణం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో ప్రమాణం

ఒక రాజకీయ పార్టీ అధినేతగా తన పార్టీకి చెందిన వివాదాస్పద నాయకుల విషయంలో పదేపదే రాజకీయ రక్షణగా నిలుస్తున్నారనే విమర్శలు రావడంపై ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన బాధ్యత జగన్‌పై వుంది. తన పార్టీకి చెందిన వ్యక్తులపై ఆరోపణలు వచ్చినప్పుడు 'చిన్న తప్పు'గా చూడటం, ప్రత్యర్థిపై అదే ఆరోపణలు వస్తే పెద్ద నేరాలుగా చిత్రీకరించడం రాజకీయ నైతికత కాదు. ప్రజలు కోరుకునేది రౌడీలకు రాజకీయ ఆశ్రయం కాదు. జగన్ రెడ్డి తన కార్యకర్తలకు ధైర్యం చెప్పడం తప్పు కాదు. కానీ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి



నిందితుల తరపున గొంతెత్తడం, ప్రతీ కేసునూ రాజకీయ కక్షగా చిత్రీకరించడం, పోలీసు దర్యాప్తునే ప్రశ్నించడం అంటే ప్రజలకు ఏ సందేశం ఇస్తున్నారు అన్నదే అసలు ప్రశ్న. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతి దర్యాప్తునూ 'కక్ష'గా, ప్రతి కేసునూ 'వేధింపు'గా, ప్రతి అరెస్టునూ ప్రజాస్వామ్య హత్యగా చిత్రించడం ఏమిటి? జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఒక ప్రమాణం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో ప్రమాణం పాటించడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ఆయన సీఎంగా ఉన్న సమయంలో ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై నమోదైన కేసులను జగన్ ప్రభుత్వం సమర్థించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు అదే చట్టపరమైన వ్యవస్థ వైసీపీ నేతలపై చర్యలు తీసుకుంటే దానిని మొత్తం రాజకీయ కక్షగా కొట్టిపారేయడం ఏ విధమైన నైతికత? అధికారంలో ఉన్నప్పుడు చట్టం గొప్పదా? ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత ఆ చట్టం కక్షసాధింపు అవుతుందా? అని జగన్‌ను ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, న్యాయం గురించి పదేపదే మాట్లాడుతున్నారు కదా? అధికారంలో వున్నప్పుడు వాటికి ఆచరణలో ఇచ్చిన విలువ ఏమిటి అంటున్నారు. మరి ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పగలరా జగన్ రెడ్డీ. మీ పార్టీ వారిని అరెస్టు చేస్తే రాజకీయ కక్ష, ప్రత్యర్థి పార్టీ వారిని అరెస్టు చేస్తే చట్టం తన పని తాను చేసినట్లు అవుతుందా? మీ పార్టీ కార్యకర్తలు, నాయకులపై కేసు పెడితే అక్రమ కేసు. ప్రత్యర్థి వారి పై కేసు పెడితే నేరానికి శిక్షనా? ఇలాంటి ద్వంద్వ ప్రమాణాలు ప్రజాస్వామ్యానికి మంచిదా జగన్ రెడ్డీ! విభజన గాయం నుంచి కొలుకుంటున్న ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పుడు కావాల్సింది రౌడీయిజాన్ని, క్రిమినల్స్‌ను ప్రోత్సహించే సంస్కృతి కాదు. శాంతి భద్రతలు, చట్టబద్ధ పాలన కావాలి. కావున నేరారోపణలు ఎదుర్కొంటున్న వారి చుట్టూ రాజకీయ రక్షణ గోడలు కడుతూ, ప్రతి కేసునూ రాజకీయ కక్షగా చిత్రీకరిస్తూ పోతే మీరు ప్రజల కోసం పనిచేస్తున్నారా? లేక మీ రాజకీయ పలుకుబడితో నేరస్తులకు రక్షణ కవచంగా నిలుస్తున్నారా? అని ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు జగన్ రెడ్డి సమాధానం చెప్పాల్సి వుంటుంది.

### సైకో మూకల్ని పోగేసుకుని రోడ్లపై బల ప్రదర్శన

ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి బాధ్యతగా వ్యవహరించాలని తమ నేతలకు చెప్పాల్సింది పోయి తప్పు చేసిన వారిని సమర్థించడం దిగజారుతున్న రాజకీయాలకు నిదర్శనమని చెప్పక తప్పదు. గతంలో గుంటూరు జిల్లాలో గంజాయి వ్యాపారంతో సంబంధం ఉన్న వారిని పోలీసులు కొట్టారు. వారి పరామర్శ పేరిట అక్కడకు వెళ్లిన జగన్‌రెడ్డి గంజాయి వ్యాపారం చేసిన రౌడీ మూకను సుద్దపూసలు అంటూ సమర్థించారు. పార్టీ పరంగా కాకుండా తన సొంత మీడియా ద్వారా కూడా ఆయన నేరస్తులకు అండగా నిలిచే ప్రయత్నం చేస్తున్నారు. వైసీపీ మాజీ ఎమ్మెల్సీ అనంతబాబును దళిత డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం కీలక నిందితుడిగా పేర్కొంది. అయినా ఆయన్ను పక్కన కూర్చోబెట్టుకుని రాజకీయం చేశారు గత ఐదేళ్లూ జగన్. వైఎస్ వివేకానందరెడ్డి హత్య ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలోనే అత్యంత సంచలనాత్మకమైన కేసుల్లో ఒకటి. ఈ కేసులో వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆరోపణలు ఎదుర్కొన్న ఆయన్ను జగన్ రాజకీయంగా సమర్థిస్తూ కాపాడే ప్రయత్నం చేశారు. టీడీపీ జాతీయ కార్యాలయంపై దాడి కేసులో నిందితుడిగా వున్న నందిగం సురేష్ ఏదో స్వాతంత్ర్య సమరయోధుడైనట్లు పరామర్శకు జైలుకు వెళ్ళారు. ఎన్నికల సమయంలో ఈవీఎంను ధ్వంసం చేయడంతో పాటు హత్యాయత్నం కేసులో నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించేందుకు జగన్ రెడ్డి జైలుకు వెళ్లడం, వినుకొండలో వ్యక్తిగత కక్షల నేపథ్యంలో హత్యకు గురైన రషీద్ కుటుంబాన్ని పరామర్శించే పేరుతో రాజకీ యం చేశారు. గుంటూరు జిల్లాలో జగన్ కాన్వాయ్‌కు సంబంధించిన ఘటనలో వైసీపీ కార్యకర్త సింగయ్య మరణించడంతో జగన్ సహా పలువురిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటనను కూడా రాజకీయం చేశారు. తాజాగా శ్రీకాకుళానికి చెందిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు చేసిన మోటారు సైకిల్ ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించగా... పద్దెనిమిదేళ్ల చిన్న పిల్లాడు ఏదో తెలియక యాక్సిడెంట్ చేస్తే మానవత్వం లేకుండా శిక్షించాలని ప్రభుత్వం అనుకోవడం ఏమిటని ప్రశ్నించడంతో పాటు జైలులో వున్న అప్పలరాజును పరామర్శ పేరుతో రోజంతా సైకో మూకల్ని పోగేసుకొని రోడ్లపై బలప్రదర్శన చెయ్యడం, ప్రమాదం చేసిన వారిని సమర్థించడం, 2029 తర్వాత నరుకుతాం, చంపుతాం అని జగన్ అనుచరులు రెచ్చిపోవడం, ఏ మాత్రం వెరపు లేకుండా చట్టమన్నా, పోలీసులన్నా భయం లేకుండా రప్పా రప్పా అంటూ ప్లకార్డులు ప్రదర్శించడం దేనికి సంకేతమో జగన్ రెడ్డి చెప్పాలి.

### హంతకులు, నేరస్తులు, క్రిమినల్స్‌ను కాపాడేందుకు అహర్నిశలూ శ్రమిస్తున్నారు

ఎటువంటి ప్రజా సిద్ధాంతం లేకుండా అబద్దాలతో పార్టీని స్థాపించి శవ రాజకీయాలతో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి మళ్లీ అధికారం పోగానే ఎక్కడ శవం కనిపిస్తే అక్కడికి వెళ్లి శవ రాజకీయాలు చేస్తున్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక సంఘటనలు జరిగి అనేక మంది చనిపోయారు. మరి అప్పుడు ఏనాడూ పరామర్శకు వెళ్లలేదు. జగన్ సీఎంగా ఉండగా తిరుపతి రుయా ఆస్పత్రిలో ఆక్సిజన్ అందక 21 మంది చనిపోయినా వెళ్ళలేదు. అన్నమయ్య ప్రాజెక్టు గేటు కొట్టుకుపోయి 33 మంది చనిపోయినా పరామర్శించలేదు. గోదావరిలో కచ్చులూరు వద్ద బోటు ప్రమాదంలో 39 మంది చనిపోయినా కన్నెత్తి చూడలేదు. అధికారంలో ఉన్నప్పుడు ఆ ఘటనలు జగన్ రెడ్డికి కనిపించలేదు. ఆ రోజు వారివి ప్రాణాలుగా గుర్తించలేదు. నేడు పదవి పోగానే పరామర్శల పేరుతో ప్రజల్లోకి వెళ్లి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతూ, గొడవలు సృష్టించేందుకు ప్రభుత్వాన్నే తప్పుబడుతున్నారు. ఏదేమైనా తన వెంట ఉండే హంతకులు, నేరస్తులు, క్రిమినల్స్‌ను కాపాడేందుకు జగన్ రెడ్డి అహర్నిశలూ శ్రమిస్తున్నారు. వారు ఎలాంటి తప్పులు చేసినా మీకు అండగా ఉంటానని పార్టీ శ్రేణులకు ఆయన సందేశం ఇస్తున్నారు. ప్రజల కంటే, ప్రజలను చంపేందుకు కుట్ర చేస్తున్న వారిని పరామర్శించేందుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వంపై బురద జల్లేందుకే తన సమయాన్నంతా వెచ్చిస్తున్నారు. బాధ్యత కలిగి గత ఐదేళ్లు ముఖ్యమంత్రిగా వున్న జగన్ రెడ్డి ఇప్పటివరకు రెండేళ్లుగా ప్రజా సమస్యలపై మాట్లాడలేదు. అధికారంలో వున్నంతకాలం తన విధ్వంస కార్యకలాపాలను నిర్వహించడానికే ఎమ్మెల్యేలు, ఎంపీలను వినియోగించారు. వాళ్ళను వీధి రౌడీల కంటే కింది స్థాయికి దిగజార్చారు. తెలుగుదేశం నాయకులను దుర్భాషలాడటానికి, దాడులు చేయడానికి ఉపయోగించారు. నేడు పదవి పోగానే జైలు లో వున్న తన పార్టీ నేరస్తులను సమర్థిస్తూ పరామర్శల పేరుతో ప్రజల్లోకి వెళ్లి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాల్జేయాలని కుట్ర పన్నారు. ఇటువంటి పార్టీ, ఇటువంటి నాయకుడు రాష్ట్రంలో ఉండటానికి అర్హత ఉందో లేదో ని ప్రజలే ప్రశ్నించాలి.

**- నీరుకొండ ప్రసాద్**





ఒక రాష్ట్ర అభివృద్ధిని కేవలం జీడీపీ వృద్ధి, పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలతో మాత్రమే కొలవలేం. ఆ అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తి దాకా చేరాలంటే ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలి. పేదవాడు కూడా ఎలాంటి ఆర్థిక భారం లేకుండా అత్యాధునిక వైద్యం పొందగలిగితేనే సంక్షేమ పాలనకు అర్థం ఉంటుంది. అదే ఆలోచనతో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో వైద్యారోగ్య రంగాన్ని కేవలం ఒక శాఖగా కాకుండా మానవాభివృద్ధికి మూలస్తంభంగా భావించి సమగ్ర సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. "ఆరోగ్యాంధ్రప్రదేశ్" అనే దూరదృష్టితో ప్రజా వైద్య వ్యవస్థను పునర్నిర్మించే ప్రయత్నం ప్రారంభించింది. గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన సమస్యలను అధిగమిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించడం, వైద్య సేవలను మరింత సమర్థవంతంగా మార్చడం ఈ రెండేళ్ల పాలనలో ప్రధాన లక్ష్యంగా నిలిచింది.

## వైద్య రంగంలో నూతన సంస్కరణలు

'ఆరోగ్యాంధ్రప్రదేశ్' దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు

'డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ'లతో పేదలకు భరోసా

'సంజీవని'తో డిజిటల్ ఆరోగ్య సేవలు



# ప్రజారోగ్యానికి ఊపిరి

ప్రభుత్వ ఆసుపత్రులు బలోపేతం కావాలంటే ముందుగా పరిపాలనా వ్యవస్థ బలోపేతం కావాలి. భవనాలు నిర్మించడం, పరికరాలు కొనుగోలు చేయడం మాత్రమే సరిపోదు. వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది సమయపాలనతో, బాధ్యతాయుతంగా పనిచేసే వ్యవస్థ అవసరం. ఈ అంశాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం మొదటి నుంచే పరిపాలనా సంస్కరణలకు ప్రాధాన్యత ఇచ్చింది. వైద్యులు, సిబ్బంది హాజరుపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టడంతో మొదటి ఏడాదిలో 7 శాతం పెరుగుదల నమోదవగా రెండో ఏడాదిలో అది 28.13 శాతానికి చేరుకుంది. ఈ ఒక్క గణాంకమే ప్రభుత్వ పర్యవేక్షణ ఎంత సమర్థంగా పనిచేస్తోందో తెలియజేస్తుంది. హాజరు పెరగడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు సేవలు మరింత అందుబాటులోకి వచ్చాయి. ఆలస్యం తగ్గింది. వైద్యులపై ప్రజల్లో నమ్మకం పెరిగింది.

### వైద్యుల పనితీరుకు స్పష్టమైన కొలమానం

ప్రభుత్వ ఉద్యోగాల్లో బాధ్యతను పెంచేందుకు పనితీరు అంచనా విధానం అమలు చేస్తారు. ఇప్పుడు అదే విధానాన్ని ఆరోగ్య రంగంలో కూడా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక వైద్యుడు రోజుకు ఎంతమంది ఓపీ రోగులను పరీక్షించాలి, ఎంతమంది ఇన్ పేషెంట్లకు చికిత్స అందించాలి, ఎన్ని శస్త్ర చికిత్సలు నిర్వహించాలి, ప్రత్యేక వైద్య సేవల్లో ఎంత సమయం కేటాయించాలి వంటి అంశాలకు స్పష్టమైన ప్రమాణాలను రూపొందిస్తోంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రతి వైద్యుడి పనితీరును సమీక్షించి అవసరమైనచోట శిక్షణ, సిబ్బంది పునర్వ్యవస్థీకరణ, సదుపాయాల కల్పన వంటి చర్యలు చేపట్టే విధానాన్ని ప్రభుత్వం రూపొందిస్తోంది. ఇది కేవలం నియంత్రణ కాదు... ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు రూపొందించిన సమగ్ర పరిపాలనా సంస్కరణ.

### ఆసుపత్రులకూ పనితీరు ఆధారిత పరిపాలన

వైద్యులే కాదు... ఆసుపత్రులు కూడా ఫలితాల ఆధారంగా పనిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రతి ఆసుపత్రిలో ఓపీ సంఖ్య, ఇన్‌పేషెంట్ సేవలు, ప్రసవాలు, శస్త్ర చికిత్సలు, అత్యవసర వైద్య సేవలు, ప్రత్యేక వైద్య విభాగాల పనితీరును సమీక్షిస్తూ లక్ష్యాలను నిర్దేశించనుంది. ఎక్కడ సేవలు మెరుగ్గా ఉన్నాయి? ఎక్కడ వెనుకబడ్డాయి? ఏ ఆసుపత్రికి అదనపు నిపుణులు అవసరం? ఎక్కడ మౌలిక సదుపాయాలు పెంచాలి? వంటి అంశాలపై డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్య పరిపాలనను పూర్తిగా ఫలితాల ఆధారిత వ్యవస్థగా మార్చే ప్రయత్నం జరుగుతోంది.



### ఆయుష్ సేవలకు పునరుజ్జీవం

ఆరోగ్య సంరక్షణ అంటే కేవలం ఆధునిక వైద్యమే కాదు. సంప్రదాయ వైద్య విధానాలకు కూడా ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కేంద్ర సహకారంతో రూ.124 కోట్ల నిధులు సాధించింది. ఆరు ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రులు, మూడు కొత్త ఆయుష్ కళాశాలలకు అనుమతులు పొందడం ద్వారా ఆయుర్వేదం, యోగా, యునానీ, సిద్ధ, హోమియోపతి సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే దిశగా అడుగులు వేసింది.

### ఒకే లక్ష్యం-ప్రజలకు నాణ్యమైన వైద్యం

రాష్ట్రంలో ప్రస్తుతం 10,032 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, 1,145 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 560 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 244 సెకండరీ ఆసుపత్రులు, 38 బోధన, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు కలిపి మొత్తం 12,756 ప్రభుత్వ ఆరోగ్య సంస్థలు పనిచేస్తున్నాయి. వీటిలో 13వేలకు పైగా వైద్యులు సేవలందిస్తున్నారు. ఇంత పెద్ద ఆరోగ్య వ్యవస్థను ఒకే ప్రమాణాలతో పర్యవేక్షిస్తూ ప్రతి సంస్థ పనితీరును సమీక్షించే విధానాన్ని ప్రభుత్వం రూపొందించడం దేశంలోనే అరుదైన పరిపాలనా సంస్కరణగా చెప్పవచ్చు.



### డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ... పేదలకు మరింత భరోసా

ఆర్థిక స్తోమత లేక వైద్యం దూరం కాకూడదనే లక్ష్యంతో అమలవుతున్న డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకానికి కూటమి ప్రభుత్వం మరింత బలం చేకూర్చింది. గత ప్రభుత్వ హయాంలో సంవత్సరానికి సగటున 8.20 లక్షల మంది మాత్రమే ఈ పథకం ద్వారా లబ్ధి పొందగా... గత రెండేళ్లలో ఆ సంఖ్య 74 శాతం పెరిగి 14.27 లక్షలకు చేరుకుంది. అంతేకాదు... ఈ పథకంపై ప్రభుత్వం చేసే వ్యయం కూడా గణనీయంగా పెరిగింది. గతంలో సంవత్సరానికి రూ.2,415 కోట్లు ఖర్చు చేస్తే ఇప్పుడు అది రూ.3,805 కోట్లకు చేరుకుంది. నెట్‌వర్క్ ఆసుపత్రులకు చెల్లింపులు రూ.1,987 కోట్ల నుంచి రూ.3,300 కోట్లకు పెరగడంతో ప్రైవేట్ ఆసుపత్రులు కూడా ప్రభుత్వ ఆరోగ్య పథకాలపై మరింత విశ్వాసంతో సేవలు అందించే పరిస్థితి ఏర్పడింది.

### భవిష్యత్ తరాల కోసం రూపొందుతున్న విజన్

ప్రస్తుత అవసరాలను తీర్చడం మాత్రమే కాదు... భవిష్యత్తు అవసరాలను ముందుగానే అంచనా వేసి ఆరోగ్య వ్యవస్థను సిద్ధం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం "ఆరోగ్యాంధ్రప్రదేశ్" విజన్‌ను రూపొందిస్తోంది. మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న వృద్ధుల జనాభా, మాతా-శిశు ఆరోగ్యం, జీవనశైలి వ్యాధులు, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళిక సిద్ధమవుతోంది.

### రేర్ డిసీజెస్‌పై ప్రత్యేక కార్యాచరణ

ఇటీవలి కాలంలో అరుదైన వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించింది. రేర్ డిసీజెస్‌కు సంబంధించిన పరిశోధనలు, డేటా సేకరణ, ప్రత్యేక వైద్య కేంద్రాల ఏర్పాటు, నిపుణుల బృందాల అభివృద్ధి వంటి అంశాలపై కార్యాచరణ రూపొందిస్తోంది. భవిష్యత్తులో ఇలాంటి వ్యాధులతో బాధపడుతున్న కుటుంబాలకు రాష్ట్రంలోనే అత్యాధునిక చికిత్స అందించే వ్యవస్థను నిర్మించాలన్నది ప్రభుత్వ సంకల్పం.

### సంజీవని... డిజిటల్ ఆరోగ్య సేవల విప్లవం

సాంకేతికత వినియోగం లేకుండా ఆధునిక ఆరోగ్య వ్యవస్థను ఊహించలేం. అందుకే ప్రభుత్వం సంజీవని ద్వారా రాష్ట్రంలోని అన్ని ఆరోగ్య సేవలను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావాలని నిర్ణయించింది. రోగి వైద్య చరిత్ర, పరీక్షల ఫలితాలు, మందుల వివరాలు, చికిత్స రికార్డులు అన్నీ డిజిటల్ రూపంలో అందుబాటులోకి రావడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా మెరుగైన వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుంది.

### కేంద్ర-రాష్ట్ర సమన్వయం... అభివృద్ధికి బలమైన పునాది

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారాన్ని సమర్థంగా వినియోగించుకోవడం వల్ల రాష్ట్రం ఆరోగ్య రంగంలో అనేక కార్యక్రమాలను వేగంగా అమలు చేయగలిగింది. జాతీయ ఆరోగ్య మిషన్, ఆయుష్, వైద్య విద్య, ఆరోగ్య మౌలిక వసతులు, ఆరోగ్య కేంద్రాల బలోపేతం వంటి కార్యక్రమాల్లో కేంద్ర సహకారం రాష్ట్రానికి గణనీయమైన బలం చేకూర్చింది.

### ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ప్రాధాన్యం

గత రెండేళ్లలో ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయంలోనూ ఒక స్పష్టమైన సందేశం కనిపిస్తోంది. అది ప్రభుత్వ ఆసుపత్రులను ప్రజలు నమ్మేలా చేయాలి. పేదవాడికి నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండాలి. వైద్యులు జవాబుదారీతనంతో పనిచేయాలి. ప్రతి ఆసుపత్రి ఫలితాల ఆధారంగా ముందుకు సాగాలి. ఆరోగ్య సేవలు గ్రామీణ ప్రాంతాలకు మరింత చేరువ కావాలి. ఈ లక్ష్యాల సాధనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది.

### సుపరిపాలనకు ఆరోగ్య రంగమే అద్దం

సంక్షేమ పథకాలు ప్రకటించడం ఒక దశ అయితే... వాటిని ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేలా అమలు చేయడం అసలైన సుపరిపాలన. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం ఆరోగ్య రంగంలో చేపట్టిన సంస్కరణలు కేవలం గణాంకాలకే పరిమితం కాలేదు. ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసాన్ని పెంచడం, వైద్యులకు జవాబుదారీతనం తీసుకురావడం, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవను విస్తరించడం, డిజిటల్ ఆరోగ్య సేవలకు పునాది వేయడం, ఆయుష్‌కు ప్రాధాన్యం ఇవ్వడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆరోగ్యాంధ్రప్రదేశ్ విజన్‌ను రూపొందించడం వంటి చర్యలు రాష్ట్ర ప్రజారోగ్య రంగానికి కొత్త దిశను నిర్దేశించాయి.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యున్నత బాధ్యత అనే భావనతో సాగుతున్న ఈ ప్రయాణం... రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యుత్తమ ప్రజారోగ్య వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా నిలబెట్టే దిశగా బలమైన పునాది వేసిందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

శశికుమార్
తెలుగుదేశం సైనికుడు



# దేశవ్యాప్తంగా 4,925 ఆరోగ్య పరిశోధన ప్రాజెక్టులకు ఆమోదం

**●ఆరోగ్య పరిశోధన మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత : ఎంపీ కేశినేని శివనాథ్**



న్యూఢిల్లీ / విజయవాడ (చైతన్యరథం): దేశంలో ఆరోగ్య పరిశోధన రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడం, వైద్య కళాశాలలు, పరిశోధనా సంస్థల్లో అత్యాధునిక పరిశోధన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం, ప్రజారోగ్య సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను అందించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం "ఆరోగ్య పరిశోధన ప్రోత్సాహం కోసం మౌలిక సదుపాయాల అభివృద్ధి" కేంద్ర రంగ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ మేరకు విజయవాడ లోక్‌సభ సభ్యులు కేశినేని శివనాథ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మంత్రి సమాధానం ఇస్తూ ఈ కేంద్ర రంగ పథకం కింద మల్టీ ఈ యూనిట్లలో ఏర్పాటైన స్థానిక పరిశోధన సలహా కమిటీలు పరిశోధన ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం పరిశీలించి ఆమోదిస్తున్నాయని తెలిపారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా మొత్తం 4,925 పరిశోధన ప్రాజెక్టులు ఆమోదించబడ్డాయి. వీటిలో 1,796 ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తికాగా, 1,801 ప్రాజెక్టులు ప్రస్తుతం అమలులో ఉన్నాయి. మరో 1,282 ప్రాజెక్టులు ప్రారంభ దశలో ఉండగా, 46 ప్రాజెక్టులు వివిధ కారణాలతో విరమించబడ్డాయి అని అన్నారు. కొనసాగుతున్న 1,801 పరిశోధన ప్రాజెక్టుల్లో 285 ప్రాజెక్టులు ఒక సంవత్సరం లోపు, 587 ప్రాజెక్టులు ఒకటి నుండి రెండు సంవత్సరాల మధ్య, 619 ప్రాజెక్టులు రెండు నుండి మూడు సంవత్సరాల మధ్య, 310 ప్రాజెక్టులు మూడు సంవత్సరాలకు పైగా పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించినట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. నిధుల అంశానికి సంబంధించి, ఈ పథకం పూర్తిగా కేంద్ర రంగ పథకం కావడంతో రాష్ట్రాల వారీగా నిధుల కేటాయింపు ఉండదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్ర బడ్జెట్‌లో ఆరోగ్య పరిశోధన విభాగానికి కేటాయించిన నిధులను అవసరాలకు అనుగుణంగా నేరుగా విడుదల చేసి పరిశోధన మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగిస్తున్నట్లు తెలిపింది. గత మూడు సంవత్సరాల కాలంలో (2023–24 నుండి 2025–26 వరకు) ఈ పథకం ద్వారా విశేష ఫలితాలు సాధించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. మల్టీ–డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్స్ ద్వారా 1,100 పరిశోధన ప్రాజెక్టులు పూర్తికాగా, 687 శాస్త్రీయ పరిశోధనా వ్యాసాలు ప్రచురించబడ్డాయి. అదనంగా 16 కొత్త సాంకేతికతలు, ప్రక్రియలు, పేటెంట్లు అభివృద్ధి చేయబడ్డాయి లేదా క్లినికల్/ప్రజారోగ్య మార్గదర్శకాల రూపకల్పనలో వినియోగించబడ్డాయి. అదేవిధంగా మోడల్ గ్రామీణ ఆరోగ్య పరిశోధన యూనిట్స్ ద్వారా 158 పరిశోధన ప్రాజెక్టులు పూర్తికాగా, 140 పరిశోధనా ప్రచురణలు వెలువడ్డాయి. వీటిలో 14 పరిశోధన ప్రాజెక్టులు క్లినికల్ విధానాలు, ప్రజారోగ్య విధానాల్లో మార్పులకు దోహదపడినట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

# ధింసా నృత్యంతో గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించిన కూటమి ప్రభుత్వం

**●భోగాపురంలో గిరిజన సంస్కృతికి ప్రపంచ గుర్తింపు : రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్**



అరకు (చైతన్యరథం): భోగాపురంలో నిర్వహించిన చారిత్రాత్మక కార్యక్రమంలో 13 వేల మంది గిరిజన బాలికలు ఏకకాలంలో ప్రదర్శించిన సాంప్రదాయ ధింసా నృత్యం గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం గిరిజన సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగా లభించిన అపూర్వ గౌరవమని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కిడారి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు ప్రత్యక్షంగా పరిశీలించి, అన్ని ప్రమాణాలను ధృవీకరించిన అనంతరం గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదైనట్లు ప్రకటించడం ప్రతి తెలుగు వ్యక్తి, ముఖ్యంగా గిరిజన సమాజానికి గర్వకారణమని అన్నారు. ఈ చారిత్రాత్మక ధింసా నృత్య కార్యక్రమంలో గిరిజన సంక్షేమ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొని గిరిజన కళా వైభవాన్ని ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం ప్రభుత్వం తరపున మంత్రి సంధ్యారాణి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధుల చేతుల మీదుగా గిన్నిస్ వరల్డ్ రికార్డు ధ్రువీకరణ పత్రాన్ని అందుకోవడం రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. గిరిజనుల సాంప్రదాయ కళలను అంతర్జాతీయ వేదికపై నిలబెట్టి ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని కిడారి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక విజయానికి కృషి చేసిన ప్రతి గిరిజన బాలికకు, అధికార యంత్రాంగానికి, నిర్వాహకులకు మరియు మంత్రి సంధ్యారాణికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# "తల్లికి వందనం" ఫిర్యాదులన్నీ ప్రభుత్వానికి పంపిస్తున్నాం : ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ (చైతన్యరథం): సింగ్‌నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుల కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధతో కలిసి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అధికారం తమకు అలంకారం కాదని, ప్రజలకు సేవ చేసే బాధ్యత అని పేర్కొన్న ఆయన, ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని సంబంధిత శాఖలకు పంపించి, సమస్య పరిష్కారం జరిగే వరకు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. వెంటనే పరిష్కారం సాధ్యం కాకపోయినా, ఎప్పుడు పరిష్కారం అవుతుందో ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, ఇచ్చిన ప్రతి అర్జీకి స్పందన లభిస్తుండటంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈరోజు ముఖ్యంగా 'తల్లికి వందనం' పథకం కింద లబ్ధి అందని వారు పెద్ద సంఖ్యలో ప్రజాదర్బార్‌కు వచ్చారని చెప్పారు. వారి నుంచి గ్రీవెన్స్ దరఖాస్తులు స్వీకరించి, ప్రతి అర్జీకి ప్రత్యేక నంబర్ కేటాయించి ప్రభుత్వానికి పంపిస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన మ్యాపింగ్ సిస్టమ్ కారణంగా ఇల్లు, విద్యుత్ కనెక్షన్, ఆదాయపు పన్ను, నాలుగు చక్రాల వాహనం లేదా ఇతర వివరాల ఆధారంగా కొంతమంది అనర్హుల జాబితాలో కొనసాగుతున్నారని, అందువల్ల గత ఏడాది లబ్ధి పొందిన కొందరికి ఈసారి "తల్లికి వందనం" అందలేదని, మరికొందరికి తక్కువ మొత్తం జమైందనే ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పాల్గొన్నారు.

# భీమిలి జనసమీకరణ ఏర్పాట్లపై మంత్రులతో గంటా చర్చ

**● బస్సు పార్కింగ్ స్థలాల పరిశీలన... 640 రూట్లు ఖరారు**



భీమిలి (చైతన్యరథం): భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి జనసమీకరణ ఏర్పాట్లపై టీడీపీ ముఖ్యనాయకులు భీమిలి పార్టీ ఆఫీస్‌లో శుక్రవారం సమీక్షించారు. భీమిలి నుంచి బయలుదేరే బస్సులు, భోజన ఏర్పాట్లు, పార్కింగ్ సౌకర్యం తదితర అంశాలపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంత్రులు పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, ఎం.రాంప్రసాద్‌రెడ్డి, కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణలతో కలిసి చర్చించారు. భీమిలి నియోజకవర్గం నుంచి బయలుదేరే 640 బస్సులు రూట్లు ఖరారు చేశామని నారాయణ తెలియజేశారు. 29 వేల మందిని సభకు తరలించడానికి బస్సులు సిద్ధం చేశామని గంటా చెప్పారు. పద్మనాభం పరిసర ప్రాంతాల వారికి భోగాపురం వెళ్లి రావడానికి ఇబ్బంది లేకుండా తాటితూరు దగ్గర్లో బస్సు పార్కింగ్ సదుపాయం కల్పించాలని ఆర్టీఓ సంగీత్ మాధుర్‌కు సూచించారు. యాప్ ద్వారా బస్సుల కదలికలు విశ్లేషిస్తారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర గ్రోత్ ఇంజన్ భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని మంత్రులు కోరారు. నియోజవర్గ పరిశీలకులైన ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భాష్యం ప్రవీణ్, అశోక్ రెడ్డి, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, భీమిలి పార్టీ ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

**బస్సు పార్కింగ్ స్థలాల పరిశీలన**

అంతకుముందు భోగాపురం ఎయిర్ పోర్టు జనసమీకరణ కోసం ఉద్దేశించిన బస్సులకు భోజన సౌకర్యం కల్పించడానికి నిలుపు చేసే పార్కింగ్ స్థలాలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. అమనాం, పోలిపల్లి, సవరవల్లి, తగరపువలస, చిట్టివలస, దొరతోట, బొడ్డపాలెం తదితర ప్రాంతాల్లో పార్కింగ్‌కు అనువైన లే అవుట్లు, ఖాళీ స్థలాలను పరిశీలించారు.

# సభికుల భోజన ఏర్పాట్లపై ఎమ్మెల్యేలు ఎంజీఆర్, వనమాడి కొండబాబు సమీక్ష



పాతపట్నం (చైతన్యరథం): భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ సభకు హాజరయ్యే పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు భోజనాల ఏర్పాట్లపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్థల పరిశీలన చేపట్టారు ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు. దేశ ప్రధానమంత్రి చేతుల మీదుగా నేడు ప్రారంభం కానున్న ఏఎస్ఆర్ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి పాతపట్నం నియోజకవర్గం నుండి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లనున్న నేపథ్యంలో వారికి భోజనాల ఏర్పాట్ల కోసం ఎచ్చెర్ల మండలం హరినాం అక్కివలస గ్రామంలోని ప్రకృతి లేఅవుట్, జాతీయ రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన స్థలాన్ని నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరయ్యే ప్రతి ఒక్కరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా భోజనాలు, తాగునీరు, వాహనాల పార్కింగ్, విశ్రాంతి తదితర ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత నాయకులు, నిర్వాహకులకు ఎమ్మెల్యేలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలను కించపరిస్తే సహించేది లేదు



ఆమదాలవలస (చైతన్యరథం): వైసీపీ నాయకులు మహిళలు కించపరిచే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదని, అటువంటి వారిపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత అన్నారు. శుక్రవారం ఆమదాలవలస తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్ కంపోలు జైల్లో ఉన్న మాజీ మంత్రి అప్పలరాజును పరామర్శించేందుకు వెళుతున్న సందర్భంగా ఆమదాలవలస మండలం కొత్త రోడ్డు వద్ద డ్యూటీలో ఉన్న ఎస్ఐతో వైకాపా నేతలు అనుచితంగా ప్రవర్తించడం విచారకరమన్నారు. వెంటనే వారిపై చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**మనం అన్యాయంతో రాజీపడటం అంటే అతిపెద్ద నేరం చేసినట్టే - నేతాజీ సుభాష్ చంద్రబోస్**

# గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న కూటమి ప్రభుత్వం

**●పిడింగొయ్యి గ్రామంలో "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి-సంక్షేమం" డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఇంటింటికి వెళుతున్నామని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. ఈరోజు పిడింగొయ్యి గ్రామంలో జైహింద్ నగర్, గంగిరెడ్డుల కాలనీ, వెంకటగిరి ప్రాంతాల్లో "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి-సంక్షేమం" డోర్ టు డోర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఈ రెండేళ్లలో చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తున్నామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాల కంటే ఎక్కువ శాతం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, కూటమి ప్రభుత్వంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ప్రజల అభీష్టం మేరకు పనులు పూర్తి చేస్తున్నామని, ఈ ప్రాంతంలో కొన్నిచోట్ల రోడ్లు డ్రైనేజీలు నిర్మించాల్సి ఉందని అంచనాలు సిద్ధం చేశామని, త్వరలోనే పనులు మొదలుపెట్టి త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో వైసీపీ నేతల వికృత చేష్టలు పెచ్చుమీరుతున్నాయి

**●డోర్ టూ డోర్ కార్యక్రమంలో జగన్‌పై మండిపడ్డ గన్ని కృష్ణ**

**●ఏకంగా పోలీసులపైనే వైసీపీ దౌర్జన్యకాండ**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసీపీ నేతల వికృతి చేష్టలు రోజురోజుకి పెచ్చుమీరుతున్నాయని గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ ధ్వజమెత్తారు. జగన్మోహనరెడ్డి ఓదార్పు యాత్ర పేరిట ప్రజలమీద దండయాత్ర చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక 2వ డివిజన్‌లో డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్న గన్నికృష్ణ వైసీపీ అసభ్యప్రవర్తనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆఖరుకు పోలీసులమీద కూడా వైసీపీ నేతలు తమ వికృతచేష్టలు చూపిస్తున్నారని అన్నారు. ఓ మహిళా ఎస్సై మీద వైసీపీ నేతలు చేసిన దౌర్జన్యకాండ అసభ్యప్రవర్తన దారుణంగా వుందని అన్నారు.. డ్రైవింగ్ లైసెన్స్ కూడా సరిగా లేని మాజీ మంత్రి తనయుడు నిబంధనలకు వ్యతిరేకంగా మోటార్ బైక్ నడిపి ఓ పేద వ్యక్తి మరణానికి కారకుడైతే "పిల్లోడు తెలిసీ తెలియక "యాక్సిడెంట్ చేస్తే కేసు పెడతారా అంటూ పేదవాడి ప్రాణానికి విలువలేనట్టు మాటాడడం జగన్ వంటి వ్యక్తికే చెల్లిందని విమర్శించారు. పరామర్శ పేరుతో కిరాయి మనుషులతో బలప్రదర్శన చేసిన వైసీపీ నేతల నైజాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. యాక్సిడెంట్ చేసిన వాడి సొస్యాలు తారుమారు చేసిన వాడిని పరామర్శించడానికి రప్పా రప్పా యాత్ర చేసిన నాయకుడికి ఉన్న సమయం చనిపోయిన వ్యక్తి కుటుంబసభ్యులను గానీ, అసభ్యప్రవర్తకు గురైన లేడీ పోలీస్‌ను కనీసం పలకరించికపోవడం హేయమైన చర్య అని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఉప్పులూరి జానకి రామయ్య, సలాది ఆనంద్, మిస్కా జోగినాయుడు, రాయుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మరింత మేలు చేస్తాం : ఎమ్మెల్యే వరుపుల



రౌతులపూడి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ రెండేళ్ల నమ్మకం పేరిట కార్యక్రమాన్ని శృంగవరం గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్యఅతిథిగా హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. కూటమితోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి, ప్రగతి, సంక్షేమ పథకాల అమలు సాధ్యమైందని, రానున్న రోజుల్లో మరింత మేలు చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. స్థానిక నాయకులు లొండ దేవుళ్లు, వాసం సాంబశివరావు, యండమూరి గోపి తదితరులతో కలిసి పథకాలను వివరించి కరపత్రాలు అందించారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, కూటమి నాయకులు తమరాల సత్యనారాయణ, సోమరౌతు చంద్రమౌళి, పైలా పైడిరాజు, పైలా వేణుగోపాల్, ఇటంశెట్టి భాస్కరబాబు, కరణం సుబ్రహ్మణ్యం, లెక్కల రాము తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

# జాతీయ జెండా ర్యాలీని జయప్రదం చేయండి : దాసరి శ్యామ్ చంద్రశేషు



జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): ఆగస్టు 2వ తేదీన ఆదివారం జాతీయ జెండా రూపకర్త తెలుగు వ్యక్తి పింగళి వెంకయ్య 150వ జయంతి సందర్భంగా జంగారెడ్డిగూడెంలోని బస్టాండ్ నుంచి అశ్వరావుపేట రోడ్డులోని బాయ్స్ హై స్కూల్ వరకు రెండు కిలోమీటర్ల జాతీయ జెండా ప్రదర్శన ర్యాలీని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాం చంద్రశేషు పిలుపునిచ్చారు. ఆగష్టు 2వ తేదిన జరిగే ఈ కార్యక్రమం కోసం వివిధ రాజకీయ పక్షాలు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలతో శ్యామ్ చంద్ర శేషు శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న రాజకీయ పక్షాల నేతలు, విద్యాసంస్థల ప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, జంగారెడ్డిగూడెంలో మొట్టమొదటిసారిగా ఒక అద్భుత కార్యక్రమం జరగబోతుందని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో రెండు కిలోమీటర్ల భారీ జెండా ప్రదర్శన చేయడం ఇది రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద కార్యక్రమంగా రూపొందించబడుతుందని దీనికి సహకరిస్తున్న విద్యాసంస్థలు హాస్పిటల్స్ సామాజిక సంస్థలు రాజకీయ పక్షాలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ గంటా పద్మశ్రీ, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న



విజయవాడ (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ బుద్దా వెంకన్న తెలిపారు. శుక్రవారం 52వ డివిజన్ నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ... పింఛన్లు, ఇళ్ల స్థలాలు, వైద్య సహాయం, ప్రభుత్వ పథకాలు ఇతర స్థానిక సమస్యలకు సంబంధించిన అంశాలపై వినతులు స్వీకరించామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రతి వినతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ సేవలు ప్రతి అర్హుడికి చేరేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మరియు పశ్చిమ నియోజకవర్గం అబ్జర్వర్ మల్లెల ఈశ్వర్, మాజీ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వర చంటి, 52వ డివిజన్ అధ్యక్షులు ఈగల సాంబ, 52వ డివిజన్ అధ్యక్షులు నల్లబిల్లి కనకారావు, గణప రాము, పాలాంటి గంగాధర్, సోలంకి రాజు, చీపుళ్ళ వెంకటేశ్వరరావు, గోలి శీను,అశోక్, దేవర కళ్యాణ్, నాగోతి వెంకటేష్, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిపై సర్వత్రా హర్షం

**●7వ డివిజన్‌లో టీడీపీ డోర్-టు-డోర్ లో పాల్గొన్న ఎన్టీఆర్ అధ్యక్షురాలు గద్దె అనురాధ**



విజయవాడ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డోర్-టు-డోర్ కార్యక్రమము ఘనంగా జరుగుతోందని, ప్రభుత్వం పనితీరు పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని, సంక్షేమ పథకాలు తమకు అందుతున్నాయని ప్రజలు చెబుతున్నారని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ పేర్కొన్నారు. శుక్రవారం 7వ డివిజన్‌లోని బోయపాటి మాధవరావు వీధి, అట్లూరి పరమాత్మ వీధి ప్రాంతాలలో గద్దె అనురాధ డోర్-టు-డోర్ కార్యక్రమములో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి రెండేళ్ల కూటమి పాలనపై పాంప్లెట్లను అందజేసి, ఈ కాలంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించారు. ప్రజల నుండి ప్రభుత్వ పనితీరుగురించి, సంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం పనితీరుపట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలు తమకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని తెలియజేస్తున్నారని చెప్పారు. మహిళలకు ఇటీవలే తల్లికి వందనం పడడం, ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ, ఒకటవ తేదీనే పింఛన్లు పడడం లాంటివాటి పట్ల అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆమె తెలియజేశారు. ఈ ప్రాంతంలో డ్రైనేజి సమస్య ఉందని కొందరు వ్యక్తం చేశారని, సదరు సమస్యను ఎమ్మెల్యే మరియు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని గద్దె అనురాధ చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇటు సంక్షేమంతోపాటుగా అటు అభివృద్ధి విషయంలో కూడ చాలా పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మురుగు కాలువల సమస్యలు లేకుండా చూడండి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**●అధికారులకు సూచన... ప్రజల నుంచి అర్జీలు స్వీకరణ**



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గంలోని చిన్న, సన్నగల్లీల్లోనూ మురుగు కాలువల సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళామాధవి ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. 18వ డివిజన్ వద్దిగూడెం ప్రాంతానికి చెందిన ప్రజలు మురుగు కాలువలు, రోడ్ల నిర్మాణం, పార్కులోని భారీ వృక్షం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు, సైడ్ కాలువల్లో మంచినీటి పైపులు ఉండటంతో కలుషితమయ్యే ప్రమాదాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన గళ్ళా మాధవి సమస్యలను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని స్పష్టం చేశారు. అనంతరం గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సందాని ఎమ్మెల్యే గళ్ళా మాధవిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఇటీవల జరిగిన జాతీయ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మూడు పతకాలు సాధించిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన క్రీడాకారిణి పేరూరి జ్యోతి వర్మను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులను ప్రోత్సహించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

చైతన్యరథం

# డీఎస్సీపై వైసీపీ నేతల రాద్ధాంతం హాస్యాస్పదం

**●అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులను పట్టించుకోని వైసీపీ నేతలకు ఇప్పుడు మొసలి కన్నీళ్లు!**

**●ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలు మానుకోవాలి: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



నందిగామ (చైతన్యరథం): డీఎస్సీ-2025పై వైసీపీ నేతలు చేస్తున్న నిరాధార ఆరోపణలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తీవ్రంగా ఖండించారు. రాజకీయ లబ్ధి కోసం నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం సరికాదని ఆమె అన్నారు. డీఎస్సీ పరీక్షలపై ఏవైనా అనుమానాలు లేదా ఫిర్యాదులు ఉంటే సంబంధిత అధికారులను ఆశ్రయించి వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. వైసీపీ నేతలు గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతకు ఏం చేశారో ముందుగా ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో ఒక్క మెగా డీఎస్సీ కూడా నిర్వహించకుండా నిరుద్యోగుల ఆశలను నీరుగార్చిన వైసీపీ నేతలు.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉద్యోగ నియామకాలకు ప్రాధాన్యత ఇస్తుంటే ఓర్వలేక విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్య, ఉద్యోగ రంగాల్లో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, నియామక ప్రక్రియలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. విద్యా దీవెన, వసతి దీవెన బకాయిల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు ఉందా? అని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోయిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, గత ప్రభుత్వం వదిలివెళ్లిన ఆర్థిక భారాన్ని సైతం అధిగమిస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి గురించి వైసీపీ నేతలు మాట్లాడటం "దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని" ఎద్దేవా చేశారు.

# ఉత్తరాంధ్ర ఇకపై ఉత్తమ ఉపాధి అవకాశాల కల్పన కేంద్రం

**●గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ రాకతో ఉత్తరాంధ్ర వాసుల జీవన విధానంలో అనూహ్య మార్పులు**

**●విజయనగరంలో భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**

**● ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, మాజీ ఎంపీ కంభంపాటితో కలిసి పార్కింగ్, భోజన ఏర్పాట్లు పరిశీలిన**



చిలకలూరిపేట (చైతన్యరథం): భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రాంతం, ఉత్తమ అవకాశాల కల్పన కేంద్రంగా మారబోతోందని, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ రాకతో ఇక్కడి ప్రజల జీవనవిధానంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయని, భూముల ధరలకు రెక్కలొచ్చాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవ ఏర్పాట్లలో భాగంగా రెండోరోజైన శుక్రవారం ప్రత్తిపాటి విజయనగరంలో పర్యటించారు. ప్రధాని మోదీ సభ, కార్యక్రమాల నిర్వహణ, జనసమీకరణ, భోజనం, ఇతర వసతుల కల్పనకు సంబంధించి, స్థానిక శాసనసభ్యురాలు అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి ఆయన కూటమి నాయకులకు దిశానిర్దేశం చేశారు. అంతకుముందు మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డితోకలిసి పార్కింగ్ స్థలాల్ని పరిశీలించిన ప్రత్తిపాటి... అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు నివాసంలో జరిగిన కూటమి శ్రేణుల సమావేశంలో ప్రత్తిపాటి మాట్లాడారు.

**ఎగతాళి చేసిన నోళ్లు మూతపడేలా ఎయిర్ పోర్టుతో చంద్రబాబు సమాధానం చెప్పారు**

ఎర్రబస్ రాని ఊరికి ఎయిర్ బస్ ఎందుకని ఎగతాళి చేసిన వాళ్ల నోళ్లు మూతపడేలా కూటమిప్రభుత్వం తన పనితీరుతో సమాధానం చెప్పిందని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. భవిష్యత్ లో ఉత్తరాంధ్ర ప్రాంతం మెరైన్, ఐటీ/డేటా, లాజిస్టిక్స్, పర్యాటక రంగాల్లో అద్భుత ప్రగతిని కళ్లారా చూడబోతోందన్నారు. అభివృద్ధి అనే పదం పలకడానికి కూడా అర్హత లేని వారే, విజనరీ నాయకుడు చంద్రబాబు దార్శనికతను అవహేళన చేస్తుంటారని, కూటమి ప్రభుత్వ సారథి.. మాటలకందని చేతల నాయకుడని మరోసారి రుజువైందని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

**ఎయిర్ పోర్టు ఏర్పాటు వెనకున్న అశోక్ గజపతిరాజు కృషిని కొనియాడిన ప్రత్తిపాటి**

విజయనగరం ఎమ్మెల్యే నివాసంలో కూటమి శ్రేణులతో సమావేశం అనంతరం ఎమ్మెల్యే ప్రత్తిపాటి, మాజీ ఎంపీ కంభంపాటి, స్థానిక శాసనసభ్యురాలు అదితి విజయలక్ష్మి గజపతి రాజు గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన సమయంలో భోగాపురం ఎయిర్ పోర్టు ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో అశోక్ గజపతిరాజు చేసిన కృషిని ప్రత్తిపాటి ఈ సందర్భంగా ప్రత్యేకంగా కొనియాడారు.

# ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం (చైతన్యరథం): బాపులపాడు మండలం ఆరుగొలను గ్రామంలో శుక్రవారం నిర్వహించిన '2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. అలాగే గన్నవరం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేశారు. అనంతరం కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనను గెలిపించిన ప్రజల కోసం నిత్యం పనిచేస్తానని, మోసపూరిత రాజకీయాలు చేయాల్సిన అవసరం తనకు లేదన్నారు. ప్రజలకు తలవంపులు తెచ్చే రాజకీయాలు చేయబోనని, విమర్శలకు దిగకపోయినా తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తే మాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్లే నీటి సమస్యకు ఉపశమనం లభించిందని పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతు సమస్యలపై తాను ఎప్పటికప్పుడు అధికారులతో, ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కార మార్గాలు అన్వేషించానని చెప్పారు. సమస్య పరిష్కారానికి కృషి చేయకుండా తాను ఏదో తన లేఖలు వల్లే సమస్య పరిష్కారం అయినట్లు మాజీ ఎమ్మెల్యే అనుకుంటున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే తీరుపై విమర్శలు గుప్పిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కంటే రాజకీయ ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు.

# కూటమి హయాంలో గుడివాడలో రూ.7 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ నిధులు పంపిణీ

**●గుడివాడలో 33 కుటుంబాలకు రూ.19 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**



గుడివాడ (చైతన్యరథం): కష్టాల్లో ఉన్న ప్రజలకు సహాయంగా ఆదుకుంటున్న సీఎం చంద్రబాబుకు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని 33 బాధిత కుటుంబాలకు మంజూరైన రూ.19 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే రాము లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ... కష్టకాలంలో ఆదుకుంటున్న సీఎం చంద్రబాబుకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. "కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఒక్క గుడివాడ నియోజకవర్గంలోనే ఇప్పటివరకు 7 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ నిధులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అంతేకాదు కోట్లాది రూపాయల ఎల్ఓసిలు కూడా మంజూరు చేయించామని ఎమ్మెల్యే రాము చెప్పారు. అవసరంలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది" అని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ ఫైళ్లు పెండింగ్‌లో ఉండేవని, కానీ ఇప్పుడు దరఖాస్తులు వచ్చిన వెంటనే పరిష్కరించి తక్షణ సహాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే రాముకు కృతజ్ఞతలు తెలిపారు. చెక్కులు పంపిణీ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కిడ్నాపర్లు, రౌడీలకే జగన్ వత్తాసు

**●పొగాకు వ్యాపారి అపహరణపై ప్రజలకు ఏం చెబుతావు ?**

**●గతంలో బాబాయి హత్యనూ పక్కదోవ పట్టించేయత్నం**

**●గొడ్డలి పార్టీ తీరును ప్రజలు ఛీకొడుతున్నారు**

**●ఇంటింటికీ ప్రచారంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



గుంటూరు (చైతన్యరథం): 'ఒక వైపు పొగాకు వ్యాపారం పేరుతో కిడ్నాప్‌లకు పాల్పడుతున్న రౌడీలను వెనకేసుకొచ్చే జగన్.. ఇప్పుడు పొగాకు రైతుల పరామర్శలకు వెళ్లడం దుర్మార్గం. గుంటూరులో మాజీ ఎమ్మెల్యే ముస్తఫా కుమారుడి అరాచకాలు కనిపించడం లేదా? సీదిరి అప్పలరాజు కుమారుడి దౌర్జన్యాలు తెలియడం లేదా? రాష్ట్రంలో గొడ్డలి పార్టీది అంతా నీచ సంస్కృతి. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌పై అంబటి తీరును ఖండిస్తున్నాం. పెమ్మసానిని విమర్శించే స్థాయి అంబటికి ఉందా? ఇలాంటి పార్టీని రాష్ట్రం నుంచి తరిమేయాలి' అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక 13వ వార్డు చౌత్రా సెంటర్ లో సంక్షేమ పాలన-ఇంటింటికీ ప్రచారంలో భాగంగా మన ఇంటికి-మన నసీర్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే నసీర్ ప్రతి ఇంటికీ వెళ్లి ఒక్కొక్కరి వద్ద సుమారు ఐదు నిమిషాలు కేటాయించారు. ప్రభుత్వం అందిస్తోన్న సేవలను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరులో మాజీ ఎమ్మెల్యే ముస్తఫా కుమారుడిని, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి వంటి దొంగల ముఠాను వెనకేసుకొస్తోన్న జగన్ పరామర్శల పేరిట పనికిమాలిన యాత్రలు చేస్తున్నారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ హయాంలో బోగాపురం ఎయిర్ పోర్టుకు స్థల సేకరణ, అనుమతులన్నీ పూర్తి చేస్తే జగన్ వచ్చి శంకుస్థాపన చేశారని తెలిపారు. కేవలం ఐదేళ్లలో 26 శాతం మాత్రమే పనులు చేసి 86 శాతం పూర్తి చేసినట్లు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. ఒకరు చేసిన పనులను తమ ఖాతాలో వేసుకోవాలనే ఆరాటం చూస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బాబాయి హత్యను నరకాసుర వధ పేరిట ప్రచారం చేసిన జగన్ .. ఇప్పుడు తమ పార్టీ నేతలను కూడా అలాగే ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కేవలం రెండేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాన స్థాయిలో ప్రజలకు అందించామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామని, గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కనీవినీ ఎరుగనిరీతిలో అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందించామని చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. రాష్ట్రంలో లక్షల కోట్ల పెట్టుబడులతో యువతకు మంచి భవిష్యత్తు అందించబోతున్నామని చెప్పారు. డీఎస్సీ అసత్య ఆరోపణలతో వైసీపీ యువతను పక్కదోవ పట్టిస్తోందని మండిపడ్డారు.

# రెండేళ్ల కూటమి పాలనలో ఇచ్చిన ప్రతీ మాట నెలబెట్టుకున్నాం

## నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెల్లడి



నెల్లూరు రూరల్ (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని 31 వ డివిజన్, రామకోటయ్య నగర్ లో రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం ఇంటింటి ప్రచార" కార్యక్రమంలో పాల్గొని రెండేళ్లలో చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో 31వ డివిజన్ అభివృద్ధికి 8కోట్ల 30లక్షల రూపాయలు నిధులు కేటాయించామన్నారు. రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం ఇంటింటి ప్రచార" కార్యక్రమంలో రెండేళ్ల ప్రభుత్వ పాలన పై స్థానిక ప్రజల నుంచి వారి అభిప్రాయాలను, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తాం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. పై కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బత్తల కృష్ణ, క్లస్టర్ ఇంచార్జ్ మన్నేపల్లి రఘు, కో క్లస్టర్ ఇంచార్జ్ పల్నాటి మస్తాన్ నాయుడు, డివిజన్ అధ్యక్షులు కూకాటి హరిబాబు యాదవ్ , తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని, కుప్పం నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, ప్రజా సమస్యలతో పాటు భూ ,సమస్యలను వినిపించగా, వాటిని ఓర్పుతో ఆలకించి సంబంధిత అధికారులతో చర్చించి సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టడం జరిగింది. ప్రజల సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని పేర్కొంటూ, ప్రతి విజ్ఞప్తిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వేగంగా పరిష్కరించేలా సూచించడం జరిగింది.

## సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట ( చైతన్యరథం): శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ పెళ్లకూరు మండలం అన కవోలు గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రాధాన్యత అని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొంటూ, ప్రతి వినతిని సత్వరమే పరిష్కరించేలా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

## ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



చిత్తూరు (చైతన్యరథం): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. శుక్రవారం చిత్తూరు ఎమ్మెల్యే వారి కార్యాలయం ప్రజా దర్బార్ లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కరించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, ఆర్టీఎస్ ద్వారా వినతుల పరిష్కారంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా, మండల స్థాయిలో వినతుల పరిష్కారానికి అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని వివరించారు. ప్రజలు తమ సమస్యలపై ఎప్పుడైనా ఎమ్మెల్యే కార్యాలయంలో వినతిపత్రం సమర్పించవచ్చని చెప్పారు. శుక్రవారం కార్యక్రమంలో మొత్తం 55 వినతులు అందాయి. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దార్లు కళ్యాణి, శ్రీనివాసులు, ఎంహెచ్వో డా.అనిల్ కుమార్, హౌసింగ్ డీఈ శ్రీధర్, మాజీ మేయర్ అముద, తెదేపా పరిశీలకులు కుమారి, నాయకులు సురేంద్ర కుమార్, సుబ్బానాయుడు, నరేష్ పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా గుసుల్ ఖానాల నిర్మాణం

## ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ వెల్లడి

నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు ఫతేఖాన్ పేటలోని కలాన్ మసీదులో దాత ఎస్టీటీ చాన్ బాషా సహకారంతో జనాజ గుసుల్ ఖానా నిర్మించారు. గుసుల్ ఖానాను ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, బాడుగ ఇళ్లల్లో ఉన్నవారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారికి ఉపయోగపడాలని జనాజ గుసుల్ ఖానా నిర్మించారని తెలిపారు. బడుగు ఇళ్లలో సౌకర్యం లేనటువంటి వారికి ఇక్కడ అంత్యక్రియలు నిర్వహిస్తారని తెలిపారు. నిర్మాణదాత ఎస్ బి టి చాన్ బాషా వారి కుటుంబ సభ్యులను ఆ దేవుడు చల్లగా చూడాలని అన్నారు. గతంలో తను మేయర్‌గా ఉన్నప్పుడు వైశ్య సామాజికవర్గంవారు వారి సామాజిక వర్గం వారికి కర్మకృతువులు చేసుకునేందుకు స్థలం కేటాయించమని అడిగారని, వారు ఎలా అయితే కట్టుకుంటారో ఇతర సామాజిక వర్గం వారు కూడా అలాగే కట్టించి ఇవ్వాలని అడిగితే ట్విన్ బిల్డింగ్ కట్టి మున్సిపల్ కార్పొరేషన్ కు రిజిస్టర్ చేశారని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అవసరం ఉన్న ప్రతి చోట వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో గుసుల్ ఖానాలు నిర్మిస్తామని తెలిపారు. అన్ని సామాజిక వర్గాల్లో దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నన్నే సాహెబ్, మైనుద్దీన్, కరిముల్లా, సమీ హుస్సేనీ, సలీం, సాబీర్ ఖాన్, హయత్ బాబా, రియాజ్, అన్వర్, రసూల్, పాషా మొహిద్దీన్, జాబీర్ తదితరులు పాల్గొన్నారు.




# రూ. 200 కోట్లతో కావలి అభివృద్ధి : ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి



కావలి (చైతన్యరథం): కావలి పట్టణ అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, రానున్న అభివృద్ధి పనులు, పార్టీ చేపట్టనున్న కార్యక్రమాలపై కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అధికారులు,పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కావలి పట్టణం 40వ వార్డులో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో త్వరలో భారీ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని, రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన ప్రతి ఒక్క పార్టీ కార్యకర్తకు, నాయకుడికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అదే ఉత్సాహంతో 'ఇంటింటికి ప్రచారం' కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ప్రతి కార్యకర్త ప్రజల మధ్య ఉండాలని, ప్రతి పేద కుటుంబం వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, "ప్రతి పేదవాడి సమస్యను తెలుసుకోండి... వారి సమస్యను తీర్చే బాధ్యత నాది" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కావలి నియోజకవర్గం అభివృద్ధి పథంలో వేగంగా దూసుకుపోతోందని ఆయన పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వందల కోట్ల రూపాయలతో పట్టణాభివృద్ధికి శ్రీకారం చుట్టామని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

# ప్రతి కుటుంబానికి సంక్షేమం, ప్రతి ప్రాంతం అభివృద్ధి

**చాపిరేవుల గ్రామంలో జరిగిన "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్ వెల్లడి**



నంద్యాల (చైతన్యరథం): నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో నిర్వహించిన "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంటింటకీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం తరఫున కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమం, ప్రతి ప్రాంతానికి అభివృద్ధి అనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడానికే ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో నంద్యాల నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొనివచ్చి అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల కష్టమే తెలుగుదేశం పార్టీకి బలమని పేర్కొంటూ, ప్రతి కార్యకర్త ప్రజలతో నిరంతరం మమేకమై ప్రభుత్వ విజయాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు , నంద్యాల మండల టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, చాపిరేవుల టిడిపి నాయకులు భూపాల్ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, బిజ్జం శేఖర్ రెడ్డి, పుల్లారెడ్డి, శేఖర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సంజీవ తదితరులు పాల్గొన్నారు



# ప్రజల మధ్యకు.. ప్రజల కోసం..!

**ప్రజలతో కలిసి 5వ రోజు విజయవంతంగా ఎమ్మెల్యే కోట్ల పర్యటన**

డోన్ (చైతన్యరథం): పట్టణంలోని 5వ వార్డు ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "2 ఏళ్ల నమ్మకం సంక్షేమం, అభివృద్ధిఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం 5వ రోజు విజయవంతంగా జరిగింది. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలితాలను వివరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచేలా కృషి చేస్తామని భరోసా కల్పించారు. ప్రజల నుంచి లభించిన ఆత్మీయ ఆదరణ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక నాయకులు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గోనెగండ్లలో ప్రజా సమస్యల పరిష్కారం

**పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర రెడ్డి**




ఎమ్మిగనూరు (చైతన్యరథం): 'ఒక్క నెల, ఒక నియోజకవర్గం, నాలుగు పర్యటనలు' కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు నియోజకవర్గం తొలి పర్యటన సందర్భంగా గోనెగండ్ల మండల కేంద్రంలోని బాషా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి భూమి సంబంధిత సమస్యలు, రెవెన్యూ అంశాలు, తాగునీటి సౌకర్యం, రహదారులు, విద్యుత్, పెన్షన్లు, సంక్షేమ పథకాలు, గృహాలు, వ్యవసాయం ఇతర శాఖలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులకు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన పాలన అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# ప్రజాహిత పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**నందికొట్కూరు శాసనసభ్యుడు గిత్త జయసూర్య పిలుపు**

నందికొట్కూరు (చైతన్యరథం): పట్టణంలోని 16వ వార్డులో కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ శ్రేణులతో కలిసి డోర్ టు డోర్ కార్యక్రమంలో నందికొట్కూరు శాసనసభ్యుడు గిత్త జయసూర్య పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు పట్టణంలో కూటమి నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ సంక్షేమం ప్రతి గ్రామానికి అభివృద్ధి : ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



కదిరి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా తలుపుల మండలం పులిగుండ్లపల్లి గ్రామంలో నిర్వహించిన డోర్ టు డోర్ కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలపై సమాన ప్రాధాన్యతతో ముందుకు సాగుతోందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశ్రామికాభివృద్ధి వంటి అన్ని రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల సాధికారత, రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, సామాజిక భద్రత కల్పించే పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. 'తల్లికి వందనం', అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, పెన్షన్ వ్యవస్థ బలోపేతం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు సాగునీటి సదుపాయాల మెరుగుదల, గ్రామీణ రహదారుల అభివృద్ధి, తాగునీటి సౌకర్యాల విస్తరణ వంటి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని చెప్పారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కృషి చేస్తోందని, దాని ద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి గారు, కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి మాధవినగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో (గ్రీవెన్స్ డే) ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## 'తానా-పాఠశాల' ఆధ్వర్యంలో వైభవంగా

# అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం

వర్జీనియా: అమెరికా రాజధాని ప్రాంత పరిధిలోని (వర్జీనియా రాష్ట్రం) ప్రవాస భారతీయులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో 'తానా-పాఠశాల' ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పిల్లల భవిష్యత్తు కోసం జీవితకాలం కృషి చేసి, వారిని ఉన్నత స్థాయికి చేర్చిన ప్రవాస భారతీయుల తల్లిదండ్రులే నిజమైన జీవిత కథానాయకులని నిర్వాహకులు కొనియాడారు. ఆర్నెల్ల విజిట్ వీసాపై ఇక్కడకు వచ్చినప్పటికీ తెలుగువారు స్నేహ బంధాన్ని నెలకొల్పి వినోదం, తీర్థయాత్రలు వంటి కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. 'స్నేహబంధం ఎంతో అమూల్యమైనది. పెద్దల స్నేహబంధం ఇలాగే కొనసాగాలి. వయసు మళ్లిన వేళ నలుగురు ఆప్తులు తోడుగా ఉండటమే మనకున్న నిజమైన ఆస్తి. ఈనాటి తరానికి తెలుగు భాషను నేర్పించడంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. తరాల అనుసంధానం మాతృభాషతోనే సాధ్యమవుతుంది. తెలుగు భాషా పరిరక్షణ మనందరి ప్రాథమిక బాధ్యత" అని పేర్కొన్నారు.

తానా-పాఠశాల చైర్మన్, కార్యక్రమ సమన్వయకర్త భాను మాగులూరి మాట్లాడుతూ..




**స్నేహ బంధం ఎంతో అమూల్యం**
**ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు**

**మాతృ భూమి, మాతృ భాష మన రెండు కళ్లు**
**'తానా-పాఠశాల' చైర్మన్, కార్యక్రమ సమన్వయకర్త భాను మాగులూరి**



"మాతృభూమి, మాతృభాష మన రెండు కళ్లు లాంటివి. వృత్తి, ఉపాధి, వ్యాపార రీత్యా ప్రపంచంలో ఏ దేశంలో నివసిస్తున్నప్పటికీ తెలుగువారందరినీ ఏకం చేసే ఉమ్మడి వేదిక మన మాతృభాష. నేటి తరం చిన్నారులకు తెలుగు భాషను నేర్పించడం ప్రతి ఇంటి బాధ్యత' అని తెలియజేశారు. భాషే బంధాలకు మూలం. తరాల అంతరాన్ని భాషతో పూరిద్దాం అని పేర్కొంటూ అందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

పలువురు పెద్దలు తమ జీవితాల్లో స్నేహితుల పాత్ర, కష్ట నష్టాల్లో స్నేహం విలువ, ఒకరినొకరు గౌరవిస్తూ జీవితకాలం అండగా నిలిచిన మిత్రులను, సందర్భాలను నెమరు వేసుకున్నారు. అందరూ తమ జీవిత స్నేహ అనుభవాలను పంచుకున్నారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో సీతారామారావు ఎండూరు, శ్రావ్య చామర్తి, శ్రీకాకుల రామసత్యనారాయణ, వల్లభనేని వీరభద్రరావు, చంద్రనాథ్ నంబూరు, కందుల అభిరామ్, శంకర్రావు పొన్నం, పూర్ణచంద్రరావు అన్నం, కరణం రాజా, అంకమ్మరావు కట్ల, రాధాకృష్ణ మైనేని, సుబ్బారెడ్డి జొన్నల, ఐతా భిక్షపతి, సూరేపల్లి బ్రహ్మం, మేకల రామిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సీహెచ్ సత్యనారాయణ, ఆళ్ళ హరిబాబు, చిట్టెల సుబ్బారావు, రామకృష్ణ రెడ్డి, గణపతిరెడ్డి గుడిపాటి, జంపాల కృష్ణమోహన్, డాక్టర్ అల్లం లింగం, సురేష్ లగిశెట్టి, యోగానంద్ వంకిన, గంగారావు పొనగోటి, సుదర్శన్ అమరవాది, భాస్కరరావు చీటి, సత్తయ్య మారిశెట్టి, గుడిపాటి గణేష్ రెడ్డి, చెరుకూరి ఇందుశేఖర్, షేక్ నూరి, పులిపాటి రాజేంద్రప్రసాద్, చింతా రాంబాబు, ప్రభు, పి.నర్సింగరావు, శ్రీనివాస్ చెరుకుతోట, వెంకటేశ్వరరావు, చెరుగుప్పం, యాదగిరి గుండా తదితరులు పాల్గొన్నారు.



# న్యూయార్క్‌లో బోనాల మహోత్సవం



**న్యూయార్క్:** న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం (NYTTA) ఆధ్వర్యంలో ఆషాఢమాస బోనాల మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విదేశీ గడ్డపై సజీవంగా ప్రతిబింబించేలా స్థానిక ఐసెన్ హటరీవర్ పార్క్‌లో నిర్వహించిన వేడుకలు ప్రవాస తెలుగు కుటుంబాలను విశేషంగా ఆకట్టుకున్నాయి.



అతిథులుగా హాజరైన లాంగ్ ఐలాండ్ డిప్యూటీ డైరెక్టర్ మెంగ్ లీ, లెజిస్లేటర్ రోజ్ మేరీ వాకర్, టౌన్ క్లర్క్ రాగిని శ్రీవాస్తవ మాట్లాడుతూ బోనాల పండగ చాలా ఉత్సాహభరితంగా ఉందని మెచ్చుకున్నారు. నైటా అధ్యక్షుడు రవీందర్ కోడెల అధ్యక్షత వహించగా కార్యవర్గమంతా ఉత్సాహంగా ఏర్పాట్లు చేసి విజయవంతం చేశారు. తెలంగాణ జానపద కళా వైభవాన్ని ప్రతిబింబించేలా ప్రముఖ కళాకారులు, కవులు తమ అద్భుత ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. ప్రముఖ గాయకుడు రసమయి బాలకిషన్, సినీ గేయ రచయిత కాసర్ల శ్యామ్, జానపద కళాకారుడు నల్లగొండ గద్దర్, గాయకుడు సురేందర్, ప్రముఖ ఫోక్ సింగర్ సంధ్య ప్రత్యేకంగా హాజరై తమ పాటలు, ప్రదర్శనలతో తెలంగాణ సంస్కృతిని ఆవిష్కరించారు. పద్మ కోడెల ఏర్పాటుచేసిన అమ్మవారి అలంకరణ, డెకొరేషన్, మహంకాళి గుడి, బోనాల తయారీ, చూపరులను మంత్రముగ్ధం చేశాయి. పోతురాజు వేషధారణలో అశోక్ చింతకుంట చేసిన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేడుకల్లో డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి దంపతులు, నైటా కార్యవర్గ సభ్యులు, బోర్డు ఆఫ్ డైరెక్టర్లు, వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన తెలుగు ఎన్ఆర్ఐ కుటుంబ సభ్యులు బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు.

ఈ సందర్భంగా నైటా అధ్యక్షుడు రవీందర్ కోడెల మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేయడంతో పాటు విదేశాల్లో నివసిస్తున్న తెలుగు వారికి తమ మూలాలను గుర్తు చేసే వేదికగా తమ సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. అమెరికా నేలపై తెలంగాణ ఆత్మను ప్రతిబింబించిన బోనాల సంబరాలు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ చిరస్మరణీయ అనుభూతి మిగిల్చాయి.





# అమెరికలు

- **'3వీ యంగ్ సైంటిస్ట్' రేసులో భారత సంతతి విద్యార్థులు**
- **టాప్-10 ఫైనలిస్టుల్లో ఐదుగురు మనవాళ్లే**

**యూఎస్ఏ:** అమెరికాలో ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే '3వీ యువ శాస్త్రవేత్తల ఛాలెంజ్' (3M Young Scientist Challenge)లో భారత సంతతి విద్యార్థులు సత్తా చాటుతున్నారు. ఈ ఏడాది ఫైనల్స్‌కు ఎంపికైన పది మంది ప్రతిభావంతుల్లో ఐదుగురు మనవారే ఉండటం విశేషం. ఆరోగ్య రంగం, వాతావరణ మార్పులు, రోడ్డు భద్రత, నీటి పొదుపు, కరువు, ఆహార భద్రత వంటి కీలక అంశాల్లో నూతన ఆవిష్కరణలను ఈ పోటీకి పరిగణలోకి తీసుకుంటారు. ఈ పోటీల ఆఖరి ఘట్టం అక్టోబరులో జరగనుండగా.. విజేతగా నిలిచిన విద్యార్థికి 25వేల డాలర్ల (సుమారు రూ.20 లక్షలకు పైగా) బహుమతితో పాటు 'అమెరికా టాప్ యంగ్ సైంటిస్ట్' టైటిల్ అందజేస్తారు.

ఆవిష్కరణలతో మెరిసిన ఐదుగురు బాల మేధావులు వీరే:

**ఆరిక కుందు (మిన్నెసోటా):** పండ్లు, కూరగాయల నుంచి క్రిమిసంహారకాల రసాయన అవశేషాలను తొలగించడానికి వేరుశెనగ పొట్టును ఉపయోగించి 'లిగ్‌నెక్స్' అనే వినూత్న విధానాన్ని కనిపెట్టింది.

**శార్వీ మహాజన్ (శాండియాగో):** వాహనదారుల అలసటను రియల్ టైమ్‌లో అంచనా వేసి హెచ్చరించేందుకు ఈఈజీ (EEG) ఆధారిత మెషిన్ లెర్నింగ్ వ్యవస్థ 'న్యూరో డ్రైవ్ అలర్ట్స్'ను రూపొందించింది.

**రాజ్ దోషి (ఫార్మింగ్టన్):** కార్బన్ డై ఆక్సైడ్ కారణంగా సముద్రాల్లో పెరిగే ఆమ్లీకరణను తగ్గించేందుకు 'ఆల్గే-అరాగోనైట్ ఆల్కలినిటీ' వ్యవస్థను తయారు చేసింది.

**నబోశ్రీ సంత్ర: (ఒవీడో):** సాగు భూములు త్వరగా ఎండిపోకుండా, తేమ తగ్గకుండా కాపాడే బయోడిగ్రేడబుల్ మట్టి బంతులను (సోయిల్ షేడ్ బాల్స్) ఆవిష్కరించింది.

**ఆయేషా ఆసిఫ్ (శారాసోటా):** సముద్ర శాస్త్రంలోని అనువర్తనాలను ఉపయోగించుకుని మస్సెల్స్ సామర్థ్యాన్ని గుర్తించే 'మస్సెల్స్ కండరాల శక్తి' అనే ప్రత్యేక ప్రాజెక్టును తయారు చేసింది.

# వచ్చే నెలల్లో లోటు వర్షపాతమే

## భారత వాతావరణ శాఖ అంచనా



దేశంలో జూలై నెలలో దాదాపు సాధారణ స్థాయిలో వర్షపాతం నమోదు కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఎల్‌నినో కారణంగా జూన్‌లో ముఖం చాటేసిన వానలు అనూహ్యంగా జులైలో పుంజుకున్నాయి. అయితే, వచ్చే నెలలో మాత్రం లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెల సగటు వర్షపాతం (లాంగ్ పీరియడ్ యావరేజ్) 254.9 మిల్లీమీటర్లు. అయితే, ఇందులో 94 శాతం వరకూ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. సెప్టెంబర్ నెలలో కూడా దాదాపు ఇవే పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని నిపుణుల అంచనా. ఫలితంగా ఈ సీజన్ ద్వితీయార్థంలో దీర్ఘకాలిక సగటుకు 94 శాతం లోపే వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎమ్ఎఫ్ అంచనా వేసింది. జాతీయ స్థాయిలో వర్షాభావం కనిపించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మాత్రం వర్షాలు సాధారణ స్థాయిలో ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు, మధ్య భారత దేశం, ఈశాన్య రాష్ట్రాల్లో వర్షపాతం సాధారణ స్థాయి వరకూ ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ భావిస్తోంది.

### మరింతగా బలపడనున్న ఎల్‌నినో..

ఇక రుతుపవనాలపై ప్రతికూల ప్రభావం చూపే ఎల్‌నినో తీవ్రత ఆగస్టులో ఓ మోస్తరు స్థాయిలోనే ఉండనుంది. సెప్టెంబర్‌లో మాత్రం మరింతగా బలపడి, వచ్చే ఏడాది ప్రారంభం వరకూ ఎల్‌నినో కొనసాగుతుందని అంతర్జాతీయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే, హిందూమహాసముద్రంలో రుతుపవనాల అనుకూల పరిస్థితి ( పాజిటివ్ ఇండియన్ ఓషియన్ డైపోల్) ఏర్పడే అవకాశం ఉందని కూడా అంచనాలు ఉన్నాయి. భారత వాతావరణ శాఖ మాత్రం హిందూ మహాసముద్రంలో పరిస్థితులు తటస్థంగా ఉండొచ్చని భావిస్తోంది. రాబోయే నెలల్లో పరిస్థితిని బట్టి రుతుపవనాలపై క్లారిటీ వస్తుందని నిపుణులు చెబుతున్నారు.



# పీవోకేలో పాకిస్థాన్ మారణకాండ

## తీవ్రస్థాయిలో స్పందించిన భారత్

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో పాకిస్థాన్ ఆర్మీ దాడులపై భారత్ తీవ్ర స్థాయిలో స్పందించింది. పౌరులపై పాకిస్థాన్ అరాచకాలను భారత్ ఖండించింది. పీఓకేలో దాడులను అంతర్జాతీయ సమాజం పరిశీలించాలని విజ్ఞప్తి చేసింది. పాకిస్థాన్‌ను జవాబుదారీగా చేయాలని భారత్ పిలుపునిచ్చింది.

### పీఓకేలో మారణకాండ..

స్థానిక మానవ హక్కుల సంఘాలు, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ తెలిపిన వివరాల మేరకు.. జులై 27, 28 తేదీల్లో రావల్‌కోట్, మీర్‌పూర్, కోట్లి, ముజఫరాబాద్ సహా పలు ప్రాంతాల్లో ప్రజలు శాంతియుతంగా లాంగ్ మార్చ్ నిర్వహిస్తుండగా పాక్ ఆర్మీ విచక్షణారహితంగా కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో 40 మందికి పైగా నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. 400 మందికి పైగా గాయపడ్డారు. పాక్ ఆర్మీ వందలాది మందిని అక్రమంగా అరెస్ట్ చేసి జైళ్లకు తరలించింది. పాక్ సైన్యం తమ అరాచకాలను దాచడానికి స్థానిక ఆసుపత్రులు, వీధుల నుంచి అమాయక పౌరుల మృతదేహాలను బలవంతంగా ఎత్తుకెళ్లి మాయం చేస్తోందని జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ నేతలు ఆరోపిస్తున్నారు.

# జాతీయ సంక్షేమ పథకాలకు రూ. 4.5 లక్షల కోట్ల కేటాయింపు

## కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి




కేంద్ర కేబినెట్ శుక్రవారం రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ వివరాలను మంత్రి అశ్విని వైష్ణవ్ తాజాగా వెల్లడించారు. మొత్తం 4,50,988 కోట్ల రూపాయల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. ఇప్పటికే తలసరి సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో భారత్ మొదటి స్థానంలో ఉందని మంత్రి అన్నారు. ఈ పథకం కింద డ్యామ్‌లు, సరస్సులపై ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి 5000 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని అన్నారు. రాబోయే ఐదేళ్లల్లో ఫ్లోటింగ్ సోలార్ ప్యాసెల్ విద్యుత్ ఉత్పత్తిని 7 రెట్లు పెంచుతామని చెప్పారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు కేటాయించినట్టు మంత్రి తెలిపారు. 2026-2030 మధ్య కాలానికి ఈ మొత్తాన్ని కేటాయించినట్టు తెలిపారు. ఇక సముద్ర మంథన్ పథకానికి 84,084 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించింది. 2030-31 వరకూ ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. సముద్రం అడుగున దాగున్న ముడిచమురు, సహజవాయువు వనరుల గుర్తింపు కోసం కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఖేలో ఇండియా పథకానికి సంబంధించి కేంద్రం రాబోయే ఐదేళ్ల కాలానికి రూ.29,054 కోట్లు కేటాయించిందని కూడా మంత్రి తెలిపారు. యూనీ డైరెక్షనల్ ట్విన్ ట్యూబ్ టన్నుల్స్ నిర్మాణానికి 9,779 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు.

# అయోధ్య రాముని విరాళాలపై కఠిన నిఘా

అయోధ్య రాముని విరాళాలపై కఠిన నిఘా ఉంచాలని శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు నిర్ణయం తీసుకుంది. విరాళాల సేకరణ, లెక్కింపు ప్రక్రియ మొత్తాన్ని 360 డిగ్రీల కెమెరాలతో వీడియో రికార్డింగ్ చేయాలని ఈ ట్రస్ట్ ఆదేశించింది. రామమందిరంలో విరాళాల సేకరణ, లెక్కింపుపై కట్టుదిట్టమైన భద్రత నిఘా ఏర్పాటు చేయాలని హుకుం జారీ చేసింది. హుండీల నిర్వహణలో జులై 25వ తేదీ నుంచే అమల్లోకి కొత్త భద్రతా నిబంధనలు వచ్చాయని స్పష్టం చేసింది. లెక్కింపు గది నుంచి ఖాళీ పెట్టెలు తీసుకెళ్లడం, విరాళాలు సేకరించడం, సీల్ వేసి రవాణా చేయడం వరకు అంతా కెమెరాల నిఘాలోనే ఉంచాలని శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు ఆదేశించింది. నిరంతర వీడియో రికార్డింగ్ కోసం ఇద్దరు ప్రొఫెషనల్ వీడియోగ్రాఫర్లను నియమిస్తున్నట్లు తెలిపింది. బ్యాంక్ ఉద్యోగులు, ట్రస్ట్ ప్రతినిధులు, ప్రైవేట్ సెక్యూరిటీతో ఎనిమిది మంది సభ్యుల మానిటరింగ్ టీమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.

## ఇంటెలిజెన్స్ బ్యూరో ఆఫీసర్ హత్య కేసులో

# ఆప్ మాజీ నేతకు యావజ్జీవ కారాగార శిక్ష





ఇంటెలిజెన్స్ బ్యూరో ఆఫీసర్ అంకిత్ శర్మ హత్య కేసులో ఆప్ మాజీ నేత తాహిర్ హుస్సేన్‌కు ఢిల్లీ కోర్టు యావజ్జీవ కారాగార శిక్షను విధించింది. 2020 నాటి ఢిల్లీ అల్లర్లలో అంకిత్ శర్మ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసు అత్యంత అరుదైనదని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అత్యంత క్రూరంగా ఈ హత్య జరిగిందని పేర్కొంది. తాహిర్‌తో పాటు ఈ కేసులో మిగిలిన నలుగురు నిందితులకు యావజ్జీవ శిక్ష విధించింది. హత్య తరువాత కూడా మృతుడిపై ద్వేషం తగ్గలేదని నేరం తీరు చూస్తుంటే అనిపిస్తోందని న్యాయస్థానం చెప్పింది. మృతదేహాన్ని ఈడ్చుకుంట తీసుకెళ్లి నాలాలో పడేశారని కోర్టు పేర్కొంది. అయితే, మూకదాడిలో భాగంగా ఈ హత్య జరగడం, ఘటన సమయంలో ప్రచారంలో ఉన్న తప్పుడు సమాచారం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ శిక్ష ఖరారు చేసినట్టు కోర్టు పేర్కొంది. నాటి అల్లర్లల్లో కొందరు అంకిత్ శర్మపై కత్తులు, రాడ్లు, రాళ్లతో దాడి చేసి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని నాలాలో పడేశారు. మరుసటి రోజు ఉదయం మృతదేహం లభించింది. శరీరంపై 54 కత్తి పోట్లు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ దాడిలో తాహిర్ కూడా ఉన్నట్టు దర్యాప్తులో తేలింది. కోర్టు తీర్పుపై తాహిర్ లాయర్ స్పందిస్తూ హైకోర్టులో అప్పీలు చేసుకుంటామని అన్నారు. తనకు న్యాయం కొంత ఆలస్యంగానైనా దక్కుతుందన్న నమ్మకం ఉందని తాహిర్ తెలిపాడు. ఢిల్లీ న్యాయశాఖ మంత్రి కపిల్ మిశ్రా కూడా ఈ తీర్పుపై స్పందిస్తూ తాహిర్‌కు యావజ్జీవం ఖరారు కావడంతో న్యాయం దక్కే దిశగా తొలి అడుగు పడిందని అన్నారు. అంకిత్ హత్య జరిగిన తీరు చూస్తే నిందితులకు మరణ శిక్షే తగినదని అభిప్రాయపడ్డారు. తాహిర్‌కు హైకోర్టులో మరణ శిక్ష పడుతుందని ఆశిస్తున్నట్టు తెలిపారు.



## వరద నీటిలో కొట్టుకుపోయిన కారు

# తల్లీ కూతుళ్ల దుర్మరణం

మహారాష్ట్రలో పెను విషాదం చోటుచేసుకుంది. వరద నీటిలో కారు కొట్టుకుపోయిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు చనిపోయారు. తల్లీకూతుళ్లు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం యవాత్మాల్ జిల్లాకు చెందిన అవినాష్ ఖందారే ఫ్యామిలీ కారులో అహిల్యానగర్‌లోని 'లోని' ప్రాంతానికి బయలుదేరింది. భారీ వర్షాల కారణంగా ధార్మా ఏరియాలో కుప్తీ నది పోటెత్తడంతో.. వరద నీరు అక్కడి ఓ బ్రిడ్జిపైకి వచ్చేసింది. కారు నడుపుతున్న అవినాష్ ఆ వరద నీటిని తక్కువ అంచనా వేశాడు. కారును బ్రిడ్జి మీదకు పోనిచ్చాడు. కారు వరద నీటిలో కొట్టుకుపోయింది. ఆ సమయంలో కారులో అవినాష్‌తో పాటు అతడి భార్య మాధవి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అందరూ నీటిలో కొట్టుకుపోయారు. అవినాష్ కారు నుంచి బయటపడి ఓ చెట్టును పట్టుకుని ప్రాణాలు రక్షించుకున్నాడు. మిగిలిన ముగ్గురు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్స్ రంగంలోకి దిగాయి. నీటిలో కొట్టుకుపోయిన వారి కోసం రెస్క్యూ ఆపరేషన్స్ మొదలెట్టాయి. రెస్క్యూ సిబ్బంది శుక్రవారం యవాత్మాల్ జిల్లాలో తల్లీకూతుళ్ల మృతదేహాలను గుర్తించారు.



# సంక్షోభంలో స్పెయిన్

ఉత్తర ఆఫ్రికా తీరంలో ఉన్న స్పెయిన్ భూభాగం సెయుటా సరిహద్దు వద్ద తీవ్ర సంక్షోభం నెలకొంది. మొరాకో భూభాగం నుంచి వేలాది మంది వలసదారులు ఒకేసారి సరిహద్దులు దాటి స్పెయిన్ పరిధిలోకి చొచ్చుకెళ్లడానికి ప్రయత్నించడంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. ఈ తొక్కిసలాట, సముద్రం దాటే క్రమంలో 9 మంది మరణించినట్లు స్పెయిన్ అధికారులు ధ్రువీకరించారు. సరిహద్దులో పరిస్థితి పూర్తిగా అదుపుతప్పడంతో పరిస్థితుల్ని పునరుద్ధరించడానికి, భద్రతను కాపాడటానికి స్పెయిన్ ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించుతున్నట్లు ప్రకటించింది.

### నదిలా శరణార్థుల ప్రవాహం

స్థానిక సెయుటా సివిల్ గార్డ్ అధికారుల సమాచారం ప్రకారం సరిహద్దు వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయింది. 'పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. తీరం దాటుతున్న వారి కచ్చితమైన సంఖ్య చెప్పడం సాధ్యం కావడం లేదు, కానీ వేలాది మంది సరిహద్దులు దాటుతున్నారు' అని సివిల్ గార్డ్స్ అసోసియేషన్ అధిపతి రాచిడ్ స్బిహి ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాణాలను సైతం లెక్కచేయకుండా టరాజల్ బీచ్ ఒడ్డున ఉన్న సముద్ర మార్గం ద్వారా ఈత కొడుతూ, ఆపై సరిహద్దు ఫెన్సింగ్‌ను దాటుకుంటూ ప్రజలు స్పెయిన్ భూభాగంలోకి ప్రవేశించారు. ఇలా చొరబడ్డ వారిలో అత్యధికులు యువకులే అయినప్పటికీ, చిన్న పిల్లలతో కూడిన కుటుంబాలు కూడా ఉన్నారు. ఈ వలసల ఉధృతితో స్థానిక వసతి గృహాలు నిండిపోయాయి. వందలాది మంది వీధుల్లోనే నిద్రించాల్సిన పరిస్థితి ఏర్పడటంతో సెయుటా ప్రాంతీయ ప్రభుత్వ అధిపతి జువాన్ జెసస్ వివాస్ జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అయితే, వలసల సమస్య జాతీయ భద్రతా చట్టాల కింద నేరుగా అత్యవసర పరిస్థితి కిందికి రాదని స్పెయిన్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేస్తూనే, పరిస్థితిని సమీక్షించేందుకు స్పెయిన్ ప్రధాన మంత్రి పెడ్రో శాంచెజ్, అంతర్గత వ్యవహారాల మంత్రి ఫెర్నాండో గ్రాండే మార్లాస్కాతో కలిసి సెయుటాను సందర్శించనున్నట్లు వెల్లడించారు.

### ఇటలీ హెచ్చరికలు

స్పెయిన్ మొరాకో సరిహద్దు సంక్షోభం ఐరోపా వ్యాప్తంగా వేడి పుట్టించింది. తమ సరిహద్దులను రక్షించుకోవడానికి స్పెయిన్‌తో ఉన్న ఓపెన్, బోర్డర్ 'షెంగన్' (రాఎష్ట్రవఅస్త్రవఅ) ఒప్పందాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తామని ఇటలీ ప్రధాని జార్జియా మలోని హెచ్చరించారు. సముద్రం ద్వారా అక్రమంగా ప్రవేశించే వలసదారులను ఎలాంటి విచారణ లేకుండా తక్షణమే తిప్పి పంపకూడదని స్పెయిన్ సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు కూడా ఈ అకస్మాత్తు జన ప్రవాహానికి ఒక కారణమై ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

ప్రస్తుతం మొరాకో పోలీసులు సరిహద్దుల్లో అనేక మందిని అడ్డుకోవడంలో స్పెయిన్‌కు సహకరిస్తున్నారని, అక్రమంగా ప్రవేశించిన వారిని తిరిగి మొరాకోకు పంపడానికి రెండు దేశాలు అంగీకరించాయని స్పెయిన్ తెలిపింది.

### సెయుటా ప్రత్యేకత

ఆఫ్రికా ఖండంలోని ఉత్తర భాగంలో ఉన్న సెయుటా 1580 నుంచి స్పెయిన్ ఆధీనంలో ఉన్న ఒక చిన్న భూభాగం. ఆఫ్రికా దేశాల నుంచి ఐరోపాకు వెళ్లి మెరుగైన భవిష్యత్తును వెతుక్కోవాలనుకునే అనేక మంది పేద వలసదారులకు సెయుటా ఒక ప్రధాన ద్వారంగా మారింది. 2021 మే నెలలో కూడా ఇలాగే దౌత్యపరమైన ఉద్రిక్తతల నడుమ రెండు రోజుల్లో 8,000 మందికి పైగా వలసదారులు సెయుటాలోకి చొచ్చుకువచ్చారు.

# యూకే కేబినెట్‌లో భారత సంతతి వ్యక్తులు



యూకే ప్రధాని ఆండీ బర్న్‌హామ్ తాజాగా నూతన మంత్రివర్గాన్ని ప్రకటించారు. ఈసారి కేబినెట్‌లో భారత సంతతి వ్యక్తులకు కీలక బాధ్యతలు అప్పగించారు. భారత సంతతికి చెందిన కనిష్క నారాయణ్‌కు కేబినెట్ మంత్రిగా అవకాశం దక్కింది. ఆయనకు ప్రభుత్వం ఏఐ శాఖ బాధ్యతలను కేటాయించింది. కీర్ స్టార్మర్ మంత్రివర్గంలో సాంస్కృతిక శాఖ బాధ్యతలు నిర్వహించిన లీసా నాండీని ప్రధాని బర్న్‌హామ్ కేబినెట్‌లోకి తీసుకున్నారు. మునుపటి శాఖనే ఆమెకు కేటాయించారు. మహిళ శిశు సంరక్షణ, భద్రత సమానత్వం వ్యవహారాల బాధ్యతలు మరో భారత సంతతి నేత సత్వీర్ కౌర్‌కు దక్కాయి. ఇక హర్‌ప్రీత్ ఉప్పల్‌ను అసిస్టెంట్ గవర్నమెంట్ విప్‌గా ప్రధాని నియమించారు. బిహార్‌లోని ముజఫర్‌పూర్‌కు చెందిన కనిష్క నారాయణ్ 12 ఏళ్ల వయసులో కుటుంబంతో కలిసి యూకేకు వెళ్లారు. ఈటన్ కాలేజ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, స్టాన్‌ఫోర్డు యూనివర్సిటీల్లో చదువుకున్నారు. 2024లో లేబర్ పార్టీ తరఫున ఎంపీగా ఎన్నికయ్యారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్‌లో అండర్‌సెక్రటరీగా సేవలందించారు. ఈ ఏడాది ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ఏఐ శాఖ బాధ్యతల ఆయనకు దక్కాయి. వాణిజ్యం, సైన్స్ అండ్ ట్రేడ్ శాఖ బాధ్యతలు కూడా ఆయనకే దక్కాయి. పంజాబ్‌కు చెందిన సత్వీర్ కౌర్ 2024లో తొలిసారిగా ఎంపీగా ఎన్నికయ్యారు. ఆమె తల్లిదండ్రులు సౌతాంప్టన్‌లో ఒక వస్త్ర దుకాణాన్ని నిర్వహిస్తుంటారు. సత్వీర్ కౌర్ గతంలో కేబినెట్‌లో పార్లమెంట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించారు. ఆ తరువాత కొంతకాలం మాతృత్వ సెలవులపై వెళ్లిన ఆమె ఇటీవలే మళ్లీ తన విధుల్లో నిమగ్నమయ్యారు. హడ్డర్స్‌ఫీల్డ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హర్‌ప్రీత్ 2024లో ఎంపీగా ఎన్నికయ్యారు. ప్రభుత్వం హర్‌ప్రీత్‌కు అసిస్టెంట్ విప్ బాధ్యతలు అప్పగించింది. పార్లమెంటులో పార్టీ ఎంపీల కార్యకలాపాలను ఆమె పర్యవేక్షించనున్నారు.

# 14 దేశాలతో సౌదీ అరేబియా భారీ నావికాదళ కూటమి

ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే వ్యాపార సముద్ర మార్గాలలో నౌకల రక్షణే లక్ష్యంగా సౌదీ అరేబియా ఒక కీలకమైన రక్షణ కూటమిని ప్రకటించింది. బాబ్ అల్ మందేబ్ జలసంధి, ఎర్రసముద్రం, ఆడెన్ సింధుశాఖ వంటి వ్యూహాత్మక జలమార్గాలలో వాణిజ్య నౌకల ప్రయాణాన్ని సురక్షితం చేయడానికి సౌదీ అరేబియాతో పాటు మరో 13 దేశాలు భాగస్వాములుగా చేరినట్లు సౌదీ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై నావికా దిగ్బంధం విధించేందుకు ప్రయత్నించడం, దాడుల వల్ల రవాణాకు తీవ్ర విఘాతం కలగడం వంటి పరిణామాల నేపథ్యంలో ఈ కూటమి ఏర్పాటు ప్రాధాన్యం సంతరించుకుంది. దీనికి తోడు హోర్ముజ్ జలసంధి వద్ద రవాణా నిలిచిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీని ప్రభావంతో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 90 డాలర్ల వైపు దూసుకెళు _న్నాయి.

### కూటమిలోని వ్యవస్థాపక సభ్య దేశాలు

ఈ డిఫెన్స్ అలయన్స్ ఏర్పాటులో సౌదీ అరేబియాతో పాటు భాగస్వాములైన మిగతా 13 దేశాలుగా కువైట్, బహ్రెయిన్, ఖతార్, పాకిస్థాన్, టర్కీ, ఈజిప్ట్, జోర్డాన్, యెమెన్, బంగ్లాదేశ్, నైజీరియా, సూడాన్, జిబౌటీ, సోమాలియా ఉన్నాయి. రియాద్‌లో నిర్వహించిన ఓ సైనిక సదస్సులో ఈ ఒప్పందానికి తుది రూపం ఇచ్చారు. ఈ సమావేశంలో 43 దేశాల సైనిక అధిపతులు, ప్రతినిధులతో పాటు యూరోపియన్ యూనియన్ ప్రతినిధులు కూడా ప్రత్యక్షంగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కూడా పాల్గొన్నారు.







# ఉజైర్ బలోచ్ సోదరుడిపై కాల్పులు

పాకిస్థాన్‌లోని కరాచీలో గ్యాంగ్‌స్టర్, నిషేధిత పీపుల్స్ అమన్ కమిటీ మాజీ చీఫ్ ఉజైర్ బలోచ్ సోదరుడు జుబైర్ బలోచ్‌పై కాల్పులు జరిగాయి. గురువారం సాయంత్రం జుబైర్ తన ఇంటి బయట ఉన్న సమయంలో మోటార్‌సైకిల్‌పై వచ్చిన దుండగులు అతడిపై కాల్పులకు తెగబడినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఘటనలో జుబైర్ ఛాతి, పొత్తికడుపులో బుల్లెట్లు దిగాయి. తీవ్రంగా గాయపడిన అతడిని కరాచీలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాల్పుల ఘటనలో మరో ఇద్దరు పాదచారులు కూడా గాయపడినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ పోలీసుల కథనం ప్రకారం.. ముఖాలకు ముసుగులు ధరించి వచ్చిన దుండగులు జుబైర్‌పై కాల్పులు జరిపారు. అయితే ఓ దుకాణదారుడు వారిపై ఎదురు కాల్పులు జరపడంతో నిందితులు పరారయ్యారు. ఘటన సమయంలో జుబైర్ తన ఇంటి బయట ఉన్నట్లు సీనియర్ పోలీసు అధికారి సయ్యద్ అసద్ రజా వెల్లడించారు. గ్యాంగ్ వార్, క్రిమినల్ యాక్టివిటీ నేపథ్యంలో జుబైర్ బలోచ్ 2012లో అరెస్టయ్యాడు. గత ఏడాది జనవరిలో జైలు నుంచి విడుదలయ్యాడు. పాత కక్షలు, గ్యాంగ్ వార్ నేపథ్యంలోనే జుబైర్‌పై కాల్పులు జరిగి ఉండొచ్చని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు. జుబైర్ బలోచ్ కొన్ని నెలల క్రితం ఓ రాజకీయ పార్టీలో

### 'ధురంధర్' సినిమాలో ఉజైర్ బలోచ్ పాత్ర..

ఉజైర్ బలోచ్.. ఏడాది ముందు వరకు ఈ పేరు మన దేశ ప్రజలకు పెద్దగా తెలియదు. కానీ, ధురంధర్ సినిమా తరువాత ఉజైర్ బలోచ్ ఎవరనేది అందరికీ తెలిసిపోయింది. 2026లో విడుదలైన భారత స్పై థ్రిల్లర్ మూవీ 'ధురంధర్'లో ఉజైర్ బలోచ్ పాత్రను నటుడు డానిష్ పాండోర్ పోషించారు. రెహమాన్ డకైత్ క్యారెక్టర్ తరువాత ఉజైర్ బలోచ్ క్యారెక్టర్ ధురంధర్ సినిమాలో హైలెట్ అయిన విషయం తెలిసిందే.

### కరాచీలో 'దురంధర్' సీన్ రిపీట్..

చేరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆ పార్టీ జెండాలను జుబైర్ తన ప్రాంతంలో ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో 'కరాచీ ఆపరేషన్' తర్వాత దుబాయ్, ఇరాన్‌కు పారిపోయిన కొందరు గ్యాంగ్‌స్టర్లు అమెరికా–ఇరాన్ యుద్ధం నేపథ్యంలో తిరిగి కరాచీకి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో లియారీ ప్రాంతంలో మళ్లీ గ్యాంగ్ వార్ చెలరేగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### జైల్లో ఉజైర్ బలోచ్..

ఇదిలా ఉండగా.. గ్యాంగ్‌స్టర్ ఉజైర్ బలోచ్‌పై పాకిస్థాన్‌లో చాలా కేసులు ఉన్నాయి. హత్యలు, పోలీసులపై కాల్పులు, పేలుడు పదార్థాల తయారీ, సరఫరా తదితర కేసుల్లో అతడు ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. 2012లో కలకోట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆయుధాలు, పేలుడు పదార్థాలతో భద్రతా సిబ్బందిపై దాడి చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ కేసుల్లో ఉజైర్ బలోచ్‌ను పాకిస్థాన్ పోలీసులు అరెస్ట్ చేశారు. గూఢచర్యం కేసులో 2020 ఏప్రిల్‌లో కోర్టు అతడిని దోషిగా తేల్చి 12 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అయితే, తనపై నమోదైన అన్ని కేసుల్లో బెయిల్ ఇవ్వాలంటూ ఉజైర్.. పాకిస్థాన్ యాంటీ టెర్రరిజం కోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్లను 2026 మార్చిలో కోర్టు తిరస్కరించింది. దీంతో ఉజైర్ జైల్లోనే శిక్ష అనుభవిస్తున్నాడు.

చైతన్యరథం

# తల్లి అయిన 11 నెలలకే..

# కామన్వెల్త్‌లో రికార్డు 'త్రో'

*- కాంస్య పతకంతో మెరిసిన సీమా కళిరామన్ -*




గ్లాస్గో: కామన్వెల్త్ గేమ్స్ మహిళల డిస్కస్ త్రో విభాగంలో భారత అథ్లెట్ సీమా కళిరామన్ కాంస్య పతకం సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారు. హోరాహోరీగా సాగిన పోటీలో ఆమె మూడో రౌండ్‌లో 58.65 మీటర్ల దూరం విసిరి మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఆ తర్వాత వరుసగా మూడు ప్రయత్నాలు ఫౌల్ అయినప్పటికీ ముందస్తు ప్రదర్శన ఆధారంగా కాంస్య పతకం ఆమెను వరించింది.

**ఇటు మాతృత్వం.. అటు క్రీడా రంగం**

హర్యానాకు చెందిన 27 ఏళ్ల సీమా ప్రయాణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. కేవలం అథ్లెట్‌గానే కాకుండా ఆమె ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఒకవైపు చదువు మరోవైపు క్రీడలను సమతుల్యం చేసుకుంటున్న సమయంలోనే ఆమె తల్లిగా కొత్త బాధ్యత స్వీకరించారు. ప్రసవం తర్వాత కేవలం 11 నెలల వ్యవధిలోనే తిరిగి డిస్కస్‌త్రో పోటీలకు సిద్ధమవడం విశేషం. ఆమెకు శిక్షకుడిగా (కోచ్‌గా) వ్యవహరించింది మరెవరో కాదు ఆమె భర్త రవీందర్. జాతీయ స్థాయిలో డిస్కస్ త్రో మాజీ అథ్లెట్ అయిన రవీందర్, భార్యకు తగిన శిక్షణనిచ్చి విజయంలో కీలక పాత్ర పోషించారు.

**కష్టాలను అధిగమించి సత్తా చాటిన ధీర**

ప్రసవానంతరం ఫిట్‌నెస్ సాధించడం సీమాకు ఎంతో సవాలుగా మారింది. ఆర్థరైటిస్ సమస్యతో తీవ్రంగా ఇబ్బంది పడి కొన్ని రోజుల పాటు చిన్నపాటి బరువులు ఎత్తడానికి కూడా శ్రమించాల్సి వచ్చింది. అయినప్పటికీ పట్టుదలతో తన స్ట్రెంత్, టెక్నిక్ పెంపొందించుకుని మళ్లీ గాడిలో పడింది. గతేడాది జాతీయ క్రీడల్లో స్వర్ణ పతకం సాధించి తన పునరాగమనాన్ని ఘనంగా చాటారు. ఆ నమ్మకంతోనే కామన్వెల్త్ గేమ్స్‌లోనూ భారత్‌కు కాంస్య పతకాన్ని అందించి సత్తాచాటారు.

# జెర్సీ రంగు మార్పుపై దుమారం

**వివరణ కోరిన హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ**



భారత పురుషులు, మహిళల హాకీ జట్ల జెర్సీ రంగును కాషాయ రంగులోకి మార్చడంపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌లు జరిగే సింథటిక్ పిచ్‌లు నీలి రంగులో ఉంటాయని... పాత జెర్సీ కూడా నీలి రంగులోనే ఉండటం వల్ల ఆటగాళ్లు కలిసిపోతున్నారనే ఉద్దేశంతోనే కాషాయ రంగును ఎంచుకున్నామని గతంలో హాకీ ఇండియా సమర్థించుకుంది. అయితే ఈ నిర్ణయం తీవ్ర రాజకీయ, మీడియా వివాదాలకు దారితీసింది. తాజాగా ఈ వ్యవహారంపై హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎగ్జిక్యూటివ్ బోర్డు ముందు చర్చించకుండానే జెర్సీ రంగు మార్చేశారని అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు ఈ-మెయిల్ పంపడం జాతీయ క్రీడా వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

అధికారులకు పంపిన సందేశంలో దిలీప్ టిర్కీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు. ఎగ్జిక్యూటివ్ బోర్డు ముందు ఎలాంటి చర్చ పెట్టకుండా, అధ్యక్షుడైన తనకు ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండానే అధికారులు ఈ నిర్ణయాన్ని అమలు పరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాషాయ రంగును ఎంచుకోవడంపై నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ ఇటువంటి కీలకమైన మార్పులు చేసే ముందు పాలకమండలి, కార్యనిర్వాహక మండలితో సమగ్రంగా చర్చించి ఉండాల్సింది" అని పేర్కొన్నారు. ప్రపంచ కప్, ఆసియా కప్ పోటీలు సమీపిస్తున్న తరుణంలో జట్టు సన్నాహాలపై దృష్టి పెట్టాల్సి ఉందని, అనవసర రాజకీయ విమర్శలకు తావివ్వకుండా జెర్సీ మార్పు కేవలం క్రీడాపరమైన నిర్ణయమని స్పష్టం చేశారు.

ప్రధాన స్పాన్సర్ ఒడిశా ప్రభుత్వం ఈ వివాదంపై స్పందిస్తూ... జెర్సీ రంగు మార్పుపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని అధ్యక్షుడిని కోరింది. దీంతో దిలీప్ టిర్కీ రంగంలోకి దిగి ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలు, ప్రాతిపదిక, అనుసరించిన విధానంపై పూర్తిస్థాయి లిఖితపూర్వక వివరణ సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వడానికే అధికారుల నుంచి నివేదిక కోరినట్టు ఆయన తెలిపారు.

## వెయిట్ లిఫ్టింగ్‌లో లవ్‌ప్రీత్ సింగ్‌కు రజతం



గ్లాస్గో: కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ఎనిమిది పతకాలతో విజయవంతంగా ముగించింది. పురుషుల 110+ కిలోల విభాగంలో భారత అథ్లెట్ లవ్‌ప్రీత్ సింగ్ రజత పతకం సాధించాడు. గ్లాస్గో వేదికగా జరిగిన ఈ పోటీల్లో భారత్ ఒక స్వర్ణం, ఆరు రజతాలు, ఒక కాంస్యాన్ని కైవసం చేసుకుంది. లవ్‌ప్రీత్ స్నాచ్‌లో 176 కిలోలు ఎత్తి కామన్వెల్త్ గేమ్స్ రికార్డును సమం చేశాడు. క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో 212 కిలోలు లిఫ్ట్ చేసి మొత్తంగా 388 కిలోలు ఎత్తాడు. అయితే న్యూజిలాండ్‌కు చెందిన డేవిడ్ ఆండ్రూ లిటి చివరి ప్రయత్నంలో 223 కిలోలు ఎత్తి మొత్తం 389 కిలోలతో స్వర్ణాన్ని కైవసం చేసుకున్నాడు. దీంతో లవ్‌ప్రీత్ ఒక్క కిలో తేడాతో రజతంతో సరిపెట్టుకున్నాడు. బర్మింగ్‌హామ్ 2022లో కాంస్యం సాధించిన అతడు ఈసారి రజతంతో తన ప్రదర్శనను మెరుగుపర్చుకున్నాడు.

**చాలా బాధగా అనిపిస్తోంది: లవ్‌ప్రీత్**

ఒక్క కిలో తేడాతో స్వర్ణం చేజారడం బాధ కలిగించిందని లవ్‌ప్రీత్ సింగ్ వెల్లడించాడు. 'స్వర్ణం చేజారడం సహజంగానే బాధ కలిగిస్తుంది. కానీ రానున్న ఆసియా క్రీడల్లో మరింత బలంగా తిరిగి వస్తాను. నా కోచ్ విజయ్ శర్మ, భారత వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్యకు చెందిన సహదేవ్ సింగ్, భారత ప్రభుత్వం, భారత నౌకాదళానికి చెందిన కెప్టెన్ విజయ్‌కుమార్ అందించిన ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఈ పతకాన్ని వారందరికీ అంకితం చేస్తున్నా' అని లవ్‌ప్రీత్ తెలిపాడు.

# బాక్సింగ్ ఫైనల్లో ప్రీతి

**జుడో క్వార్టర్స్‌కు ముగ్గురు భారతీయులు**



గ్లాస్గో: కామన్వెల్త్ క్రీడల్లో భారత క్రీడాకారుల జోరు కొనసాగుతోంది. బాక్సింగ్‌లో ఇప్పటికే పది మంది సెమీఫైనల్‌కు దూసుకెళ్లగా... వారిలో ప్రీతి పవార్ ఫైనల్లోకి అడుగుపెట్టింది. జుడోలో ముగ్గురు ముందంజ వేశారు. మహిళల విభాగంలో శ్రద్ధా కడుబాల్ చొపాడే, పురుషుల విభాగంలో హర్ష్ సింగ్, రోహిత్ బషీర్ క్వార్టర్ ఫైనల్‌కు చేరారు.

భారత బాక్సర్ ప్రీతి పవార్ ఫైనల్‌కు చేరింది. శుక్రవారం ఏకపక్షంగా జరిగిన సెమీస్‌లో 54 కేజీల విభాగం సెమీస్‌లో జాంబియాకు చెందిన జ్వాపేపై పంచ్‌ల వర్షం కురిపించిందీ యువ కెరటం. తొలి రౌండ్ నుంచే ప్రీతి ధాటికి ప్రత్యర్థి బెంబేలెత్తిపోయింది. రెండో రౌండ్‌లోనూ అదే దూకుడు కొనసాగించిన భారత అమ్మాయి 5-0తో గెలుపొంది దర్జాగా ఫైనల్లో అడుగుపెట్టింది. దాంతో ఆమెకు కనీసం రజతం ఖాయమైంది.

జుడోలో ఏకంగా ముగ్గురు భారతీయులు సత్తా చాటి క్వార్టర్ ఫైనల్‌కు చేరారు. పురుషుల విభాగంలో రోహిత్ బషీర్ పట్టుకు శామ్యూల్ రిబెరియో చేతులెత్తేశాడు. ఆర్మ్ లాక్‌తో ప్రత్యర్థి కథేవరాను పడగొట్టిన హర్ష్ సింగ్ క్వార్టర్స్ బెర్తు పట్టేశాడు. ఇక మహిళల విభాగంలో మెరిసిన శ్రద్ధా కడుబాల్ చొపాడే దూకుడు ముందు జనే మస్సాకోల్ నిలవలేకపోయింది.

## చీఫ్ సెలెక్టర్ రేసులో అశ్విన్!



వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ కంటే ముందు చీఫ్ సెలెక్టర్‌గా సేవలందిస్తున్న అజిత్ అగార్కర్ పదవీకాలం ముగియనుంది. సెప్టెంబరులో అగార్కర్ కాలపరిమితి పూర్తి కానున్నందున తదుపరి ప్రధాన సెలెక్టర్ ఎవరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆశావహులు చాలా మందే ఉన్నప్పటికీ మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ రేసులో అందరికంటే ముందున్నాడనే కథనాలు వస్తున్నాయి. బీసీసీఐ కూడా అగార్కర్ స్థానంలో మాజీ ఆఫ్ స్పిన్నరైన అశ్విన్‌కే బాధ్యతలు అప్పగించనుందనే వార్తలు నెట్టింట వైరలవుతున్నాయి.

సీనియర్లను పక్కన పెట్టేసి.. కుర్రాళ్లకు పెద్దపీట వేయడంతో పాటు స్క్వాడ్ ఎంపిక కూడా అస్సలు బాగుండడం లేదనే ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లండ్ గడ్డపై టీ20 సిరీస్ ఓటమితో హెడ్‌కోచ్ గౌతం గంభీర్, ప్రధాన సెలెక్టర్ అగార్కర్ పనితీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో పదవీకాలం ముగింపు దశలో ఉన్న అగార్కర్‌ను పొడిగిస్తారా? లేదా? అనేదానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా.. అప్పుడే అగార్కర్ వారసుడు ఎవరు? అనే చర్చ మొదలైంది.

## ఫిట్‌నెస్ పరీక్షలో బుమ్రా పాస్

**శ్రీలంక సిరీస్‌కు యార్కర్ కింగ్**




శ్రీలంక పర్యటనకు ముందే భారత జట్టుకు గుడ్‌న్యూస్. ఇంగ్లండ్ పర్యటనలో గాయపడిన ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి వచ్చేస్తున్నాడు. గాయం నుంచి కోలుకున్న ఈ యార్కర్ కింగ్ ఫిట్‌నెస్ పరీక్షలో పాసయ్యాడు. దాంతో త్వరలో లంకతో జరగబోయే రెండు టెస్టుల సిరీస్‌కు బుమ్రా అందుబాటులో ఉంటాడని విశ్వసనీయ వర్గాలు చెప్తున్నాయి. పొరుగుదేశమైన లంకకు శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా ఆగస్టులో వెళ్లనుంది. పని ఒత్తిడి కారణంగా తరచూ గాయపడుతున్న జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ టెస్టులో పాసయ్యాడు. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ సమయంలో గాయపడిన బుమ్రా.. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకున్నాడు. ఫిట్‌నెస్ పరీక్షలో పాసైన అతడు శ్రీలంక పర్యటనకు సిద్ధమవుతున్నాడని సమాచారం. దాంతో ఇప్పటికే స్క్వాడ్‌కి ఎంపికైన బుమ్రా సిరీస్‌లో ఆడడం దాదాపు ఖరారైన నేపథ్యంలో భారత జట్టుకు పేస్ బౌలింగ్ కష్టాలకు తెరపడనుంది.

# చైతన్య రథం సినిమా

శనివారం 1 ఆగస్టు 2026 X


### టాలీవుడ్‌లో హాట్ టాపిక్..

## మల్టీప్లెక్స్ బిజినెస్‌లోకి రామ్‌చరణ్, ఎన్టీఆర్

మల్టీప్లెక్స్ రంగంలోకి టాలీవుడ్ టాప్ హీరోలు రామ్‌చరణ్, జూనియర్ ఎన్టీఆర్ ఎంట్రీ ఇవ్వబోతున్నారంటూ ప్రస్తుతం ఫిలింనగర్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఇప్పటికే అగ్ర కథా నాయకులు మహేష్‌బాబు ఏఎంబీ సినిమాస్, అల్లు అర్జున్ ఏఏఏ సినిమాస్, విజయ్ దేవరకొండ ఏవీడీ సినిమాస్, రవితేజ ఏఆర్టీ సినిమాస్ పేర్లతో థియేటర్ల వ్యాపారంలో విజయవంతంగా రాణిస్తున్నారు. ఇప్పుడు వారిబాటలోనే ఈ ఇద్దరు మెగాహీరోలు కూడా అడుగుపెట్టాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే అగ్ర హీరోలతో మల్టీప్లెక్స్‌ల ఏర్పాటులో భాగస్వామ్యంగా ఉన్న ప్రముఖ డిస్ట్రిబ్యూషన్, ఎగ్జిబిషన్ సంస్థ ఏషియన్ సినిమాస్‌తోనే రామ్‌చరణ్ చేతులు కలిపినట్టు తెలుస్తోంది. హైదరాబాద్‌లో ఏఆర్సీ పేరుతో ఓఅత్యాధునిక హంగులతో కూడిన మల్టీప్లెక్స్ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.



మరోవైపు యంగ్ టైగర్ ఎన్టీఆర్ సైతం ఎవరి భాగస్వామ్యం లేకుండా సొంతంగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతంలో ఒక ప్రీమియం మల్టీప్లెక్స్ నిర్మించే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. దీనికి సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు జరుగుతున్నాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సోషల్ మీడియాలో జోరుగా వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలపై అటు రామ్‌చరణ్ కానీ, ఇటు ఎన్టీఆర్ టీమ్ కానీ అధికారికంగా స్పందించాల్సి ఉంది. ఒకవేళ ఈ రూమర్స్ నిజమైతే మాత్రం బాక్సాఫీస్ వద్దే కాకుండా థియేటర్ల వ్యాపారంలోనూ టాలీవుడ్ హీరోల మధ్య పోటీ మరింత రసవత్తరంగా మారడం ఖాయం.

## 'రియాలిటీ షో' లోకి శుభ్‌మన్ గిల్ సోదరి

### ఆగస్టు 13 నుంచి ప్రసారం



టీమిండియా స్టార్ క్రికెటర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సోదరి షహీన్ గిల్ గ్లామర్, రియాలిటీ వరల్డ్‌లోకి అడుగు పెట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రసిద్ధ ఓటీటీ వేదిక 'అమెజాన్ ప్రైమ్'లో త్వరలో ప్రారంభం కానున్న సంచలనాత్మక మైండ్ గేమ్ రియాలిటీ షో 'ద ట్రైటర్స్' సీజన్-2లో ఆమె కంటెస్టెంట్‌గా పాల్గొననున్నారు. బాలీవుడ్ ప్రముఖ నిర్మాత, దర్శకుడు కరణ్‌జోహార్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ షో రాబోయే ఈ నెల 13నుంచి ప్రసారం కానుంది. ఇప్పటికే విడుదలైన ప్రోమోలు, కంటెంట్ క్రియేటర్‌గా నెటిజన్లను ఆకట్టుకుంటున్న షహీన్ పరిచయం సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. ఈ షో లాంచ్ సందర్భంలో ఆమె చెప్పిన "మై నేమ్ ఈజ్ గిల్.. ఐ నో హౌ టు కిల్" అనే బోల్డ్ డైలాగ్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. గతంలో టీమిండియా క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ సోదరి శ్రేష్ఠ అయ్యర్ 'నెట్‌ఫ్లిక్స్'లో ప్రసారమైన 'లాక్ అప్' రెండో సీజన్‌లో అలరించగా ఇప్పుడు మరో క్రికెటర్ సోదరి రియాలిటీ వేదికపై సందడి చేయనుండటం విశేషం.

#### పోటీలో 21 మంది సెలబ్రిటీలు

మైండ్ గేమ్, ప్లానింగ్, సస్పెన్స్‌తో సాగే ఈ షో రెండో సీజన్లో దాదాపు 21 మంది ప్రముఖ కంటెస్టెంట్లు బరిలోకి దిగుతున్నారు. షహీన్ గిల్‌తో పాటు బాలీవుడ్ నటి మల్లికా షెరావత్, రియాలిటీ షో స్టార్ మునావర్ ఫరూఖీ, రియా చక్రవర్తి, క్రిస్టల్ డిసౌజా, పరుల్ గులాటీ, సీనియర్ నటుడు దలీప్ తాహిల్, హర్మాన్ సింఘా, తాన్యా పురిలతో పాటు సెలబ్రిటీ షెఫ్ రణ్‌వీర్ బ్రార్ తదితరులు జాబితాలో ఉన్నారు.

## 'సర్దార్ 2'... టీచర్ వచ్చేసింది




కోలీవుడ్ టాలెంటెడ్ హీరో కార్తీ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా సీక్వెల్ చిత్రం 'సర్దార్ 2'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో గ్లామరస్ బ్యూటీ మాళవిక మోహనన్ కథానాయకిగా నటిస్తుండగా ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్.లక్ష్మణ్ కుమార్ నిర్మిస్తున్నారు. తాజా అప్డేట్‌లో భాగంగా హీరో కార్తీ ఒక పవర్-ప్యాక్డ్ కొత్త పోస్టర్‌ను తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ అభిమానులకు అదిరిపోయే గుడ్ న్యూస్ చెప్పారు. 'సర్దార్ 2' సినిమా టీజర్‌ను విడుదల చేసినట్టు కన్ఫర్మ్ చేశారు. టాలెంటెడ్ నటుడు ఎస్‌జే సూర్య పవర్‌ఫుల్ విలన్ పాత్రలో నటిస్తుండటం సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతోంది. ఇక మొదటి భాగానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించిన సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ సామ్ సీఎస్ ఈసారి కూడా తన మ్యూజిక్‌తో అదరగొట్టడానికి సిద్ధమయ్యారు. అన్ని హంగులనూ పూర్తి చేసుకుని ఈ సినిమాను సెప్టెంబరు 12న ప్రపంచవ్యాప్తంగా అత్యంత గ్రాండ్‌గా పాన్ ఇండియా లెవెల్‌లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

### తొలి రోజే రూ.61 కోట్లు..

## ఇండియన్ బాక్సాఫీస్ వద్ద చరిత్ర సృష్టించిన స్పైడర్‌మ్యాన్

హాలీవుడ్ మోస్ట్ అవేటెడ్ మూవీ 'స్పైడర్-మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. విడుదలైన మొదటి రోజే అద్భుతమైన కలెక్షన్లతో బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. ఇప్పటివరకు 'అవెంజర్స్: ఎండ్‌గేమ్' (రూ.53.10 కోట్లు) పేరిట ఉన్న ఫస్ట్ డే కలెక్షన్స్ రికార్డ్‌ను ఈ సినిమా అధిగమించింది. ఇండియాలో మరే హాలీవుడ్ సినిమా సాధించని విధంగా తొలి రోజు ఏకంగా రూ.61కోట్ల నెట్ కలెక్షన్లతో ఆల్ టైమ్ నెంబర్ వన్ స్థానాన్ని సొంతం చేసుకుంది. ఇండియా వ్యాప్తంగా అన్ని వెర్షన్లలో కలిపి 5వేల పైచిలుకు స్క్రీన్లలో ఈ సినిమా విడుదల కాగా.. హాలీవుడ్ చరిత్రలోనే ఇండియాలో అత్యంత భారీ విడుదల కావడం విశేషం. స్పైడర్‌మ్యాన్ సిరీస్‌లో ఇదే అత్యధిక మొదటి రోజు వసూలు కాగా, 'సోనీ పిక్చర్స్




ఎంటర్‌టైన్‌మెంట్' బ్యానర్‌పై వచ్చిన చిత్రాల్లో ఇండియాలో బిగ్గెస్ట్ ఓపెనర్‌గా నిలిచింది. మొదటి రోజే భారీ వసూళ్లు రాబట్టిన ఈ చిత్రం లాంగ్ వీకెండ్ ముగిసేసరికి సుమారు రూ.200 కోట్ల వరకు కలెక్షన్లను సాధించే అవకాశం ఉందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.




## ది ప్యారడైజ్... 6న టీజర్ లాంచ్

'దసరా' వంటి సంచలన విజయం తర్వాత న్యాచురల్ స్టార్ నాని,దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం 'ది ప్యారడైజ్'. ఈ సినిమాకి సంబంధించిన ఒక క్రేజీ అప్డేట్‌ను దర్శకుడు సోషల్ మీడియా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ చిత్రం టీజర్‌ను ఈ నెల 6న విడుదల చేస్తామని అధికారికంగా ప్రకటించారు. నాని 'జడల్' అనే విలక్షణమైన పాత్రలో కనిపిస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. 'దసరా' కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో సినీ ప్రేక్షకుల్లోనూ, నాని అభిమానుల్లోనూ విశేషమైన ఆసక్తి నెలకొంది. ఇక నాని సరసన కయాదు లోహార్ కథానాయికగా నటిస్తోంది. వీరితో పాటు కలెక్షన్ కింగ్ మోహన్‌బాబు, సీనియర్ నటుడు తనికెళ్ల భరణి, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు, ఈశ్వరీరావు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ అంచనాల నడుమ తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సెప్టెంబరులో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

## షూటింగ్‌లో రష్మిక మందన్నాకు గాయం



టాలీవుడ్‌ను గాయాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే పలువురు హీరోలు అనుకోకుండా ఆస్పత్రి పాలవ్వగా.. తాజాగా స్టార్ హీరోయిన్ రష్మిక మందన్నా గాయపడింది. 'మైసా', 'రణబాలి' చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక షూటింగ్‌లో యాక్షన్, నృత్య సన్నివేశాలు తెరకెస్తుండగా తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. మామూలుగా అథ్లెట్లలో కనిపించే టిండాన్ గాయం రష్మికలో చూసి వైద్యులు షాకయ్యారు. గాయం తీవ్రత పెద్దదేనని... ఆరు వారాల విశ్రాంతితో పాటు రిహాబిలిటేషన్ తప్పనిసరని వెల్లడించారు. దాంతో మైసా, రణబాలి షూటింగ్ నుంచి రష్మిక బ్రేక్ తీసుకోనుంది.